www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మే 7 వరకు జైల్లోనే..

కేజ్రీవాల్, కవిత కస్టడీ పొడిగింపు

ఇద్దరూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరు

ఈడీకి పరిధేమీ లేదు 3

జాతీయ దర్యాప్తు సంస్థకు ట్రాన్సిట్ ఆర్డర్ అవసరం లేదు

కవితను అరెస్టు చేయబోమని ఈడీ ఎప్పుడూ చెప్పలేదు

బలమైన సాక్ష్యాలు ఉన్నందునే ఆమెను అరెస్టు చేశాం: ఈడీ వాదన

ఎట్టకేలకు కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ 11

స్వల్ప మోతాదులో ఇచ్చిన జైలు అధికారులు

బుధవారం | 24-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 25 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి పూర్తి; నక్షత్రం: స్వాతి రా. 12.14 తదుపరి విశాఖ
వర్జ్యం: శేషం ఉ. 6.22 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.48-12.38; అమృతఘడియలు: మ. 3.05-4.50; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.56; సూర్యాస్తమయం: 6.29

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఖమ్మం బరిలో ప్రియాంక?



అవకాశాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం

రాయ్‌బరేలీ, ఖమ్మం.. రెండు స్థానాల నుంచీ పోటీ!

అన్ని ప్రత్యామ్నాయాలపైనా పార్టీ పెద్దల కసరత్తు

రాష్ట్రంలో మూడు సీట్లపై కొనసాగుతున్న పంచాయితీ

కేరళకు వెళ్లిన డిప్యూటీ సీఎం భట్టి.. కేసీ వేణుగోపాల్‌ను కలిసేందుకేనని ప్రచారం

నేడు ఢిల్లీకి వెళ్లే అవకాశం.. అక్కడ ఖమ్మం అభ్యర్థిపై తుది నిర్ణయం?

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రోజుకో మలుపు తిరుగుతున్న ఖమ్మం సీటు పంచాయితీ.. చివరికి అనూహ్యమైన మలుపు తీసుకోనుందా? అక్కడి నుంచి కాంగ్రెస్ అధిష్ఠానం ఏకంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీనే బరిలోకి దింపే అవకాశం ఉందా? ప్రస్తుతం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్రంగా నడుస్తున్న చర్చ ఇది. రాష్ట్రంలోని 17 సీట్లలో ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ తప్ప మిగిలిన వాటికి కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. వీటిలో ఖమ్మం స్థానంపై తొలి నుంచీ చర్చ జరుగుతోంది. పార్టీ కచ్చితంగా గెలిచే అవకాశాలు ఉన్న ఈ స్థానం నుంచి సోనియాగాంధీని పోటీ చేయించాలనే ప్రతిపాదన రాష్ట్ర కాంగ్రెస్ నుంచి తొలుత బలంగా ముందుకు వచ్చింది. ఈ మేరకు అధిష్ఠానానికి తెలియజేసినప్పటికీ.. అక్కడి నుంచి సానుకూల సంకేతాలు రాలేదు. పైగా, సోనియాగాంధీ రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీంతో స్థానిక అభ్యర్థులు ఖమ్మం టికెట్ కోసం ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయితే, అనూహ్యంగా మళ్లీ గాంధీ కుటుంబానికి చెందిన ప్రియాంక పేరు తాజాగా ముందుకు రావటం విశేషం.



ప్రియాంక పేరును కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ప్రియాంక ఖమ్మం నుంచి పోటీ చేయటం అనేది.. రాహుల్ పోటీ చేసే స్థానాలపై ఆధారపడే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. వయనాడ్ నుంచి సిటింగ్ ఎంపీగా ఉన్న రాహుల్ ఇప్పటికే ఆ స్థానంలో నామినేషన్ వేశారు. వయనాడ్‌తోపాటు యూపీలోని అమేథీ నుంచి కూడా రాహుల్ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే ఉత్తరాది, దక్షిణాది రెండింటి నుంచీ రాహుల్

మిగతా 13వ పేజీలో...

పెద్దల సూచనతోనే రాజేందర్‌రావు నామినేషన్

నేడో, రేపో కరీంనగర్ అభ్యర్థిపై ప్రకటన: పొన్నం

14

ఖమ్మంలో రఘురాంరెడ్డి నామినేషన్

కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించకుండానే బరిలోకి దిగిన పొంగులేటి వియ్యంకుడు

రుణమాఫీ చేస్తా.. బీఆర్ఎస్‌ను రద్దు చేస్తారా?

హరీశ్‌కు సీఎం రేవంత్ ప్రతి సవాల్

బావోజీ, సేవాలాల్ సాక్షిగా పంద్రాగస్టులోగా రుణమాఫీ

ప్రజల్ని మోసం చేసినందుకు కేసీఆర్‌కు కోదండం వేయాలి

3900 కోట్ల లోటు బడ్జెట్‌తో సీఎంగా బాధ్యతలు చేపట్టా

4 నెలల్లో రూ.26 వేల కోట్ల అప్పుల కిస్తీలు, మిత్తి చెల్లించా

వంద రోజుల్లో అయిదు గ్యారెంటీలను అమలు చేశాం

అన్నదమ్ములుగా ఉంటున్న మతాల మధ్య బీజేపీ చిచ్చు

మోదీ చేతిలో కత్తి డీకే అరుణ.. పాలమూరు అభివృద్ధిపై కక్ష

గడీల్ని బద్దలు కొడతానన్న ప్రవీణ్.. దొరల పంచన చేరారు

కొడంగల్, బిజినేపల్లి సభల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లిలో కాంగ్రెస్ ఎన్నికల సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు విసురుతున్న సవాళ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూటిగా స్పందించారు. ఆగస్టు 15వ తేదీలోపు రుణమాఫీ చేసి హామీని నిలబెట్టుకుంటానని, మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ప్రతి సవాల్ విసిరారు. రైతు రుణమాఫీ చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తనకు సవాల్ విసిరారని, అటు సూర్యుడు ఇటు పొడిచినా రుణమాఫీ చేస్తానని స్పష్టం చేశారు. లంబాడ గిరిజనుల ఆరాధ్య దైవాలైన బావోజీ, సేవాలాల్‌ల సాక్షిగా ఆగస్టు 15లోగా అది జరుగుతుందని పునరుద్ఘాటించారు. తాను మాట ఇస్తే ఎలా ఉంటుందో హరీశ్‌రావు తన మామ కేసీఆర్‌ను అడిగి తెలుసుకోవాలన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ తాను రుణమాఫీ చేస్తే.. బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా అని హరీశ్‌కు సీఎం ప్రతి సవాల్ విసిరారు. మంగళవారం నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. తాము వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలకుగాను ఐదు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, కేసీఆర్ పదేళ్లలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ విద్య, దళితులకు మూడెకరాల భూమి.. ఇలా ఏ హామీనీ కేసీఆర్

మిగతా 12వ పేజీలో...

మగాడివైతే రుణమాఫీ చేసి చూపించు!

సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్

అరచేతిలో వైకుంఠం చూపి మీరు అధికారంలోకి వచ్చారు

అది పార్ట్-1.. ఇప్పుడు పార్ట్-2లో మళ్లీ ప్రజల్ని మోసగించే యత్నం

రాష్ట్రంలో 12 లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

ఎన్డీయే, ఇండియా కూటములకు మెజారిటీ కష్టమే 10

రాజేంద్రనగర్, అలంపూర్, వరంగల్‌లో కేటీఆర్ వ్యాఖ్యలు

కాంగ్రెస్ వాటా.. ముస్లిం కోటా

దళితులు, ఆదివాసీల రిజర్వేషన్ల కత్తిరింపు!

2004లో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పైలట్ ప్రాజెక్టు

2011లో కూడా దేశవ్యాప్తంగా అమలుకు యత్నాలు

మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

ఇప్పుడు కాంగ్రెస్ వస్తే.. మళ్లీ అదే ప్రయత్నం చేస్తుంది

మీ ఆస్తులను ఎక్స్‌-రే చేసి.. ముస్లింలకు పంచుతుంది

కర్ణాటకలో హనుమాన్ చాలీసా వినడం కూడా నేరమైంది

రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఏలికలో రామనవమిపై రాళ్లదాడి

దక్షిణాదిని వేరు చేయాలని కర్ణాటక కాంగ్రెస్ నేత అంటారు

దేశాన్ని మళ్లీ విభజించాలని ఆ పార్టీ కోరుకుంటోందా?

రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ర్యాలీల్లో.. కాంగ్రెస్‌పై మోదీ ఆగ్రహం

ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు కొనసాగుతాయని వాగ్దానం



జైపూర్/రాయ్‌పూర్, ఏప్రిల్ 23: దేశంలో మతపరమైన రిజర్వేషన్లకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, మీ(హిందువుల) ఆస్తులను ఎక్స్‌-రే చేసి, ఎంపిక చేసిన వర్గానికి (ముస్లింలకు) పంచాలని చూస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. దేశాన్ని విభజించాలన్నట్లుగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో హనుమాన్ చాలీసాను వినడం కూడా నేరంగా మారిందని (కర్ణాటకలో), రామనవమి వేడుకలపై రాళ్లదాడులు జరిగేవని (కాంగ్రెస్ పాలనలో రాజస్థాన్‌లో) విమర్శించారు. రాజస్థాన్‌లోని టోంక్‌లో.. ఛత్తీస్‌గఢ్‌లోని శక్తి జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 2004 నుంచి ముస్లిం రిజర్వేషన్లే ఎజెండాగా కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. "2004లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పైలట్ ప్రాజెక్టుగా తన ప్రయత్నాలను ప్రారంభించింది. అక్కడ(ఏపీలో) దళితులు, గిరిజనుల

మిగతా 11వ పేజీలో...



రేపట్నుంచి వడగాలులు

గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలోని 9 జిల్లాలకు అలర్ట్

నల్లగొండ జిల్లా టిక్యా తండాలో 45.1 డిగ్రీలు

ఐదు రోజులపాటు దేశమంతటా వడగాలులు

భారత వాతావరణ శాఖ హెచ్చరిక

పోలింగ్ శాతంపై ప్రభావం చూపే అవకాశం

వేసవి ఆరంభంలోనే నీటి కష్టాలు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 22 రాష్ట్రాల్లో అడుగంటుతున్న జలాశయాలు

దక్షిణాదిలో ఏడు జలాశయాలు 'డెడ్ జోన్'కు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఇంకా మే నెల రాలేదు కానీ.. దేశంలో ఎండలు మండిపోతున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరుకోవడంతో వడగాలులు వీస్తున్నాయి. తెలంగాణలోనూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలోని 9 జిల్లాల్లో వడగాలులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వడగాలుల ప్రభావం ఉంటుందని పేర్కొంది. వడగాలులకు సంబంధించి గురు, శుక్రవారాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేయగా.. శనివారం మాత్రం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. కాగా బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇక, నల్లగొండ జిల్లా టిక్యా తండాలో మంగళవారం అత్యధికంగా 45.1 డిగ్రీలు నమోదైంది. భద్రాచలంలో 44.9 నల్గొండ జిల్లా బుగ్గబాయి గూడ, ములుగు జిల్లా

మిగతా 14వ పేజీలో...

మోదీ గ్యారెంటీ బ్రహ్మాస్త్రం



గతంతో పోలిస్తే రాష్ట్రంలో బీజేపీ బలం పెరిగింది. ఇతర పార్టీల నుంచి చేరికలతో ఊపు వచ్చింది. సర్వేలు కూడా సానుకూలంగా ఉన్నాయి. వీటికితోడు తెలంగాణలో మెజారిటీ సీట్లు గెలిచేందుకు మోదీ గ్యారెంటీ నినాదాన్ని బ్రహ్మాస్త్రంగా ప్రయోగించాలని రాష్ట్ర బీజేపీ భావిస్తోంది. 'మోదీ కోసం.. మోదీ గ్యారెంటీ కోసం ఓటేయండి' అనే నినాదంతో విస్తృత ప్రచారం చేస్తున్న ఆ పార్టీ.. తద్వారా ఒకటి రెండుచోట్ల అభ్యర్థులపై ఉన్న వ్యతిరేకతను కూడా అధిగమించవచ్చని యోచిస్తోంది.

రాష్ట్రంలో 5 సభల్లో పాల్గొననున్న ప్రధాని మోదీ

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ దూకుడుకు వ్యూహాత్మక అడ్డుకట్ట

21 రోజుల ప్రత్యేక కార్యాచరణతో కమల దళ ప్రచారం.. మెజారిటీ సీట్లే లక్ష్యం

ప్రత్యామ్నాయం దిశగా అడుగు.. అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన ప్రదర్శనతో ఆశావహం

చేరికలతో ఈసారి లోక్‌సభ బరిలో బలమైన అభ్యర్థులు..సర్వేలతో శ్రేణుల్లో ఉత్సాహం

హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మెజారిటీ లోక్‌సభ సీట్లను గెలుచుకోవడమే లక్ష్యంగా బీజేపీ అడుగులు వేస్తోంది. ప్రత్యేక కార్యాచరణతో ప్రచారాస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. "ఎన్డీయే కూటమి గెలవనున్న 400 పైగా స్థానాల్లో అభ్యర్థి ముఖ్యం కాదు.. మోదీని చూసి ఓటెయ్యండి" అని కోరుతోంది. దేశ భద్రత, సమగ్రతతో పాటు సంక్షేమం, అభివృద్ధి కోసం మరోసారి ఆయనను ప్రధాని చేయాలని ఓటర్లను స్థానిక నాయత్వం అభ్యర్థిస్తోంది. "మోదీ పథకాలే నన్ను గెలిపిస్తాయి" అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పేర్కొనడం కూడా దీనినే సూచిస్తోంది. కాగా, రాష్ట్రంలో ఐదుచోట్ల మోదీ బహిరంగ సభలకు బీజేపీ జాతీయ నాయకత్వం ప్రణాళికలు వేసింది. నాలుగు సభలు, ఒక

మిగతా 13వ పేజీలో...

తెలంగాణలో ప్రచారానికి తమిళి సై..

నిన్న గవర్నర్.. నేడు బీజేపీ స్టార్ క్యాంపెయినర్

తమిళిసై సహా 40 మంది నేతలతో బీజేపీ జాబితా 12



11

ఆ నిబంధన ఎందుకు తొలగించారు?


పతంజలి కేసులో కేంద్రాన్ని నిలదీసిన సుప్రీంకోర్టు

డీఎంఆర్ యాక్టులోని రూల్ నంబర్ 170 ప్రకారం చర్యలు తీసుకోవద్దంటూ రాష్ట్రాలకు కేంద్రం లేఖ

ఆ లేఖపై వివరణ ఇవ్వాలని ఆయుష్ శాఖకు ఆదేశం

ఎఫ్ఎంసీజీ సంస్థల మిస్‌లీడింగ్ యాడ్స్‌పై తీసుకున్న చర్యలేమిటో చెప్పాలని మూడు శాఖలకు ఆదేశం

పతంజలి 'క్షమాపణ' ప్రకటనల పరిమాణంపై ఆరా





11

విమానాల్లో పిల్లలకు అమ్మానాన్నల పక్కనే సీటు

విమానయాన సంస్థలకు డీజీసీఏ ఆదేశాలు

శివబాలకృష్ణ బినామీల అరెస్ట్

హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ అక్రమాస్తుల కేసులో ముగ్గురు అదుపులోకి..

హైదరాబాద్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. శివబాలకృష్ణ అక్రమంగా సంపాదించిన మొత్తంతో ఆస్తులు కూడబెట్టడంలో బినామీలుగా వ్యవహరించిన ముగ్గురిని మంగళవారం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. సత్యనారాయణ మూర్తి, భరత్ కుమార్, భరణి కుమార్‌ను రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఇద్దరు వ్యాపారం, మరొకరు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఏసీబీ కస్టడీలో శివబాలకృష్ణ వెల్లడించిన వివరాల మేరకు మరికొందరికి నోటీసులిచ్చి ప్రశ్నించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

రేపు మేడిగడ్డకు జస్టిస్ పీసీ ఘోష్

ఆ తర్వాత అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సందర్శన

హైదరాబాద్‌లో నేడు అధికారులతో సమావేశం



14

బిజినెస్

వరంగల్ ● బుధవారం 24 ఏప్రిల్ 2024

ఇండియా ఇన్‌వాల్వ్‌డ్ ర్యాంకింగ్‌లో

రిలయన్స్ టాప్



న్యూఢిల్లీ: వికసిత్ భారత్ లక్ష్యాలపై భారత కార్పొరేట్ రంగం నిబద్ధతను మదించే ఇండియా ఇన్‌వాల్వ్‌డ్ ర్యాంకింగ్‌లో ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) అగ్రస్థానంలో నిలిచింది. సామాజిక- ఆర్థిక సమస్యలు, సమ్మిళిత వృద్ధి వంటి అంశాలపై దృష్టిసారించిన దేశీయ మేధోమదన సంస్థ స్కోచ్ గత ఏడాదికి గాను ఈ ర్యాంకింగ్‌లను విడుదల చేసింది. 231 అంశాలపై పలు కంపెనీలను ఆరు నెలల పాటు అధ్యయనం చేసి టాప్ 20 కంపెనీలకు ర్యాంకింగ్స్ కేటాయించినట్లు స్కోచ్ తెలిపింది. మరిన్ని విషయాలు..

- హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్), అదానీ గ్రూప్.. రిలయన్స్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.
- 'ఇండియా ఇన్‌వాల్వ్‌డ్ ర్యాంకింగ్ ఇన్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌'లో జియో ప్లాట్‌ఫామ్స్‌దే అగ్రస్థానం. లూపిన్, హెరిటేజ్ ఫుడ్స్ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.
- ఈఎస్‌జీ (పర్యావరణ, సామాజిక, పరిపాలన) ర్యాంకింగ్స్‌లో హెచ్‌యూఎల్, అదానీ గ్రూప్, బ్రిటానియా వరుసగా తొలి మూడు స్థానాలను దక్కించుకున్నాయి.
- కార్పొరేట్ ఎక్సలెన్స్ ర్యాంకింగ్‌లో బ్యాంక్ ఆఫ్ ఇండియా అగ్రస్థానంలో ఉండగా.. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ ఆ తర్వాత స్థానాలు లభించాయి.

వాతావరణ మార్పులతో ధరలు మళ్లీ పైకి..!

హెచ్చరించిన ఆర్‌బీఐ బులెటిన్

ముంబై: వాతావరణంలో తీవ్ర మార్పులతో పాటు దీర్ఘకాలిక భౌగోళిక రాజకీయ అనిశ్చితులతో ద్రవ్యోల్బణానికి ముప్పు పొంచి ఉన్నప్పటికీ, జీడీపీ వృద్ధి పథంలో మరింత ఎగబాకేందుకు అవసరమైన పరిస్థితులు రూపొందుతున్నాయని మంగళవారం విడుదల చేసిన ఏప్రిల్ బులెటిన్‌లో ఆర్‌బీఐ పేర్కొంది. ద్రవ్యపరపతి విధాన సమీక్షలో కీలక వడ్డీ (రెపో) రేట్లపై నిర్ణయం తీసుకునేందుకు కీలకమైన రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణం మార్చిలో 4.9 శాతానికి తగ్గింది. అంతక్రితం వరుసగా రెండు నెలలు సూచీ 5.1 శాతంగా నమోదైంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం..ఈ ఏడాది సాధారణం కంటే అధికంగా నమోదుకానున్న వర్షాలు ఆహార ధరలు తగ్గుముఖం పట్టేందుకు దోహదపడనున్నప్పటికీ ఈ వేసవిలో వాటి రేట్లు ఎగబాకే అవకాశాలున్నందున పరిస్థితులను జాగ్రత్తగా గమనించాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ అభిప్రాయపడింది.

ఆస్టన్ మార్టిన్ వాంటేజ్ స్పోర్ట్ కారు

ధర రూ.3.99 కోట్లు

బ్రిటిష్ లగ్జరీ కార్ల దిగ్గజం ఆస్టన్ మార్టిన్.. భారత మార్కెట్లోకి సరికొత్త స్పోర్ట్స్ కారు 'వాంటేజ్' విడుదల చేసింది. ఈ కారు ధర రూ.3.99 కోట్లు (ఎక్స్‌షోరూమ్). 4.0 లీటర్ వీ8 ట్విన్ టర్బో ఇంజన్‌తో కూడిన ఈ కారు కేవలం 3.5 సెకన్లలో వంద కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దేశంలో హై-పెర్ఫార్మెన్స్ డ్రైవింగ్ అనుభూతిని అందించే విధంగా వాంటేజ్‌ను తీర్చిదిద్దినట్లు ఆస్టన్ మార్టిన్ సీఈఓ అమెదెవ్ ఫెలిసా వెల్లడించారు. సరికొత్త ఇంటీరియర్, 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్‌ను ఇందులో పొందుపరిచనట్లు చెప్పారు.



ఫోక్స్‌వ్యాగన్ సరికొత్త టైగున్



చెన్నై: జర్మనీకి చెందిన ఆటోమొబైల్ కంపెనీ ఫోక్స్‌వ్యాగన్.. దేశీయ మార్కెట్లోకి తన స్పోర్ట్స్ యుటిలిటీ వాహనం (ఎస్‌యూవీ) టైగున్‌లో రెండు కొత్త వేరియంట్స్‌ను విడుదల చేసింది. పోర్టుఫోలియోను మరింతగా విస్తరించే ఉద్దేశంతో టైగున్ జీటీ లైన్, జీటీ ప్లస్ స్పోర్ట్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు కంపెనీ తెలిపింది. 1.0 లీటర్ టీఎస్ఐ ఇంజన్‌తో కూడిన టైగున్ జీటీ లైన్ ధర రూ.14.08 లక్షలుగా ఉండగా 1.5 లీటర్ టీఎస్ఐ ఇంజన్ కలిగిన జీటీ ప్లస్ స్పోర్ట్ ధర రూ.18.53 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉందని పేర్కొంది. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన ఫోక్స్‌వ్యాగన్ యాన్యువల్ బ్రాండ్ కాన్ఫరెన్స్‌లో భాగంగా ఈ ఎస్‌యూవీలను కంపెనీ ఆవిష్కరించింది.

బొలెరో నియో, అమేజ్‌లో భద్రత డొల్ల!

రెండు కార్లకు తక్కువ రేటింగ్ కేటాయించిన గ్లోబల్ ఎన్‌క్యాప్

న్యూఢిల్లీ: మహీంద్రా బొలెరో నియో, హోండా అమేజ్‌లో భద్రత ప్రమాణాలు పేలవంగా ఉన్నాయని బ్రిటన్‌కు చెందిన వాహన భద్రత రేటింగ్ సంస్థ గ్లోబల్ ఎన్‌క్యాప్ అంటోంది. ఈ రెండు కార్లకు సంస్థ అతి తక్కువ రేటింగ్‌ను కేటాయించింది. పెద్దలు, పిల్లల భద్రత పరంగా బొలెరో నియోకు కేవలం ఒక స్టార్ రేటింగ్ లభించింది. అమేజ్‌లో పెద్దల భద్రత పరంగా 2 స్టార్స్, పిల్లల సేఫ్టీలో సున్నా రేటింగ్‌ను కేటాయించింది. కాగా, కియా కారెన్స్‌లో పెద్ద భద్రతకు 3, పిల్లల సేఫ్టీ విషయంలో 5 స్టార్ రేటింగ్‌ను కేటాయించింది. గ్లోబల్ ఎన్‌క్యాప్ 5 స్టార్ రేటింగ్ అత్యంత భద్రతకు, సున్నా స్టార్ రేటింగ్ భద్రత డొల్లతనానికి సంకేతం. కాగా, మహీంద్రాకు చెందిన థార్, ఎక్స్‌యూవీ 700, 300, స్కార్పియో ఎన్ మోడళ్లకు మాత్రం అత్యంత భద్రతకు ప్రామాణికమైన 4, 5 స్టార్ రేటింగ్ లభించింది.

బ్యాటరీల తయారీ యూనిట్ల రేసులో అమర రాజా

న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం కింద అధునాతన కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీల తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు అమర రాజా గ్రూప్ కంపెనీ అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆసక్తి చూపిస్తోంది. ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన టెండర్‌కు అనుగుణంగా ఇందుకోసం బిడ్ కూడా సమర్పించింది. అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ, లుకాస్ టీవీఎస్ లిమిటెడ్, వారీ ఎనర్జీస్ లిమిటెడ్ వంటి 10 కంపెనీలు ఇందుకోసం బిడ్స్ సమర్పించాయి.

కేంద్ర ప్రభుత్వం 10 గిగావాట్ల ఎనర్జీ స్టోరేజీ బ్యాటరీల తయారీ కోసం టెండర్ జారీ చేస్తే ఈ 10 కంపెనీలు 70 గిగావాట్ల ఇంధన స్టోరేజీ బ్యాటరీల తయారీకి బిడ్స్ సమర్పించాయి.

హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్

హిటాచీ ఎనర్జీ ఇండియా

హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయనున్నట్లు హిటాచీ ఎనర్జీ ఇండియా వెల్లడించింది. భారత్‌లో కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం నాడిక్కడ సంస్థ ఎండీ, సీఈఓ ఎన్ వేణు మాట్లాడుతూ.. త్వరలోనే హైదరాబాద్‌లో జీసీసీని నెలకొల్పటంతో పాటు వరంగల్‌లో ఒక లేబొరేటరీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అయితే జీసీసీ ఏర్పాటుకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. భారత్‌లో కంపెనీ కార్యకలాపాల విస్తరణ కోసం గడచిన నాలుగేళ్లుగా ఏటా రూ.100 కోట్లు పెట్టుబడులు పెడుతూ వస్తున్నట్లు వేణు తెలిపారు. ఈ పెట్టుబడులతో కొత్తగా మూడు ప్లాంట్లు నెలకొల్పినట్లు చెప్పారు. అంతేకాకుండా భారత్‌లో కంపెనీ మొత్తం ప్లాంట్ల సంఖ్య 19కి చేరిందని వివరించారు. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా కంపెనీ సేల్స్ ఆఫీస్‌లను నిర్వహిస్తోందన్నారు. హిటాచీ ఎనర్జీ.. హై-వోల్టేజ్ స్విచ్‌గేర్, బ్రేకర్స్ హై-వోల్టేజ్ డైరెక్ట్ కరెంట్ (హెచ్‌వీడీసీ), ట్రాన్స్‌ఫార్మర్లు, సెమీకండక్టర్స్ సహా పలు ఉత్పత్తులను తయారు చేస్తోంది.

సైయెంట్ డీఎల్ఎం లాభంలో 81 శాతం వృద్ధి

హైదరాబాద్: గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో సైయెంట్ డీఎల్ఎం రూ.361.8 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.22.7 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 30.5 శాతం, లాభం 80.7 శాతం వృద్ధి చెందింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1,191.90 కోట్ల ఆదాయంపై రూ.61.20 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు తెలిపింది.

లాభాల బాటలోనే..

సెన్సెక్స్ 90 పాయింట్లు అప్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో దేశీయ ఈక్విటీ మదుపరులు టెలికాం, టెక్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగ షేర్లలో కొనుగోళ్లు పెంచడం ఇందుకు దోహదపడింది. అయితే, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ మార్కెట్ లాభాలను పరిమితం చేశాయి. మంగళవారం ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ ఒక దశలో 400 పాయింట్లకు పైగా పుంజుకున్నప్పటికీ, చివరికి 89.83 పాయింట్ల లాభంతో 73,738.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 31.60 పాయింట్ల వృద్ధితో 22,447.55 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 18 లాభపడ్డాయి. ఫారెక్స్ మార్కెట్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 5 పైసలు పెరిగి 83.31 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ రకం ముడి చమురు పీపా ధర ఒకదశలో 0.41 శాతం పెరిగి 87.36 డాలర్ల వద్ద ట్రేడైంది.



ఆఫీస్ స్పేస్ సొల్యూషన్స్ ఐపీఓకు సెబీ ఓకే : కో-వర్కింగ్ స్పేస్ కంపెనీ ఆఫీస్ స్పేస్ సొల్యూషన్స్‌తో పాటు ట్రావెల్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ టీబీఓ టెక్ లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రతిపాదనలకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా టీబీఓ టెక్ రూ.400 కోట్ల తాజా ఈక్విటీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన 1,56,35,996 ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. ఆఫీస్ స్పేస్ రూ.160 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు పలు ఇన్వెస్టర్లకు చెందిన కోటికి పైగా ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన అమ్మకానికి పెట్టనుంది.

- నోయిడాకు చెందిన లిథియం బ్యాటరీ, సోలార్ ప్యానెళ్ల తయారీ సంస్థ ఆర్‌సీఆర్ఎస్ ఇన్నోవేషన్స్ లిమిటెడ్ ఐపీఓ ద్వారా నిధుల సమీకరించేందుకు ఎన్ఎస్ఈలోని ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ ఎన్ఎస్ఈ ఎమర్జ్‌కు ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.10 ముఖవిలువ కలిగిన 48.24 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. తద్వారా సేకరించే నిధులను వ్యాపార విస్తరణకు ఉపయోగించుకోనున్నట్లు సంస్థ పేర్కొంది.
- జేఎన్‌కే ఇండియా పబ్లిక్ ఆఫరింగ్ తొలిరోజు ముగిసేసరికి, ఇష్యూ సైజులో 49 శాతానికి సమానమైన సబ్‌స్క్రిప్షన్ లభించింది.

నిఫ్టీ నెక్స్ట్ 50 డెరివేటివ్ కాంట్రాక్టుల ట్రేడింగ్ నేటి నుంచే..

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ నెక్స్ట్ 50 డెరివేటివ్ కాంట్రాక్టులను బుధవారం నుంచి ప్రవేశపెట్టనుంది. ఈ కాంట్రాక్టుల ట్రేడింగ్‌ను ప్రారంభించేందుకు ఎక్స్ఛేంజీకి ఈ మధ్యనే సెబీ ఆమోదం తెలిపింది. నిఫ్టీ 100లో నిఫ్టీ 50 కంపెనీలను మినహాయించగా మిగిలిన కంపెనీలకు ప్రాతినిధ్య సూచీయే నిఫ్టీ నెక్స్ట్ 50. ఈ డెరివేటివ్ కాంట్రాక్టుల్లో భాగంగా ఎక్స్ఛేంజీ మూడు వరుస నెలల ఇండెక్స్ ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ కాంట్రాక్టులను ఆఫర్ చేయనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,160 ▼	66,150 ▼	86,500 ▼
ముంబై	71,591 ▼	65,584 ▼	80,007 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ

హైదరాబాద్	350	విజయవాడ	380
వరంగల్	352	గోదావరి	380
చిత్తూరు	473	విశాఖపట్నం	400

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	118	గోదావరి	121
వరంగల్	118	విజయవాడ	121
కరీంనగర్	118	గుంటూరు	125
మహబూబ్‌నగర్	118	ఒంగోలు	125
కర్నూలు	118	చిత్తూరు	110
విశాఖపట్నం	113		

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: ఢిల్లీ

ఢిల్లీ X గుజరాత్

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
379 (8 మ్యాచ్‌లు)	13 (8 మ్యాచ్‌లు)

టీటీలో భారత్ నెంబర్ వన్ శ్రీజ



టీటీ జాతీయ ర్యాంకింగ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ స్టార్ ప్యాడ్లర్, కామన్వెల్త్ క్రీడల పతకధారి ఆకుల శ్రీజ జాతీయ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని సొంతం చేసుకుంది. మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో తెలుగమ్మాయి శ్రీజ.. మనికా బాత్రాను వెనక్కి నెట్టి, టాప్‌కి చేరింది. అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో శ్రీజ ప్రస్తుతం 38వ స్థానంలో ఉంది. ఇటీవల జరిగిన డబ్ల్యూటీటీ ఫీడర్ కార్పస్ క్రిస్టీ, డబ్ల్యూటీటీ ఫీడర్ బీరూట్ టైటిళ్లను శ్రీజ కైవసం చేసుకోవడం తెలిసిందే. పురుషుల్లో శరత్ కమల్ జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంక్‌ను దక్కించుకోగా, అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో 37వ స్థానంలో కొనసాగుతున్నాడు.

'స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ద ఇయర్' జొకో



మాడ్రిడ్: ప్రతిష్ఠాత్మక లారెస్ క్రీడా వార్షిక అవార్డులను సోమవారం రాత్రి ఇక్కడ ప్రదానం చేశారు. గత ఏడాది ఉత్తమ క్రీడాకారుడి పురస్కారాన్ని టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ అందుకున్నాడు. స్పెయిన్ ఫుట్‌బాలర్ ఐటానా బోన్మాటి ఉత్తమ క్రీడాకారిణి అవార్డు దక్కించుకుంది. అమెరికా స్టార్ జిమ్నాస్ట్ సైమన్ బైల్స్ పునరాగమన ప్లేయర్ అవార్డు అందుకుంది.

'లారెస్'లో కోహ్లి ఇన్నింగ్స్



కోహ్లీకి అరుదైన గౌరవం.. విరాట్ కోహ్లీకి మరో ఘనత దక్కింది. ప్రతిష్ఠాత్మక లారెస్ క్రీడా అవార్డుల ప్రదానోత్సవంలో.. కోహ్లి ఆడిన ఇన్నింగ్స్‌ను ప్రదర్శించారు. 'లారెస్ మహత్తర క్షణాలు' పేరిట కోహ్లి వన్డేలలో చేసిన 50వ సెంచరీ ఇన్నింగ్స్‌ను ప్రదర్శించారు. న్యూజిలాండ్‌తో గతేడాది ముంబైలో జరిగిన వరల్డ్ కప్ సెమీఫైనల్లో విరాట్ ఆ శతకం (117) సాధించాడు.

స్టొయినిస్.. ఒంటిచేత్తో..

- లఖ్‌నవూ అద్భుత విజయం
- చెన్నైకు మళ్లీ షాక్
- రుతురాజ్ శతకం వృథా


స్టొయినిస్ (63 బంతుల్లో 124 నాటౌట్)

చెన్నై: మార్కస్ స్టొయినిస్ (63 బంతుల్లో 13 ఫోర్లు, 6 సిక్స్‌లతో 124 నాటౌట్) మ్యాచ్ విన్నింగ్ శతకంతో.. డిఫెండింగ్ చాంప్ చెన్నై సూపర్ కింగ్స్‌కు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మళ్లీ షాకిచ్చింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ 6 వికెట్లతో చెన్నైను ఓడించింది. తొలుత చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 210/4 స్కోరు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (60 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లతో 108 నాటౌట్), శివమ్ దూబే (27 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లతో 66) ఇన్నింగ్స్ వృథా అయ్యాయి. హెన్రీ, యశ్ ఠాకూర్ చెరో వికెట్ పడగొట్టారు. ఛేదనలో లఖ్‌నవూ 19.3 ఓవర్లలో 4 వికెట్లకు 213 రన్స్ చేసి గెలిచింది. పూరన్ (15 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34) రాణించాడు. పతిరన 2 వికెట్లు తీశాడు. స్టొయినిస్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

తడబడి.. నిలబడి: ఛేదనలో లఖ్‌నవూ ఆరంభంలో తడబడినా.. స్టొయినిస్ ఒంటరి పోరాటంతో జట్టును గెలిపించాడు. పూరన్‌తో కలసి నాలుగో వికెట్‌కు 34 బంతుల్లో 70 పరుగుల భాగస్వామ్యంతో మ్యాచ్‌లో నిలిపాడు. మూడో బంతికే డికాక్ (0)ను దీపక్ డకౌట్ చేసి షాకిచ్చాడు. కానీ, కెప్టెన్ రాహుల్ (16), స్టొయినిస్ జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, ముస్తాఫిజుర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో రాహుల్ వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో పడిక్కల్ (13) సహకారంతో స్టొయినిస్ చెన్నై బౌలర్లపై ఎదురుదాడి చేస్తూ స్కోరు బోర్డును నడిపించడంతో.. పవర్‌ప్లే ముగిసే సరికి లఖ్‌నవూ 45/2తో నిలిచింది. కానీ, పడిక్కల్‌ను పతిరన బౌల్డ్ చేయడంతో.. మూడో వికెట్‌కు 55 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌కు తెరపడింది. 88/3 ఇబ్బందుల్లో పడిన సమయంలో స్టొయినిస్‌కు పూరన్ అండగా నిలిచాడు. చివరి 5 ఓవర్లలో లఖ్‌నవూ విజయానికి 74 పరుగులు కావాల్సి ఉండగా.. పూరన్ 6,4,6తో బ్యాట్‌కు పనిచెప్పాడు. అయితే, కీలక సమయంలో పూరన్‌ను అవుట్ చేసిన పతిరన.. జట్టుకు కావాల్సిన బ్రేక్‌ను అందించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా పోరాటాన్ని కొనసాగించిన స్టొయినిస్ 18వ ఓవర్‌లో సెంచరీ పూర్తి చేసుకోగా.. దీపక్ హుడా (17 నాటౌట్) సిక్స్ బాదడంతో లక్ష్యం 12 బంతుల్లో 32కు దిగివచ్చింది. 19వ ఓవర్‌లో హుడా రెండు బౌండ్రీలతో 15 పరుగులు రాబట్టాడు. ఆఖరి ఓవర్‌లో 17 రన్స్ అవసరం కాగా.. స్టొయినిస్ 6,4,4,4తో ఫినిష్ చేశాడు.

ఆఖర్లో అదరగొట్టారు..: కెప్టెన్ రుతురాజ్ కళాత్మక బ్యాటింగ్.. డెత్‌లో దూబే పవర్ హిట్టింగ్‌తో చెన్నై భారీ స్కోరు సాధించింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 46 బంతుల్లో 104 పరుగుల భాగస్వామ్యంతో జట్టు స్కోరును 200 మార్క్ దాటించారు. తొలి ఓవర్‌లో హెన్రీ బౌలింగ్‌లో రాహుల్ అద్భుత క్యాచ్‌తో ఓపెనర్ రహానె (1) వెనుదిరిగినా.. తుదికంటా నిలిచిన గైక్వాడ్ కీలక భాగస్వామ్యాలతో జట్టును ఆదుకొన్నాడు. లైఫ్ దక్కినా సద్వినియోగం చేసుకోలేక పోయిన మిచెల్ (11)ను యశ్ పెవిలియన్ చేర్చడంతో.. పవర్‌ప్లేలో చెన్నై 49/2తో నిలిచింది. మధ్య ఓవర్లలో గైక్వాడ్, జడేజా (16) వీలుచిక్కినప్పుడల్లా షాట్లు కొడుతూ పరుగులు రాబట్టారు. కానీ, 12వ ఓవర్‌లో చెన్నై స్కోరు సెంచరీ దాటినా.. జడ్డూను క్యాచవుట్ చేసిన మొహిసిన్ మూడో వికెట్‌కు 52 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఈ దశలో దూబే క్రీజులోకి రావడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. మరోవైపు గేర్ మార్చిన గైక్వాడ్ 6,4,4తో శతకం పూర్తి చేసుకొన్నాడు. ఎడాపెడా సిక్స్‌లతో హాఫ్ సెంచరీ సాధించిన దూబే రనౌట్ కాగా.. ధోనీ (4 నాటౌట్) బౌండ్రీతో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. మొత్తంగా చివరి 5 ఓవర్లలో లఖ్‌నవూ 75 పరుగులు సమర్పించుకొంది.


రుతురాజ్ (60 బంతుల్లో 108 నాటౌట్)

స్కోరుబోర్డు

చెన్నై: రహానె (సి) రాహుల్ (బి) హెన్రీ 1, రుతురాజ్ (నాటౌట్) 108, మిచెల్ (సి) హుడా (బి) యశ్ 11, జడేజా (సి) రాహుల్ (బి) మొహిసిన్ 16, శివమ్ దూబే (రనౌట్) 66, ధోనీ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 210/4; వికెట్ల పతనం:** 1-4, 2-49, 3-101, 4-205; **బౌలింగ్:** హెన్రీ 4-0-28-1, మొహిసిన్ 4-0-50-1, రవి బిష్ణోయ్ 2-0-19-0, యశ్ ఠాకూర్ 4-0-47-1, స్టొయినిస్ 4-0-49-0, క్రునాల్ పాండ్యా 2-0-15-0.

లఖ్‌నవూ: డికాక్ (బి) చాహర్ 0, రాహుల్ (సి) రుతురాజ్ (బి) ముస్తాఫిజుర్ 16, స్టొయినిస్ (నాటౌట్) 124, పడిక్కళ్ (బి) పతిరన 13, పూరన్ (సి) శార్దూల్ (బి) పతిరన 34, హుడా (నాటౌట్) 17, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 19.3 ఓవర్లలో 213/4; వికెట్ల పతనం:** 1-0, 2-33, 3-88, 4-158; **బౌలింగ్:** దీపక్ చాహర్ 2-0-11-1, తుషార్ 3-0-34-0, ముస్తాఫిజుర్ 3.3-0-51-1, శార్దూల్ 3-0-42-0, మొయిన్ అలీ 2-0-21-0, జడేజా 2-0-16-0, పతిరన 4-0-35-2.

ఈసారి టైటిల్ మాదే!

టీ20 వరల్డ్‌కప్‌పై రిచర్డ్స్



న్యూఢిల్లీ: త్వరలో జరగనున్న టీ20 వరల్డ్‌కప్ విజేతపై వెస్టిండీస్ దిగ్గజం వివ్ రిచర్డ్స్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ జూన్‌లో అమెరికా-విండీస్ సంయుక్తంగా నిర్వహించనున్న మెగా టోర్నీలో 20 జట్లు పాల్గొనడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, సొంతగడ్డపై వెస్టిండీస్ మరోసారి విజేతగా నిలుస్తుందని రిచర్డ్స్ ఆశాభావం వ్యక్తం చేశాడు. కోచ్ డారెన్ సామి, కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ సారథ్యంలోని విండీస్.. అగ్రశ్రేణి జట్లకు దీటుగా పోటీపడగలదన్నాడు. 2012, 2016లో సామి కెప్టెన్సీలో కరీబియన్లు రెండుసార్లు పొట్టికప్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.

ఆషి-స్వప్నిల్ జోడీకి స్వర్ణం

బాకు (అజర్‌బైజాన్): షూటింగ్ వరల్డ్‌కప్‌లో భారత్ రెండో స్వర్ణాన్ని ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన 50 మీటర్ల రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో ఆషి చౌక్సే-స్వప్నిల్ కుశాలే జోడీ 16-12తో డారియా టైఖోవా-సెర్హి కులిష్ (ఉక్రెయిన్) ద్వయాన్ని ఓడించింది. స్వప్నిల్‌కు ఇది మూడో పతకం. స్వప్నిల్ వ్యక్తిగత, పురుషుల టీమ్ ఈవెంట్‌లో రజత పతకాలు కొల్లగొట్టాడు. మొత్తంగా ఈ వరల్డ్‌కప్‌ను భారత్ రెండు పసిడి, మూడు రజతాలు సహ 5 పతకాలతో రెండో స్థానంలో ముగించిం ది. కొరియా మూడు స్వర్ణాలు, మూడు కాంస్యాలతో పతకాల పట్టికలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	8	7	1	0	14	0.698
కోల్‌కతా	7	5	2	0	10	1.206
హైదరాబాద్	7	5	2	0	10	0.914
లఖ్‌నవూ	8	5	3	0	10	0.148
చెన్నై	8	4	4	0	8	0.415
గుజరాత్	8	4	4	0	8	-1.055
ముంబై	8	3	5	0	6	-0.227
ఢిల్లీ	8	3	5	0	6	-0.477
పంజాబ్	8	2	6	0	4	-0.292
బెంగళూరు	8	1	7	0	2	-1.046

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

గుకేష్ విజయం.. విశ్వ చెస్‌పై మన ఆధిపత్యం



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

'భారత్‌లో చెస్ అభివృద్ధి దిశగా సరైన అడుగులు పడుతున్నాయి. అందుకే ప్రపంచ చెస్‌లో భారత్ అగ్రగామిగా నిలిచే రోజులు ఎంతో దూరంలో లేవు' వరల్డ్ మాజీ చాంపియన్ కార్ల్‌సన్ గతేడాది చేసిన వ్యాఖ్య ఇది. సరిగ్గా సంవత్సరం తిరిగే సరికి..నార్వే దిగ్గజం అభిప్రాయం దిశగానే భారత్ పయనిస్తోంది. తన కంటే ఎంతో అనుభవజ్ఞులైన ఆటగాళ్లను తలదన్ని ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ విజేతగా అంతర్జాతీయ చెస్‌లోకి గుకేష్ అనే టీనేజర్ దూసుకొచ్చాడు. ఇక.. చైనాకు చెందిన డింగ్ లిరెన్‌తో ప్రపంచ టైటిల్ కోసం గుకేష్ తలపడడమే మిగిలుంది. ప్రస్తుత ఫామ్‌నుబట్టి చూస్తే..వరల్డ్ చాంపియన్‌గా నిలిచే అవకాశమూ గుకేష్‌కి లేకపోలేదు. గుకేష్‌తోపాటు, ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేసి, విదిత్ గుజరాతీ, ఆర్.వైశాలీ, ద్రోణవల్లి హారిక వంటి భారత గ్రాండ్‌మాస్టర్లు విశ్వ వేదికలపై అద్భుత ఆటతో ఆకట్టుకుంటున్నారు.

ఇవీ కారణాలు..: ఫిడే అంచనా ప్రకారం దేశంలో ప్రతిభావంతులైన చెస్ ఆటగాళ్లు 50వేల మంది ఉన్నారు. ఇలా వేలాదిమంది ప్లేయర్లు ఆవిర్భవించడానికి పలు కారణాలున్నాయి. అందులో ముఖ్యమైనవి.. తక్కువ ధరలకే ఇంటర్నెట్ డాటా ప్యాక్‌లు లభించడం, సెల్‌ఫోన్లలో చెస్ యాప్‌లు అందుబాటులోకి రావడం. ఇంటర్నెట్ పుణ్యాన.. టైర్-2, టైర్-3 నగరాల్లో ఆన్‌లైన్ చెస్ కోచింగ్‌లకు అవకాశం ఏర్పడింది. తద్వారా మెట్రోపాలిటన్ నగరాల్లో చెస్ అకాడమీల ద్వారా చిన్నారులకు ఉత్తమ శిక్షణ పొందే మార్గం ఏర్పడింది. అలాగే గత తరం ఆటగాళ్లు యువ ప్లేయర్లకు శిక్షణ ఇస్తూ తమ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. కరోనా తర్వాత విస్తారంగా ఆన్‌లైన్ టోర్నీలు జరుగుతున్నాయి. ఈ టోర్నీల ద్వారా యువ ఆటగాళ్లకు గ్రాండ్‌మాస్టర్లతో తలపడే అవకాశాలు లభిస్తున్నాయి. అలా వారు తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుంటున్నారు. ఇలా..అందుబాటులో ఉన్న అవకాశాలను రెండు చేతులా అందిపుచ్చుకుంటున్న దేశ నవతరం చెస్ ప్లేయర్లు అంతర్జాతీయ వేదికలపై మెరుస్తున్నారు. భారత చెస్ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తున్నారు.

టొరంటోలో భారత భూకంపం

గుకేష్ ఘనతపై చెస్ దిగ్గజం కాస్పరోవ్

న్యూఢిల్లీ: గుకేష్‌ను రష్యా చెస్ దిగ్గజం గ్యారీ కాస్పరోవ్ ఆకాశానికెత్తేశాడు. క్యాండిడేట్స్ టోర్నీలో అతడి టైటిల్ విజయాన్ని టొరంటోలో 'భారత భూకంపం'గా అభివర్ణించాడు. గుకేష్ గెలుపు ప్రపంచ చెస్‌లో ఆధిపత్య మార్పునకు చిహ్నమన్నాడు.



అధిక ఉష్ణోగ్రతలతో కార్మిక లోకంలో కల్లోలం!

- ఎండల వల్ల ఏటా 18,970 మంది కార్మికుల మరణం
- కార్మికుల్లో పెరుగుతున్న మూత్రపిండ సమస్యలు
- అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అధిక ఉష్ణోగ్రతలు కార్మిక శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. విపరీతమైన ఎండల ప్రభావం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ ఏటా సగటున 18,970 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. అలాగే, 2.28 కోట్ల మంది పని ప్రదేశాల్లో గాయాలపాలవుతున్నారు. ఇది కాక, 21 లక్షల మంది దీర్ఘకాలిక అనారోగ్యాల బారిన పడుతున్నారు. 'ఎన్సూరింగ్ సేఫ్టీ అండ్ హెల్త్ ఎట్ వర్క్ ఇన్ క్లైమేట్ ఛేంజ్' పేరిట అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్‌వో) సోమవారం విడుదల చేసిన నివేదికలో ఈ ఆందోళనకర అంశాలు బయటపడ్డాయి. దీని ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 70 శాతం మంది కార్మికులు పనిప్రదేశంలో ఎండలను ప్రత్యక్షంగా ఎదుర్కొంటున్నారు. భారత్, అమెరికా, ఆఫ్రికా, మధ్య తూర్పు దేశాల్లోని ఎక్కువ మంది కార్మికులు అధిక ఉష్ణోగ్రతల కారణంగా మూత్రపిండాల వైఫల్యం బారినపడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల నుంచి కార్మికులను రక్షించడానికి ప్రపంచ దేశాలు వాతావరణ మార్పునిర్దిష్ట వృత్తిపరమైన భద్రత, ఆరోగ్య విధానాలను రూపొందించాలని, వాటిని పబ్లిక్ హెల్త్ క్యాంపెయిన్‌తో ఏకీకృతం చేయాలని ఈ నివేదిక సూచించింది.



అలాగే, పురుగుమందుల కారణంగా ప్రతీ ఏటా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 3 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని నివేదిక వెల్లడించింది. పని ప్రదేశాల్లో వాతావరణ కాలుష్యం కారణంగా 8,60,000 మంది, అతినీలలోహిత కిరణాల రేడియేషన్‌కు గురై చర్మ క్యాన్సర్‌తో 18,960 మంది, వెక్టర్ బోర్న్ డిసీజ్ కారణంగా మరో 15,170 మంది మరణిస్తున్నట్లు వెల్లడించింది. అధిక ఉష్ణోగ్రతలవల్ల మూత్రపిండాల వ్యాధులతో అసాధారణ సంఖ్యలో మృత్యువాత పడుతున్నారని తెలిపింది. కార్మికులు క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ సమస్యలు, మూత్రపిండాల పనితీరు మందగించడం, మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈ నివేదిక పేర్కొంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా 2020లో ప్రపంచ వ్యాప్తంగా 2.62 కోట్ల మంది కార్మికులు దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధుల బారిన పడినట్లు ఆ ఏడాది విడుదల చేసిన నివేదికలో వెల్లడైందని ఐఎల్‌వో గుర్తు చేసింది. పరిస్థితులు ఇలానే కొనసాగితే శ్రామికుల సంఖ్య తగ్గుతుందని, దేశాల ఉత్పత్తి శక్తి తగ్గి కార్మికుల ఉపాధిపై ప్రభావం పడుతుందని పేర్కొంది.

పని ఒత్తిడి తట్టుకోలేక గ్రామ కార్యదర్శి ఆత్మహత్య!



శ్రావణి (ఫైల్)

గణపురం, ఏప్రిల్ 23: పని ఒత్తిడిని తట్టుకోలేక ఓ గ్రామ కార్యదర్శి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్కపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పల్లెబోయిన శ్రావణి(34) అనే మహిళ.. తన భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి గాంధీపురంలో నివాసం ఉంటున్నారు. పనిభారం పెరిగిందని, పిల్లల కోసం ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నాని తండ్రి సాంబయ్యతో ఆమె తన బాధను చెబుతుండేవారు. ఈ క్రమంలో ఆదివారం కర్కపల్లిలో నీటి సమస్య ఉందని ప్రజలు చెప్పడంతో వెళ్లి సమస్యను పరిష్కరించారు. ఆ తర్వాత అలసిపోయి ఇంటికి వచ్చిన ఆమె ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు తాడుతో ఉరేసుకున్నారు. ఇంటికి వచ్చిన భర్త శ్రావణిని చూసి వెంటనే హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం శ్రావణి మృతదేహానికి ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని ఆమె అత్తగారి ఊరు ఇంచెర్లలో అంత్యక్రియలు నిర్వహించారు. పని ఒత్తిడి కారణంగానే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, శ్రావణి ఆత్మహత్య విషయమై జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు, ఎంపీడీవో భాస్కర్‌ను వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి విధుల్లో ఎలాంటి ఒత్తిళ్లు లేవని తెలిపారు. శ్రావణి తనకు సెలవు కావాలని ఎన్నడూ అడగలేదని, ఆదివారం గ్రామపంచాయతీకి వెళ్లాలని తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని తెలిపారు.

ఈడీకి పరిధి ఏమీ లేదు

జాతీయ దర్యాప్తు సంస్థకు ట్రాన్సిట్ ఆర్డర్ అవసరం లేదు.. కవితను అరెస్టు చేయబోమని ఈడీ ఎప్పుడూ చెప్పలేదు

- బలమైన సాక్ష్యాలు ఉన్నందునే అరెస్టు
- కవిత బెయిల్ పిటిషన్‌పై న్యాయస్థానంలో ఈడీ వాదనలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అనేది జాతీయ దర్యాప్తు సంస్థని, దేశంలో ఎక్కడికైనా వెళ్లే అధికారం ఉంటుందని ఈడీ తరఫున న్యాయవాది జోహెబ్ హుస్సేన్ పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తనకు బెయిల్ మంజూరుచేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. కవిత అరెస్టు అక్రమమని ఆమె తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ సోమవారం వాదనలు వినిపించారు. కవిత అరెస్టు సమయంలో ఈడీ నిబంధనలు పాటించలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దానికి కొనసాగింపుగా మంగళవారం మళ్లీ వాదనలు జరిగాయి. తొలుత కవిత తరఫున న్యాయవాది నితేష్ రాణా వాదనలు వినిపించారు. కవితను సూర్యాస్తమయం తర్వాత అరెస్టు చేశారని, ఎటువంటి ట్రాన్సిట్ ఆర్డర్ ఇవ్వలేదని చెప్పారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలనూ ఈడీ పట్టించుకోలేదని తెలిపారు. ఈడీ తరఫు న్యాయవాది జోహెబ్ హుస్సేన్ అభ్యంతరం తెలిపారు. నిబంధనలన్నీ పాటించామని కోర్టుకు తెలిపారు.

కవితను అరెస్టు చేయొద్దని ఉత్తర్వులేమీ లేవు

కవితను అరెస్టు చేయబోమని తామెప్పుడూ చెప్పలేదని ఈడీ న్యాయవాది జోహెబ్ హుస్సేన్ స్పష్టం చేశారు. విచారణకు రావాలని కవితకు నోటీసులు పంపామని, ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలిపారు. గత ఏడాది సెప్టెంబరు 26న సుప్రీంకోర్టులో విచారణ జరిగిందని, అప్పుడు తర్వాతి 10 రోజులు లేదా వచ్చే విచారణ తేదీ వరకు మాత్రమే ఆమెకు సమన్లు పంపబోమని తాము చెప్పినట్టు గుర్తుచేశారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను తామెక్కడా ఉల్లంఘించలేదన్నారు. దర్యాప్తు సంస్థలు తనను ఇంటికి వచ్చి మాత్రమే విచారించాలని ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, అంతేకాని అరెస్టు చేయొద్దని కోరలేదని పేర్కొన్నారు. ఆమెను మార్చి 15న అరెస్టు చేశామని, ఆమె పిటిషన్ మార్చి 19న సుప్రీంకోర్టులో విచారణకు వచ్చిందని తెలిపారు. ఆ సమయంలో ఈడీ అక్రమంగా అరెస్టు చేసిందని ఆమె న్యాయవాది వాదించలేదన్నారు.

సూర్యాస్తమయంలోపే అరెస్టు చేశాం

ఈడీ జాతీయ దర్యాప్తు సంస్థ. రాష్ట్ర పోలీసులకు వర్తించే నిబంధనలన్నీ ఈడీకి వర్తించవు. రాష్ట్ర పోలీసులు మాత్రమే ట్రాన్సిట్ ఆర్డర్ తీసుకోవాల్సి ఉంటుందని జోహెబ్ హుస్సేన్ వాదించారు. 'మహిళను సూర్యాస్తమయం తర్వాత అరెస్టు చేస్తేనే స్థానిక మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాల్సి ఉంటుంది. కవితను సూర్యాస్తమయానికి ముందే అరెస్టు చేశాం. ఈ క్రమంలో 24 గంటల్లో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలనే నిబంధన మాత్రమే ఈడీకి వర్తిస్తుంద'ని తెలిపారు. 'కవితను మార్చి 15న సాయంత్రం 5.20 నిమిషాలకు హైదరాబాద్‌లో అరెస్టు చేశాం. అక్కడ సాయంత్రం 6.26 గంటలకు సూర్యాస్తమయం అయినట్లు జియోగ్రాఫికల్ డేటా చెబుతోంది. సూర్యాస్తమయంలోపే అరెస్టు చేశాం కాబట్టి 24 గంటల్లోపే ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో న్యాయమూర్తి ముందు హాజరుపరిచా'మని జోహెబ్ హుస్సేన్ స్పష్టం చేశారు.

కవితకు అరుణ్ పిళ్లై బినామీ

ఢిల్లీ మద్యం కేసులో కవిత పాత్రపై సాక్ష్యాలు సేకరించిన తర్వాతే అరెస్టు చేశామని జోహెబ్ హుస్సేన్ కోర్టుకు తెలిపారు. మాగుంట శ్రీనివాస్ రెడ్డి, శరత్‌చంద్రా రెడ్డి వాంగ్మూలాలు ఇచ్చారని చెప్పారు. బుచ్చిబాబు ఫోన్‌లో కీలక సమాచారం దొరికిందని తెలిపారు. ఈ కేసులో అరుణ్ పిళ్లై కవితకు బినామీగా వ్యవహరించారని వాదించారు. కవితకు బెయిల్ ఇవ్వొద్దని న్యాయస్థానాన్ని కోరారు. ఈడీ వాదనలపై కవిత తరఫున న్యాయవాది నితేష్ రాణా అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము దాఖలు చేసే రీజాయిండర్‌లో సమగ్ర వివరాలు పొందుపరుస్తామని తెలిపారు.

మే 7 వరకు కేజ్రీవాల్, కవిత కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేజ్రీవాల్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు మే 7 వరకు పొడిగించింది. ఈ కేసులో ఈడీ తొలుత కవితను, తర్వాత కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. ఇద్దరి జ్యుడీషియల్ కస్టడీ మంగళవారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఉదయం కేజ్రీవాల్, మధ్యాహ్నం 2 గంటలకు కవిత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. ఇద్దరి కస్టడీని పొడిగించాలని దర్యాప్తు సంస్థలు న్యాయమూర్తి కావేరి బవేజాను కోరాయి. కవితను మార్చి 15న హైదరాబాద్‌లోని నివాసంలో ఈడీ అరెస్టు చేసింది. కవిత తిహాడ్ జైలులో ఉండగా ఇదే కేసులో ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసింది. 12న కోర్టులో హాజరుపరిచింది. కోర్టు అనుమతితో మూడు రోజులు కస్టడీలోకి తీసుకుని ఆమెను ప్రశ్నించింది. ఈడీ కేసులో 23 వరకు రిమాండ్ ఉండడంతో అదే తేదీ వరకు సీబీఐ కేసులోనూ కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కేజ్రీవాల్‌ను ఈడీ మార్చి 21న అరెస్టు చేసింది. మరుసటి రోజు కోర్టులో ప్రవేశపెట్టింది. 28 వరకు కస్టడీలోకి తీసుకుని విచారించింది.



హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్ గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ వరకు నిర్వహించిన హనుమాన్ విజయ యాత్రలో పాల్గొన్న అశేష భక్తజనం

ఎల్టీ అసోసియేషన్ కార్యదర్శి అక్రమాలపై చర్యలు తీసుకోండి

- హెల్త్‌సెక్రటరీకి ఫిర్యాదు చేసిన ఎల్టీ అసోసియేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్య ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా చలామణి అవుతున్న మంచాల రవీందర్ వైద్యశాఖలో చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయన అవకతవకలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ హెల్త్ సెక్రటరీకి ఫిర్యాదు చేసింది. అసోసియేషన్ సభ్యులు సచివాలయంలో హెల్త్ సెక్రటరీని మంగళవారం కలసి ఫిర్యాదు చేశారు. మంచాల రవీందర్ తప్పుడు ధ్రువపత్రాలను సమర్పించి బయోకెమిస్టుగా పదోన్నతి పొందారని, అధికారులను తప్పుదోవ పట్టించి ఒకటే కేడర్‌లో రెండుసార్లు వేర్వేరు తేదీల్లో ల్యాబ్ టెక్నీషియన్‌గా సర్వీస్ రెగ్యులరైజ్ చేసుకున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే అతడికి ఎల్టీలతో సంబంధం లేకున్నా.. ఎల్టీ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా చలామణి అవుతున్నారని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో చేసిన వసూళ్లపై 2022 మే 28న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన "వసూల్ రాజా కథనం"పై నాడు విజిలెన్స్ విచారణ జరిగిందని, దానిపై చర్యలు తీసుకోలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అతడిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఎల్టీ అసోసియేషన్ చేసిన ఫిర్యాదుపై రవీందర్ స్పందించారు. తాను అసోసియేషన్ పోస్టుకు రాజీనామా చేశానని, ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదన్నారు.

చెరువుల్లో చెత్త వేయడంపై వివరణ ఇవ్వండి

- హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చెరువులను నిర్మాణ వ్యర్థాలు, చెత్తతో నింపడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, లేక్ ప్రొటెక్షన్ కమిటీ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లకు హైకోర్టు మంగళవారం నోటీసులు జారీచేసింది. మెట్రోరైల్ ప్రాజెక్టుతో భూముల ధరలు పెరుగుతుండటంతో చాంద్రాయణ్‌గుట్ట పరిసర ప్రాంతాల్లోని జల్‌పల్లి, ఉందానగర్ చెరువులను చెత్త, మట్టి నింపడం ద్వారా ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ పత్రికల్లో కథనాలు వచ్చాయి. వీటి ఆధారంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని లేఖరాశారు. ఈ లేఖను చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించి సంబంధిత అధికారులకు నోటీసులు జారీచేసింది.

చెల్లిపై అత్యాచారం చేసి గర్భవతిని చేసిన అన్న

- నిందితుడికి యావజ్జీవ శిక్ష విధించిన న్యాయస్థానం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తండ్రి తర్వాత తండ్రి స్థానంలో ఉండాల్సిన అన్నే ఆ చెల్లి పాలిట రాక్షసుడయ్యాడు. వావివరసలు మరిచి సొంత చెల్లిపైనే అత్యాచారం చేసి ఆమెను గర్భవతిని చేశాడు. నేరం రుజువవ్వడంతో అన్నకు న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. భర్త వదిలేయడంతో ఓ మహిళ తన నలుగురు పిల్లలతో లంగర్ హౌస్ ప్రాంతంలో ఉంటోంది. బైక్ మెకానిక్‌గా చేసే ఆమె కొడుకు(19) కొన్ని నెలల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సొంత చెల్లి(13)ని బెదిరించి ఆ చిన్నారిపై పలుమార్లు అత్యాచారం చేశారు. బాలిక ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా 6 నెలల గర్భవతి అని వైద్యులు చెప్పారు. దాంతో తల్లి కూతురిని పలు ఆస్పత్రులకు తీసుకెళ్లి అబార్షన్ చేయించేందుకు ప్రయత్నించింది. సాధ్యం కాకపోవడంతో భరోసా కేంద్రం సూచన మేరకు లంగర్ హౌస్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి బాలికను భరోసా కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. కేసు విచారణ జరుగుతుండగానే బాధితురాలు తల్లి నిందితుడికి పెళ్లి చేసింది. బాలికకు పుట్టిన బిడ్డకు పోలీసులు డీఎన్ఏ పరీక్షలు చేయించి నిందితుడికి వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యాలు సమర్పించారు. కేసును విచారణ జరిపిన నాంపల్లి 12వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి అనిత నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు.

కందులు క్వింటా రూ.11,246

- సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో రికార్డు స్థాయి ధర
- మద్దతు ధర కంటే రూ.4,246 అధికం



సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 23: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం కందులు రికార్డు స్థాయి ధర పలికాయి. చివ్వెంల మండలం బండమీది చందుపట్ల గ్రామానికి చెందిన అనంతుల రవి అనే రైతు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు ఐదు బస్తాలు(రెండున్నర క్వింటాళ్ల) కందులు తీసుకురాగా, క్వింటా రూ.11,246 చొప్పున అమ్ముడుపోయాయి. ఈ సీజన్‌లో కందులకు ఇదే అత్యధిక ధర అని మార్కెట్ కార్యదర్శి బీవీ రాహుల్ తెలిపారు. కందులకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7వేలు ఉండగా, రూ.4,246 అదనపు ధర పలకడం విశేషం. మంగళవారం రైతులు మార్కెట్‌కు 76 బస్తాలు(50 క్వింటాళ్లు) కందులు తీసుకురాగా క్వింటా గరిష్ఠంగా రూ.11,246, కనిష్ఠంగా రూ.5,292 ధర పలికాయి. అలాగే మోడల్ ధర రూ.11,034గా పలికాయి. ప్రైవేటు మార్కెట్‌లో కందిపప్పుకు డిమాండ్ ఎక్కువగా ఉండటం, సాగు తగ్గడంతో కందులకు డిమాండ్ పెరిగిందని వ్యాపారులు తెలిపారు.

సంకెళ్లు వేయడం మానవ హక్కుల ఉల్లంఘనే

- ఖైదీలను బేడీలతో తీసుకురావడంపై హైకోర్టులో వ్యాజ్యం

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విచారణ ఖైదీలు, నిందితులకు బేడీలు వేయడంపై వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం, హోం, జైళ్లశాఖ, డీజీపీ, పోలీస్ కమిషనర్లకు హైకోర్టు మంగళవారం నోటీసులు జారీచేసింది. రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి కోర్టుకు నిందితులను బేడీలు వేసి తీసుకురావడం అత్యంత సాధారణంగా మారిందని, ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని పేర్కొంటూ సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్ హైకోర్టుకు లేఖరాశారు. క్రిమినల్ కేసుల్లో నిందితులకు బేడీలు వేయడం మానవ హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుందని సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా పేర్కొందని తెలిపారు. ఈ లేఖను సుమోటో పిటిషన్‌గా స్వీకరించిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. నోటీసులు జారీచేసి తదుపరి విచారణను ఆరువారాలకు వాయిదావేసింది.

కేసును తప్పు దోవ పట్టించిన ఎస్ఐ సస్పెన్షన్!



నారాయణసింగ్

గాజులరామారం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసును ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నించిన ఓ ఎస్సైను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. జనవరిలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పోలీస్‌స్టేషను పరిధిలోని ఓ గుడి పక్కన నిర్మానుష ప్రాంతంలో ఓ గుర్తు తెలియని మహిళ హత్యకు గురయింది. ఆ ఘటనపై గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లుగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే సూరారం స్టేషనులో అడ్మిన్ ఎస్సైగా ఉన్న నారాయణ సింగ్ ఈ కేసును ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రయత్నం చేయడంతో ఉన్నతాధికారులు ఆయనను సస్పెన్షన్ వేటు వేశారు.

ఒంటరి మహిళలే టార్గెట్

చేసేది గ్లాస్ కట్టర్ ఉద్యోగం.. మ్యాట్రిమోని ప్రొఫైల్‌లో గూగుల్ మేనేజర్ ఫ్రమ్ అమెరికా

- పెళ్లి పేరుతో.. రూ.1.8 కోట్లు నొక్కేసిన కేటుగాడు
- నిందితుడికి పోలీసుల బేడీలు



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): "విడాకులు తీసుకున్నాను.. రెండో పెళ్లి కోసం సంబంధాలు వెతుకుతున్నాను. గూగుల్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాను" అంటూ ఒంటరి మహిళలే లక్ష్యంగా ఓ కేటుగాడు మోసాలకు తెరతీశాడు. మ్యాట్రిమోని సైట్లలో పెళ్లి పేరుతో రూ.1.8 కోట్ల మేర కొల్లగొట్టాడు. చిత్తూరు జిల్లా పాకాల మండలం వాలపరస వారిపల్లి గ్రామానికి చెందిన కొమ్మినేని వంశీ చౌదరి అలియాస్ కృష్ణవంశీ అలియాస్ కృష్ణయ్య ఇంటర్ వరకు చదువుకున్నాడు. 2009లో బెంగళూరులోని ఓ ప్లైవుడ్ దుకాణంలో గ్లాస్ కట్టర్‌గా పనిచేశాడు. ఆ దుకాణం పక్కనే ఉన్న జాబ్ కన్సల్టెన్సీకి నిరుద్యోగులు పెద్దసంఖ్యలో రావడాన్ని గమనించిన కృష్ణ య్య.. ఉద్యోగాల పేరుతో మోసాలకు తెరతీశాడు. అప్పట్లో ఇతనిపై కోరమంగళ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత తిరిగి చిత్తూరుకు వెళ్లిన కృష్ణయ్య.. అక్కడా ఉద్యోగం పేరుతో ఓ యువతిని మోసగించాడు. దాంతో చిత్తూరు థానాలోనూ కేసు నమోదైంది. ఈ దందా ఎంతోకాలం కుదరదనుకుని, మ్యాట్రిమోని సైట్లలో మోసాలకు తెరతీశాడు. విడాకులు తీసుకున్న, భర్త చనిపోయిన మహిళలనే టార్గెట్‌గా చేసుకున్నాడు. తాను విడాకులు తీసుకున్నట్లు పేర్కొంటూ ప్రొఫైల్ క్రియేట్ చేశాడు. తాను అమెరికాలో గూగుల్ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పుకొన్నాడు. అందరినీ నమ్మించేలా రూ.11 వేలు పెట్టి.. అమెరికా నంబర్లతో వొనాజ్ వీవోఐపీ ఫోన్లను కొనుగోలు చేశాడు. అవే నంబర్లను ప్రొఫైల్‌లో పెట్టాడు. తన ప్రొఫైల్‌కు స్పందించి, ఫోన్ చేసే మహిళలు/యువతులను ట్రాప్ చేసేవాడు. తాను అమెరికాలో బిజీ అంటూ కొంతకాలం నమ్మించేవాడు. ఆ తర్వాత పెళ్లిచేసుకుంటానని నమ్మిస్తూ.. అనారోగ్యం పేరుతో, బ్యాంకు ఖాతా బ్లాక్ అయ్యిందని, అత్యవసరం డబ్బులు అవసరమని చెబుతూ బాధిత మహిళల ఖాతా వివరాలను తీసుకుని, నగదు నిల్వలను ఖాళీ చేసేవాడు. ఆ డబ్బును క్రికెట్ బెట్టింగ్‌లకు, జూదానికి, దుబాయ్, మలేసియా, సింగపూర్, బ్యాంకాక్‌లలో విహారయాత్రలకు ఖర్చు చేసేవాడు. కొందరు మహిళల వద్ద బంగారు నగలను కూడా తీసుకునేవాడు. ఈ క్రమంలో భర్త చనిపోయిన హైదరాబాదీ మహిళ ఒకరు.. తనకు ఇద్దరు పిల్లలున్నారని, రెండో పెళ్లి కోసం సంబంధాలు చూస్తున్నానని పేర్కొంటూ మ్యాట్రిమోనిలో ప్రొఫైల్ పెట్టారు. ఆమె తల్లిదండ్రులు కూడా కృష్ణయ్య ప్రొఫైల్ నచ్చడంతో.. అతణ్ని ఫోన్‌లో సంప్రదించారు. కృష్ణయ్య తాను భారత్‌కు వచ్చి, పెళ్లి చేసుకుంటానని, ఆ వెంటనే పెళ్లి కూతురితో సహా.. అమెరికాకు వెళ్తానని నమ్మబలికేవాడు. "ఘోరం జరిగిందండి.. ఇద్దరు పిల్లలున్న అమ్మాయిని పెళ్లిచేసుకుంటానని చెబితే.. మా తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. నా బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయించారు. ఇతర ఖాతాలను ఐటీ అధికారులు ఫ్రీజ్ చేశారు. కొత్త ఖాతా తెరిచేలోపు.. లావాదేవీల కోసం ఓ బ్యాంక్ అకౌంట్ కావాలి" అంటూ.. బాధితురాలి ఆన్‌లైన్ బ్యాంకింగ్ వివరాలను తెలుసుకున్నాడు. ఖాతాను ఖాళీ చేయడమే కాకుండా.. అత్యవసరంగా డబ్బు కావాలంటూ.. ఆమె నగలను కూడా కొల్లగొట్టాడు. ఇలా పలు దఫాలుగా ఆమె నుంచి రూ.1.8 కోట్లు తీసుకున్నాడు. ఇంకా.. ఇంకా.. డబ్బులు కావాలని డిమాండ్ చేస్తుండడంతో.. బాధితురాలికి అనుమానం వచ్చి, సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసు బృందం.. కృష్ణయ్యను అరెస్టు చేసింది.

చిన్నారులతో నాయనమ్మ భిక్షాటన

- స్థానికుల ఫిర్యాదుతో వెలుగు చూసిన ఘటన
- బాలసదనానికి ముగ్గురు పిల్లల తరలింపు



అంగన్‌వాడీ కేంద్రంలో/ చిన్నారులు

గరిడేపల్లి, ఏప్రిల్ 23: చిన్న పిల్లలతో నాయనమ్మ భిక్షాటన చేయిస్తున్న ఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో వెలుగుచూసింది. సూర్యాపేట బాలల సంరక్షణ అధికారి సాయిత్రిలోక్, రాయినిగూడెం అంగన్‌వాడీ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన చింతలచెర్వు సతీష్, లక్ష్మి దంపతులకు ఆరేళ్ల క్రితం వివాహం కాగా ముగ్గురు పిల్లలు(ఇద్దరు బాలురు, ఓ బాలిక) ఉన్నారు. సతీష్ మద్యానికి బానిస కావడంతో లక్ష్మి తన ముగ్గురు పిల్లలను భర్త వద్దే వదిలేసి వెళ్లిపోయింది. తండ్రి పిల్లలను పట్టించుకోనందున వారి సంరక్షణ భారం నాయనమ్మ రామతిలకంపై పడింది. ఆమె ముగ్గురు పిల్లలను ఊరూరా తిప్పుతూ భిక్షాటన చేయిస్తోంది. ఈ క్రమంలో సోమవారం ముగ్గురు పిల్లలతో గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామానికి వచ్చింది. గ్రామంలో ఓ ఫంక్షన్ జరుగుతుండగా అక్కడ పిల్లలతో కలిసి భోజనం చేసింది. అనుమానించిన గ్రామస్థులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. గరిడేపల్లి పోలీసులు రాయినిగూడెం వచ్చి సూర్యాపేటలోని బాలల సంక్షేమశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ముగ్గురు పిల్లలను రాయినిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రానికి తరలించారు. సూర్యాపేట నుంచి బాలల సంరక్షణ అధికారి సాయిత్రిలోక్ రాయినిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ముగ్గురు పిల్లలను సూర్యాపేటలోని బాలసదనానికి తరలించారు. ఈ ముగ్గురిలో ఒకరు దివ్యాంగుడని తెలిపారు. మధ్యాహ్నం సమయంలో నాయనమ్మ రాయినిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి, తమ పిల్లలు ఎక్కడ ఉన్నారని టీచర్‌ను ప్రశ్నించింది. కుటుంబసభ్యులను తీసుకువస్తే పిల్లలను అప్పగిస్తామని అధికారి ఆమెతో చెప్పినట్లు సమాచారం.



మానేరు వాగుపై కూలిన నిర్మాణంలోని వంతెన

ముత్తారం ఏప్రిల్ 23: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు వద్ద మానేరు వాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోయింది. ఓడేడు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని గర్మిల్లపల్లి గ్రామాల మధ్య మానేరు వాగుపై ఈ వంతెన నిర్మిస్తున్నారు. సోమవారం రాత్రి వీచిన ఈదురుగాలులకు వంతెనలోని మూడు గర్డర్లు కిందపడిపోవడంతో వంతెన కుప్పకూలింది. దీంతో రెండు జిల్లాల మధ్యలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వంతెన నిర్మాణం మధ్యలో ఆగిపోవడం, చాలా సంవత్సరాలుగా ఉండి చెదలు రావడంతో మధ్యలో గార్డర్ ఒక వైపునకు వంగింది. సోమవారం అర్ధరాత్రి వీచిన బలమైన గాలులకు మూడు గర్డర్‌లు కింద పడ్డాయి. దీంతో వంతెన కుప్పకూలింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బాధ్యతారాహిత్యం

రాజస్థాన్‌లోని బన్స్‌వారాలో ఏప్రిల్ 21వ తేదీన ఎన్నికల ప్రచార సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్న మాటలు సామాన్యమైనవి కావు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే కాక, అనేక ప్రజాస్వామిక, హక్కుల సంఘాలు కూడా ఆ మాటల మీద ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయంటే, అందులో ఆశ్చర్యమేమీ లేదు. చిన్నస్థాయి నాయకులు ఎవరన్నా అటువంటి వ్యాఖ్యలు చేయడం ఆనవాయితీ అయిపోయింది కానీ, సాక్షాత్తూ నరేంద్రమోదీయే ఇంతటి తీవ్రంగా మాట్లాడడం ఆయన అభిమానులకు, బీజేపీ శ్రేణులకు కూడా జీర్ణం కావడం లేదు. పెద్ద పెద్ద పదవులలో ఉన్నవారు, దేశానికి, భారత సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ఇట్లా మాట్లాడి, తమ గౌరవాన్ని తగ్గించుకోవడం, దేశప్రతిష్ఠను దిగజార్చడం అన్యాయమని మేధావులు, పౌరసమాజం ప్రముఖులు ఆవేదన చెందుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే, అది సంపదనంతా ముస్లిములకు పంచిపెడుతుందని మోదీ అన్నారు. పిల్లలెక్కువగా కనేవాళ్ళు, చొరబాటుదార్లు, అని కూడా ముస్లిములను దృష్టిలో పెట్టుకుని మోదీ వ్యాఖ్యానించారు. సంపదను ముస్లిములకు పంచిపెట్టడమనే వాదనకు మూలం, ప్రస్తుత ఎన్నికల కోసం కాంగ్రెస్ ప్రకటించిన మేనిఫెస్టోలో ఉన్నదేమో అనుకుంటే పొరపాటు. ఎప్పుడో పద్దెనిమిది సంవత్సరాల కిందట అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ జాతీయాభివృద్ధి మండలిలో చేసిన వ్యాఖ్యలను విచిత్రంగా అన్వయించి, మోదీ తన వాదనకు ఉపయోగించుకున్నారు. షెడ్యూల్డు కులాలు, తెగలు, మైనారిటీలు, స్త్రీలు, పిల్లలు, ఈ శ్రేణుల అభివృద్ధి కోసం చేయవలసిన ప్రణాళికారచన గురించి, మౌలికసదుపాయాల కల్పన గురించి ప్రస్తావిస్తూ, మన్మోహన్ సింగ్, అభివృద్ధి ఫలాలలో మైనారిటీలు న్యాయమైన భాగం పొందడానికి సృజనాత్మకంగా పథకరచన చేయాలని అన్నారు. వనరులను ప్రాధాన్య ప్రాతిపదికన పొందే హక్కు వారికి ఉండాలని కూడా అన్నారు. ఆ మాటలనే ఇప్పుడు తన తీవ్ర వ్యాఖ్యలకు ఇంధనంగా ఉపయోగించుకున్నారు. మన్మోహన్ మాటలకూ, మోదీ వ్యాఖ్యానానికీ ఏమైనా పొంతన ఉన్నదా అని ఆశ్చర్యం కలుగుతున్నది. మరుసటి రోజు కేంద్రహోంమంత్రి అమిత్ షా మరో సభలో మాట్లాడుతూ, వనరుల మీద మొదటి హక్కు ఆదివాసులకు, దళితులకు, ఓబీసీలకు ఉన్నదని వ్యాఖ్యానించారు. ముస్లిములను ఆయన మినహాయించారు. మోదీ తాను అన్న మాటలు అప్రదిష్ఠ కలిగిస్తాయని గుర్తించారో ఏమో తన వ్యక్తిగత వెబ్‌సైట్‌లో వాటిని తొలగించి, తక్కిన ప్రసంగం పోస్ట్ చేశారు. తరువాత రోజు కాంగ్రెస్ పార్టీ మీద మరోసారి అటువంటి ఆరోపణే చేశారు. ప్రజల దగ్గర ఉన్న ఆస్తులను, బంగారాన్ని, నగలను ఆ పార్టీ లాగేసుకుంటుందని, దానిది మావోయిస్టు తరహా అని స్త్రీలను భయభ్రాంతులను చేసే విధంగా నిందించారు. కులగణనలో భాగంగా సామాజికార్థిక వివరాలను సేకరిస్తారనే కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రస్తావనను, ఆస్తుల వివరాలను సేకరించి అపహరిస్తారనే విధంగా వ్యాఖ్యానించారు. విమర్శించడం వేరు. వక్రీకరించడం వేరు.


సమాజంలోని ఒక వర్గం మీద తక్కిన ప్రజలకు ద్వేషాన్ని, వ్యతిరేకతను పెంచే వ్యాఖ్యలను ఎప్పుడూ ఎవరూ చేయకూడదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అసలే చేయకూడదు. ప్రజాప్రాతినిధ్యచట్టం సెక్షన్ 123(3), 123(3ఎ) ప్రకారం మతం, జాతి, కులం, భాష తదితర ప్రాతిపదికలమీద ఓటు వేయమని కానీ, వేయవద్దని కానీ చెప్పడం నేరం, పౌరులలో ద్వేషభావాన్ని, శత్రుత్వాన్ని రెచ్చగొట్టడం శిక్షార్హం. నేరం నిరూపణ జరిగితే, ఎన్నికలలో పోటీచేయకుండా ఆరేళ్లపాటు నిషేధించే అవకాశం ఉంది. ఎన్నికల సంఘం నిర్దేశించే నమూనా ప్రవర్తనా నియమావళి ప్రకారం కూడా, ప్రజలలో ఇప్పటికే ఉన్న వైషమ్యాలను పెంచడం కానీ, కొత్తవి కల్పించడం కానీ అనైతికం. చట్టాన్ని, నియమావళిని కూడా ఉల్లంఘించిన ఆరోపణలను స్వయంగా ప్రధానమంత్రి ఎదుర్కొనవలసిరావడం విచారకరం. ఈ విషయంలో ఇప్పటిదాకా ఎన్నికల సంఘం స్పందన కర్తవ్యనిష్ఠకు తగినట్టుగా కనిపించడం లేదు. మునుముందు ఎట్లా వ్యవహరిస్తుందో చూడాలి. దేశవ్యాప్తంగా ఈ వివాదం మీద వ్యక్తమవుతున్న ఆందోళనను గమనిస్తే, న్యాయవ్యవస్థ కూడా కల్పించుకోవలసిన పరిస్థితి రావచ్చుననిపిస్తుంది.

ఈ సారి బీజేపీ అభ్యర్థుల ఎంపికలో కొన్ని జాగ్రత్తలు పాటించి, గతంలో హద్దుమీరి మాట్లాడిన, వ్యవహరించిన వివాదాస్పదులైన నాయకులను పక్కనపెట్టింది. మరి మోదీ ఇప్పుడు, రెండో దశ పోలింగ్ ముందు ప్రచారంలో ఎందుకిటువంటి తీవ్ర ప్రచారానికి పాల్పడినట్టు? మొదటి దశ పోలింగ్ తీరు నిరాశ కలిగించిందా? మొత్తంగా ఉత్తరాదిలో, ప్రజాస్పందన గత ఎన్నికలకు భిన్నంగా కనిపించిందా? ఓటింగ్ శాతాలు తక్కువగా ఉండడం బీజేపీకి అనుకూల సంకేతాలా? అనుకూల ఓటర్ల నిరాసక్తతా? ఈ ప్రశ్నలనేకం ఉత్పన్నమవుతున్నాయి. నిన్నటి దాకా 400 సీట్ల లక్ష్యం గురించి మాట్లాడినవారు, ఇప్పుడు అకస్మాత్తుగా కాంగ్రెస్ అధికారానికి వచ్చే అవకాశం గురించి ఎందుకు జనాలను హెచ్చరిస్తున్నట్టు? అంచనాలలో ఏమి మార్పు వచ్చింది? ఒక వేళ, కొంత ఎదురుగాలి వీస్తున్నట్టు అనిపించినా, భయాందోళనలతో చివరి నిమిషంలో బాధ్యతారహితమైన ప్రచారాలకు ఒడిగట్టడం, పదేళ్లకు పైగా అధికారంలో ఉన్న పార్టీ స్థాయికి తగినది కాదు.

నేతల భావ దారిద్ర్యం.. ఓటర్ల ఉదాసీనత

అడుగు బయటికి పెడితే చాలు, వేడి గాలులు వేగంగా ముఖానికి తగులుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో సహా అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 నుంచి 46 డిగ్రీల మధ్య కొనసాగుతున్నాయి. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని జాతీయ విపత్తు నిర్వహణా సంస్థ (ఎన్డీఎంఏ) ప్రజలను హెచ్చరించింది. ఇలాంటి పరిస్థితుల్లో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో నేతలు తమ భవిష్యత్తును పరీక్షించుకునేందుకు ప్రజల మధ్య చెమటోడ్చి తిరుగుతున్నారు. చాలా చోట్ల ఎండిపోతున్న పంటలు, బోరు బావులు, కరువు పరిస్థితులు, మంచినీటి సమస్య, విద్యుత్ కోతల మధ్య ప్రజలు నేతల ప్రసంగాలను ఉదాసీనంగా వింటున్నారు. ఒకరు సామాజిక న్యాయం గురించి మాట్లాడుతుంటే మరొకరు అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారు. రైతులు, రైతుకూలీలే కాక, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న రోడ్లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు. ప్రయాణీకులకోసం ఆశగా ఎదురు చూసే ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, సెవెన్ సీటర్లు నడుపుకునేవారు, జోమాటో, స్విగ్గీ వంటి సంస్థల్లో పనిచేసే ప్లాట్ ఫారమ్ వర్కర్లు మండుటెండల్లో జీవనోపాధి చేసుకోవాల్సిందే. నీతీ ఆయోగ్ నివేదిక ప్రకారమే వీరు మొత్తం శ్రమజీవుల్లో 80 శాతం పైగా ఉంటారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వీరి జీవన పరిస్థితులు మెరుగుపడే అవకాశాలు తక్కువే.

ఈ పరిస్థితుల్లో తొలి దశలో 102 స్థానాలకు జరిగిన ఎన్నికలు చాలా పేలవంగా, అనాసక్తికరంగా జరగడంలో ఆశ్చర్యం లేదు. గతంలో కంటే ఈసారి నాలుగు శాతం తక్కువే ఓటింగ్ జరిగింది. దేశంలో ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడిందని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఇవే చివరి ఎన్నికలు అని ఇండియా కూటమి ప్రచారం చేస్తే, ఒక అధునాతన భారత నిర్మాణం కోసం తాను కృషి చేస్తున్నానని, 2047 కల్లా అగ్రరాజ్యంగా మార్చడమే తన లక్ష్యమని మోదీ ప్రచారం చేస్తున్నారు. కాని ఈ ప్రచారాలేవీ ఓటర్లపై ప్రభావం చూపడం లేదు. దేశ భక్తి, జాతీయ వాదం, వికసిత్ భారత్, సామాజికన్యాయం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఫాసిజం, లౌకిక వాదం వంటి పదాలు నేతల పెదాల నుంచి బయటపడి గాలిలో కలిసిపోతున్నాయి. కాని ఓటర్లు నిర్లిప్తంగా, నిర్వికారంగా, నిశ్చల దృక్కులతో అన్ని ప్రసంగాలను వినడం తప్ప చేయదగింది ఏమీ లేదు. మండుటెండలు, తమ ఈతిబాధల కన్నా నాయకుల భావ దారిద్ర్యాన్ని చూసే ఎన్నికల పట్ల వారు ఏవగింపు ప్రదర్శిస్తున్నారేమో అనిపిస్తోంది.



> ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడిందని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఇవే చివరి ఎన్నికలు అని ఇండియా కూటమి హెచ్చరిస్తుంటే, 2047 కల్లా భారత్‌ను అగ్రరాజ్యంగా మార్చడమే తన లక్ష్యమని ప్రధాని మోదీ ప్రచారం చేస్తున్నారు. ఎవరి మాటలూ ఓటర్లపై ప్రభావం చూపడం లేదు. దేశ భక్తి, జాతీయ వాదం, వికసిత్ భారత్, సామాజికన్యాయం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, ఫాసిజం, లౌకిక వాదం వంటి పదాలు నేతల పెదాల నుంచి బయటపడి గాలిలో కలిసిపోతున్నాయి. ఓటర్లు నిర్లిప్తంగా, నిర్వికారంగా, నిశ్చల దృక్కులతో అన్ని ప్రసంగాలను వింటున్నారు.

గత ఎన్నికల్లో బీజేపీ మొత్తం సీట్లు గెలుచుకున్న మధ్యప్రదేశ్‌లో 20 ఏళ్లలో తొలిసారి తక్కువ ఓటింగ్ జరిగింది. రాజస్థాన్‌లో ఓటింగ్ 64 నుంచి 57 శాతానికి పడిపోయింది. బీహార్ లాంటి చోట్ల కేవలం 53 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. మోదీ అనేకసార్లు పర్యటించినా తమిళనాడులో గతంలో కంటే తక్కువ ఓటింగ్ శాతం నమోదైంది. కేవలం వేడి గాలులు, మండుటెండల వల్ల ఓటింగ్ శాతం తగ్గిందేమో అనుకుంటే ఉత్తరాఖండ్ వంటి పర్వత ప్రాంతాల్లో కూడా గతంలో కంటే ఆరు శాతం తక్కువగా నమోదైంది. ఓటు హక్కు విలువ గురించి సినిమా తారలనుంచి ఎందరో సెలబ్రిటీలతో ఉధృతంగా ప్రచారం చేయించినా ప్రయోజనం కనపడడం లేదు.

తన అద్భుత ప్రసంగాలకు ప్రజలు పరవశులై భారత దేశాన్ని శక్తిమంతమైన దేశంగా మార్చేందుకు పెద్ద ఎత్తున ముందుకు వస్తారని భావించి పెద్ద సంఖ్యలో ఓటు వేస్తారని భావించిన మోదీ మొదటి దశలో ఓటింగ్ జరిగిన తీరును చూసి నిరాశకు గురయ్యే ఉంటారు. యువ ఓటర్లను, ప్రధానంగా తొలిసారి ఓటర్లైన వారిని ఆకర్షించేందుకు ఆయన పదే పదే చేసిన ప్రసంగాలు వృథా అయినట్లు కనిపిస్తోంది. నిజానికి 18 నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువతలో కేవలం 38 శాతం మంది మాత్రమే ఓటు హక్కుకు నమోదు చేసుకోవడమే ఈ దేశంలో యువతలో ఎన్నికల రాజకీయాల పట్ల ఏర్పడుతున్న అనాసక్తికి నిదర్శనం. మోదీ అధికారంలోకి వచ్చిన కొత్తలో ఆయన ఎక్కడకు వెళ్లినా 'మోదీ, మోదీ' అని నినాదాలిచ్చిన యువత ఎక్కడకు వెళ్లింది? మోదీ పట్ల యువతకు ఆసక్తి తగ్గిపోతోందా? పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న తీరు, మోదీ ఏకఛత్రాధిపత్యం, ఎన్నికల్లో అక్రమాలు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధుల కొనుగోళ్లు, ప్రభుత్వ దర్యాప్తు సంస్థల దుర్వినియోగం ఇవన్నీ ప్రజలకు ముఖ్యంగా యువతకు వ్యవస్థల తీరు పట్ల ఏహ్యభావం పుట్టిస్తున్నాయా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ఎన్నికల ప్రక్రియ ఒక ప్రహసనంగా మారడం కూడా ఓటర్ల ఉదాసీనతకు కారణమేమో. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడాల్సి ఉన్నప్పటికీ సూరత్‌లో బీజేపీ అభ్యర్థి ముఖేశ్ దలాల్ గెలిచినట్లు ఎన్నికల కమిషన్ ఏకగ్రీవంగా ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థి నిలేష్ కుంభాని తనను ప్రతిపాదించిన ముగ్గురిలో ఒక్కరిని రిటర్నింగ్ అధికారి ముందుకు తీసుకువెళ్లడంలో విఫలమయ్యారు. దీనితో ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. ఆ వెంటనే పోటీలో ఉన్న బీఎస్పీ అభ్యర్థి సహా మిగతా 8 మంది నాటకీయంగా తమ నామినేషన్లనూ ఉపసంహరించుకున్నారు. ఈ పరిణామం తర్వాత నీలేష్ కుంభానీ అదృశ్యమయ్యారు. ఎవరికీ ఫోన్‌లో కూడా దొరకకుండా తప్పించుకున్నారు. ఆయన ఇంటిముందు కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా చేసినా ఫలితం లేకుండా పోయింది. ఆయన ఏదో ఒకరోజు సుముహూర్తంలో బీజేపీలో చేరడం ఖాయమని వార్తలు వస్తున్నాయి. మోదీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఈ ఎన్నికల్లో బీజేపీకి తొలి విజయం ఈ రకంగా లభించింది. నెలన్నర క్రితం చండీగఢ్ మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీకి మేయర్ పీఠం దక్కేందుకు రిటర్నింగ్ అధికారి స్వయంగా బ్యాలట్ పత్రాలను చెరిపేసిన ఉదంతం జనం మరిచిపోకముందే సూరత్ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ గెలుచుకున్న తీరు ప్రజాస్వామ్య ప్రహసనానికి మరో నిదర్శనంగా నిలిచింది. మునిసిపల్ ఎన్నికలైనా, లోక్‌సభ ఎన్నికలైనా విజయం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు బీజేపీకి ఆ లక్ష్యం ఎలాగైనా సాధించేందుకు ప్రయత్నిస్తుంది. అందుకు అవలంబించే మార్గాలపై ఎన్ని తీవ్ర విమర్శలు ఎదురైనా అది విననట్లు నటిస్తుంది.

మొదటి దశ ఎన్నికల ప్రచారంలో అభివృద్ధి గురించి, ప్రతిపక్షాల కూటమి లోపాల గురించి ఎక్కువగా మాట్లాడిన మోదీ రెండవ దశలో తన శైలిని మార్చి ప్రజలను మత ప్రాతిపదికన తన వైపుకు తిప్పుకునేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. నిజానికి ఇదే ఆయన సహజ శైలి. గుజరాత్‌లో ఈ శైలి వల్లనే ఆయన హిందువుల ఓట్లను పూర్తిగా తన వైపునకు తిప్పుకుని విజయవంతం కాగలిగారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంపదను ముస్లింలకు పంపిణీ చేస్తుందని, హిందువుల స్త్రీల మంగళ సూత్రాలపై కూడా కాంగ్రెస్ నేతల కళ్లు పడతాయని ప్రధానమంత్రి అంతటి స్థాయి వ్యక్తి ఉత్తరాదిన ఎన్నికల ప్రసంగాల్లో విమర్శించడం మత ప్రాతిపదికన ఓట్లను చీల్చే ప్రయత్నంలో భాగమేనని ఎవరికైనా అర్థమవుతుంది. ప్రజల కష్టార్జితాన్ని, విలువైన వస్తువులను చొరబాటుదారులకు, ఎక్కువ మంది సంతానం ఉన్న వారికి దోచి పెట్టాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. వివిధ సామాజిక వర్గాలకు జరగాల్సిన న్యాయం గురించి మాట్లాడుతూ, వనరుల పంపిణీలో ముస్లింలకు తొలి హక్కు ఉంటుందని మన్మోహన్ సింగ్ 18 సంవత్సరాల క్రితం క్రింద అన్న వ్యాఖ్యల్నీ మోదీ తనకు అనుకూలంగా మార్చుకున్నారు.

జీ–20 లాంటి సమావేశాల్లో, సెమినార్లలో, మన్ కీ బాత్‌లో ఎంతో హుందాగా మాట్లాడుతున్నట్లు కనిపించే నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారం, ప్రత్యర్థులను ఎదుర్కోవడం వరకు వచ్చేసరికి ఆయనలో అపరిచితుడు కనిపిస్తారు. శ్రావణ మాసంలో ప్రతిపక్షనేతలు మాంసం తింటారనే వ్యాఖ్యల్నీ చేసేందుకు ఆయన వెనుకాడడం లేదు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉన్న అనేక అంశాలను విస్మరించి, దాన్ని ముస్లింలీగ్ మేనిఫెస్టోగా అభివర్ణించారు. గుజరాత్ ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా ప్రచారం చేసిన రోజుల నుంచి ఆయన ఈ వ్యూహాన్ని అవలంబిస్తున్నారు. మత ప్రాతిపదికన చేసే ప్రసంగాలకు ఒక స్థాయి అంటూ ఉండాలని ఆశించడం అమాయకత్వం. ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా ఈ ప్రసంగాలకు అడ్డుకట్ట వేస్తుందని అనుకోవడం మరీ అమాయకత్వం. మోదీ వ్యాఖ్యల విషయమై ప్రతిపక్షాలు చేసిన ఫిర్యాదుపై మీడియా అడిగిన ప్రశ్నలకు కనీసం వ్యాఖ్యానించడానికి కూడా ఎన్నికల కమిషన్ నిరాకరించింది.

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లో ఓటింగ్ శాతం చూసిన తర్వాత హిందువులను ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టడమే సరైన మార్గమని మోదీ భావించి ఉంటారా అన్న అనుమానాలకు ఆస్కారం కలుగుతోంది. గత ఎన్నికల్లో బీజేపీ మధ్యప్రదేశ్‌లో 29 సీట్లకు 28 సీట్లు, రాజస్థాన్‌లో 25కు 24 సీట్లు, ఉత్తరాఖండ్‌లో 5కు 5 సీట్లు గెలుచుకుంది. ఈ సారి బీజేపీ ఇవే ఫలితాలు తిరిగి సాధిస్తుందా అన్న చర్చ జరుగుతోంది. ఓటింగ్ శాతం తగ్గడంతో పాటు ఎగ్జిట్ పోల్స్ గురించి బీజేపీకి అనధికారికంగా కూడా సమాచారం లభించే ఉంటుంది. ఈ నేపథ్యంలో బీజేపీ ఆశిస్తున్న 400 సీట్ల లక్ష్యాన్ని ఎంత మేరకు సాధించగలదా అన్న చర్చ కూడా సాగుతోంది. మతపరమైన భావోద్వేగాలు కల్పించడం తప్ప తమకు వేరే మార్గం లేదని బీజేపీ భావిస్తోందా? ఈ మార్గంలోనైనా బీజేపీ సఫలీకృతం కాగలదా?

ఏమైనా ఒక్కో దశ సమీపిస్తున్న కొద్దీ దేశంలో బీజేపీతో సహా అన్ని రాజకీయ పార్టీలు లక్ష్మణ రేఖల్ని దాటి అన్ని రకాల మార్గాల్నీ అవలంబించడంలో ఆశ్చర్యం లేదు. అది వాటి జీవన్మరణ సమస్య. కాని ఈ క్రమంలో ప్రజాస్వామ్యం పట్ల ప్రజల విశ్వాసం మరణించకుండా చూసుకోవడం అందరికీ అవసరం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

కరువుకు పునాది పడింది కేసీఆర్ పాలనలోనే!

వెయ్యి ఏనుగులు తిన్న ఒక ముసలి నక్క, నేను శాకాహారినైపోయానని చెప్పగా నమ్మిన గొర్రెలన్నీ పుర్రెలయ్యాయట. పదేళ్లు తెలంగాణను పాలించి, అప్పుల రాష్ట్రంగా మార్చి, దాని భవిష్యత్తును నాశనం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కరువు యాత్రకు వెళ్ళడం ఈ సామెతను గుర్తుకు తెస్తుంది. 2014కు ముందు తెలంగాణలో ఏ గోస, ఏ బాధ, ఏ ఏడ్పులు పడ్డామో అవి మళ్లీ వచ్చాయని, నీళ్ల కోసం ఎదురుచూపులు పునరావృతం అయ్యాయని కేసీఆర్ అంటున్నారు. అంటే ముఖ్యమంత్రిగా తాను పాలించిన పదేళ్ళల్లో నీటి పారుదల విధానం కరువును నిర్మూలించడంలో విఫలమైందని అంగీకరిస్తున్నారా? బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎండాకాలంలోనూ మేడిగడ్డ, సుందిళ్ల, ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోశామని, నాలుగు నెలల్లోనే పరిస్థితి తారుమారైందని కేటీఆర్ అన్నారు.

ఈ ఆరోపణలన్నింటినీ నిశితంగా పరిశీలిద్దాం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చివరి పదో ఏడు పరిపాలనకు చెందిన వర్షాకాలంలో, ఉత్తర తెలంగాణలో భారీ ఎత్తున వర్షాలు కురిసాయి. కానీ దక్షిణ తెలంగాణలో కనీస వర్షాలు కురవలేదు. దక్షిణ తెలంగాణలో ఏ గ్రావిటీ ప్రాజెక్టులు నిండనిది వాస్తవం. దశాబ్దాల నాడు కట్టిన శ్రీశైలం నాగార్జున సాగర్ జూరాల ప్రాజెక్టులకు నీళ్లు రానిది వాస్తవం. వర్షాకాలపు ఖరీఫ్ సీజన్‌లో నాగార్జున సాగర్ కింద లక్షలాది ఎకరాల్లో రైతుల పంటలకు సెలవును ముఖ్యమంత్రి కేసీఆరే ప్రకటించింది నిజం కాదా? బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు క్రాప్ హాలిడేను ప్రకటించి, అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత వేసంగి పంటకు కరువు వచ్చిందని గోల పెట్టడం ఏ నీతి? పార్లమెంటు ఎన్నికల్లో స్వప్రయోజనాల కోసమే కదా ఈ కరువు రాజకీయాలు?



> కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణలో పంటలకు నీరు అందింది ఆయన కట్టిన ప్రాజెక్టుల వల్ల కాదు. గత తొమ్మిదేళ్లు వర్షాలు తెలంగాణలో పుష్కలంగా పడడం వల్ల, భూగర్భ జలాలు పెరిగి, ఉచిత కరెంటుతో పంటలు పండాయి. వాస్తవాలకు భిన్నంగా, ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టే 80 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిందని ఫ్లెక్సీలతో రాష్ట్రమంతా భజన చేశారు.

కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణలో పంటలకు నీరు అందింది ఆయన కట్టిన ప్రాజెక్టుల వల్ల కాదు. గత తొమ్మిదేళ్ళ వర్షాలు తెలంగాణలో పుష్కలంగా పడడం వల్ల భూగర్భ జలాలు పెరిగి, ఉచిత కరెంటుతో పంటలు పండాయి. వాస్తవాలకు భిన్నంగా, ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టే 80లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిందని ఫ్లెక్సీలతో రాష్ట్రమంతా భజన చేశారు.

ఖజానాను దోచుకోవాలనే లక్ష్యంతో కాళేశ్వరం మేడిగడ్డ ఆగమేఘాలపై కట్టారు. ఢిల్లీ డ్యాం సేఫ్టీ ఇంజనీర్లు వేసిన ప్రశ్నలకు ఈఎన్సీ మురళీధర్ రావుతో సహా, ఇంజనీర్లు అందరూ నోరు వెళ్ళబెట్టింది వాస్తవం కాదా? ఆ తొందరలో చేసిన అనేక తప్పులతోనే ముందు మేడిగడ్డ ఐదు ఫీట్లు కుంగింది. నాలుగేళ్లలో మేడిగడ్డ నుండి ఎత్తిపోసింది 160 టీఎంసీలు. కడెం ఎదురు వరదలకు ఎత్తిన 100 టీఎంసీలు గోదావరి నుండి సముద్రంలో మళ్లీ కలిసింది నిజం కాదా? మీ పదేళ్ల నీటిపారుదల విధాన వైఫల్యంతో తలెత్తిన ఈ కరువుకు కేసీఆర్ కుటుంబానిదీ, పార్టీదే కదా బాధ్యత?

ప్రాజెక్టుల్లో చిన్న లోపాలను భూతద్దంలో పెట్టి చూపుతున్నారని, తెలివితక్కువతనంతో 50 టీఎంసీల నీళ్లు వదిలేశారని, కేసీఆర్‌ను బదనాం చేయాలన్న కుట్రతోనే నీళ్లు పోయేలా చేశారన్నారు కేసీఆర్. ఆయన నిర్మించిన మానస పుత్రిక నాలుగేళ్లకే గోదావరిలో కుంగినప్పుడు ఈ దివ్యజ్ఞానం ఏమైంది? మీ పాలనా కాలంలోనే ఢిల్లీ డ్యాం సేఫ్టీ ఇంజనీర్లు, నీళ్లు ఉంటే మూడు బ్యారేజీలకు ప్రమాదమని, మేడిగడ్డతో సహా అన్ని బ్యారేజీల్లో నీళ్లను, మీ చేతులతోనే సముద్రంలోకి వదిలిపెట్టింది నిజం కాదా?

తొలి తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణం చేసిన వెంటనే రూ.35,200 కోట్ల అంచనాతో దక్షిణ తెలంగాణలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభించారు. దక్షిణ తెలంగాణలో 12.30 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని ప్రకటించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ 7 లక్షల ఎకరాలు, ఉమ్మడి రంగారెడ్డి 5 లక్షల ఎకరాలు. పదేళ్లలో రూ.25వేల కోట్లు ఖర్చు చేశారు. నేటికీ ఇంకా అనేక పనులు పూర్తి కాలేదు. ప్రధాన కాలువలు పిల్ల కాలువల పనులు ఒక్క అడుగు కూడా మొదలు కాలేదు. డిసెంబర్ 2023లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు 31 మోటార్లకు కేవలం ఒకే ఒక్క మోటర్ ప్రారంభించి, ఒక్క చెరువులో రెండు గంటలు నీళ్లు పోసి, 12.30 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చినట్టు ఫోజు పెట్టారు. రాష్ట్రమంతా వందల కోట్ల ఖర్చుతో ఫ్లెక్సీలు, పత్రికల్లో ప్రకటనలు, టీవీల్లో ఉత్త ప్రచారాన్ని మార్మోగించారు. 25 వేల కోట్లు ఖర్చు చేసి, 25 ఎకరాలు కాదు, 25 అడుగుల నేలకు కూడా నీళ్లు ఇవ్వనిది వాస్తవం కాదా?

నల్లగొండ జిల్లాలో శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ గ్రావిటీ కాలువ (SLBC) పనులు చేస్తే కమిషన్లు రావని మీ పదేళ్ల పాలనలో దాన్ని పడుకోబెట్టింది వాస్తవం కాదా? 97 వేల కోట్లతో మూడేళ్లలో క్రుంగిన కాళేశ్వరం మేడిగడ్డ పూర్తి చేస్తే, తెలంగాణకు ముందే సగం పూర్తయిన ఎస్ఎల్‌బీసీ, పదేళ్లయినా ఎందుకు పూర్తి కాలేదు. రూ.6వేల కోట్ల అంచనాతో, 3 లక్షల 50 వేల ఎకరాలకు నీళ్లు ఇవ్వాలని, డిండి ఎత్తిపోతలు కేసీఆర్ చేపట్టారు. మూడు వేల కోట్లు ఖర్చుచేశారట. డిండి ఎత్తిపోతలకు నీళ్లు ఎక్కడి నుండి తీసుకోవాలో పదేళ్ళయినా నిర్ణయించలేదు. పదేళ్ల పాలనలో మూడెకరాలకు కూడా డిండి కింద నీళ్లు ఇవ్వలేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ఈ కరువులకు కారకులెవరు? పదేళ్ల పాలనతో దోపిడీకి కేంద్రమైన మీ నీటి పారుదల విధానం విఫలమై, కరువుకు కారకులైన మీరే, బరితెగించి కరువుపై గోల చేస్తే ప్రకృతి సిగ్గుపడుతుంది.

తెలంగాణలో గతంలో నిర్మించిన గ్రావిటీ ప్రాజెక్టులలోనే, వేలకోట్ల కమిషన్ల కొరకు భగీరథ పథకాన్ని చేపట్టి, ఉన్న ఆయకట్టును నాశనం చేశారు. మినిమం డ్రా డౌన్ లెవెల్ని విచ్ఛిన్నం చేశారు. ఆయకట్టును నాశనం చేసి, లక్షలాది ఎకరాల్లో మీరు కరువును సృష్టించలేదా? హైదరాబాదు మహానగరంలో నేడు ప్రజలు నీటికోసం విలవిలలాడుతున్నారు. మహానగరపు వీధులన్నీ వర్షాకాలంలో సముద్రాన్ని తలపిస్తే, వేసవిలో నీటి కటకట. మహానగర సుస్థిర జల సంరక్షణ కొరకు మీరు చేసిన ఘనకార్యం ఏమీ లేదు. భారీ పెట్టుబడి లేని, దోపిడీ లేని, చౌకైన ప్రకృతి అనుకూల విధానాలు అసలే మీకు గిట్టవు. లక్షల కోట్లతో పదుల దశలలో నీళ్లు భారీ ఎత్తిపోతలతో తరలించడమూ, మీరు మీ కాంట్రాక్టర్లు బాగుపడడమే మీ లక్ష్యం. అదే గ్రామీణ వ్యవసాయాన్ని కరువులో ముంచింది, ఖజానాను బడా కాంట్రాక్టర్లకు సమర్పించింది. రెండు కోట్ల మంది నివసించే మహానగరం జల కరువులో చిక్కుకుంది.

• నైనాల గోవర్ధన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com


గ్రామ రాజకీయాల స్థాయికి దిగజారిన రాష్ట్ర రాజకీయాలు!

వర్తమాన రాజకీయాలను చూస్తే ఐదారు దశాబ్దాల క్రితం గ్రామాల్లో నెలకొన్న పెత్తందారీ వ్యవస్థ రాజకీయాలను జ్ఞప్తికి తెస్తున్నాయి. ఎందరెందరో ప్రముఖ నాయకులు నిస్వార్థంగా రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించిన తెలుగు రాష్ట్రాలలో వర్తమాన రాజకీయాలు చూస్తుంటే జుగుప్సాకరమైన అసహనం, ఏమీ చేయలేని చేతకానితనం, భవిష్యత్తులో మరింకేమి కాబోతున్నదోనన్న ఆందోళన కలుగుతున్నదనడంలో బహుశా అతిశయోక్తి లేదేమో.

ఇటీవల ఎన్నికల ప్రచారంలో ఉన్న ఒక రాజకీయ నాయకుడి మీద జరిగిన రాళ్ల దాడి ఘటననే తీసుకుంటే– నమ్మశక్యం కాని సందేహంగా ఒకవైపు, ఒకవేళ అది నిజంగా ప్రతిపక్షంవారి పనే అయితే, ఇలాంటి చర్యలకు ప్రతిపక్షాలు పాల్పడవచ్చా అన్న మీమాంస మరోవైపు! రాష్ట్ర, దేశ రాజకీయాలలో దినదిన ప్రవర్ధమానమవుతున్న అసంబద్ధ ఆరోపణలు, ప్రత్యారోపణలు చూస్తుంటే అపనమ్మకమనే జీవాయుధం తీవ్రంగా పని చేస్తున్న రోజులు వచ్చాయనవచ్చు. ఈ తరహా దాడులు, 'కుళ్లు రాజకీయాలు' ఒకప్పుడు గ్రామ రాజకీయాలకే పరిమితమయ్యేవి. ఇప్పుడవి దేశ, రాష్ట్ర రాజకీయాలలో సర్వసాధారణమైపోయాయి.

ఈ సందర్భంగా ఐదారు దశాబ్దాల క్రితం అలనాటి ఖమ్మం జిల్లా, ఖమ్మం సమితి, గ్రామ రాజకీయాలు జ్ఞప్తికి వస్తున్నాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐఎం) మద్దతుతో శీలం సిద్దారెడ్డి; కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) మద్దతుతో జలగం వెంగళరావు వర్గాలుగా చీలిపోయారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో పెత్తందారుల కక్షలు కార్పణ్యాల వాతావరణం ఉండేది. మా గ్రామంలో కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐఎం) అభిమానులు ఉన్నప్పటికీ భూస్వాములకు భయపడి నిశ్శబ్దంగా ఉండిపోయేవారు. పంచాయితీ ఎన్నికలలో పోటీకి దిగే సాహసం చేయకపోయేవారు. నివురుగప్పిన నిప్పులా వ్యాపిస్తున్న తమమీద ఉన్న వ్యతిరేకత ఏ క్షణాన బహిర్గతమవుతుందో అన్న భయంతో, కమ్యూనిస్ట్ భావజాల కుటుంబ నేపథ్యం కలిగిన ఒక పెద్దమనిషిని, పెత్తందారీ గ్రామరాజకీయాలను నడుపుతున్న కాంగ్రెస్ పార్టీ పెద్దల ఆశీస్సులతో గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకునేవారు. గ్రామ నాయకత్వం జలగం వర్గానికి చెందిన వ్యక్తిగా చాలా మంచివాడైన గ్రామ పోలీసు పటేల్ చేతుల్లో ఉండేది.

పంచాయితీ ఎన్నికల తేదీ ప్రకటించగానే, రచ్చబండ దగ్గర అతడు నిర్ణయించిన అభ్యర్థి పేరే ప్రకటించి, గ్రామస్థుల ఆమోదం 'మూజువాణీ' పద్ధతిన పొంది, ఆయననే ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకునేవారు. గ్రామ రాజకీయాలను ఆసరాగా చేసుకుని, పెత్తందారులను అడ్డం పెట్టుకుని, గూండాగిరి చేస్తూ ఒక వ్యక్తి పటేల్‌కు సన్నిహితంగా వుంటూ, అతడి అండ చూసుకుని అందరి మీద పెత్తనం చేసేవాడు. తాగుడుకు బానిసై, గ్రామంలో ఇష్టారాజ్యంగా ప్రవర్తించేవాడు. సినిమాల్లో వలె పటేల్ అతడి ద్వారా పెత్తనం చెలాయించేవాడు. చివరకు ఇద్దరికీ బెడిసి ఒకరిని మరొకరు బెదిరించుకోవడం, పటేల్ మరో అనుచరుడు సైకిల్ చైన్‌తో అతడిని చితకబాదడం, మొత్తం వ్యవహారాన్ని పటేల్ తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేయడం పక్కా గ్రామ రాజకీయాల స్థాయిలో జరిగాయి. వర్తమాన రాష్ట్ర స్థాయి రాజకీయాలు ఈ స్థితిలోకి వచ్చాయిప్పుడు. తమపక్షంలో లేని వారిని, రానివారిని హింసకు గురిచేయడమే ఇప్పటి రాజకీయంగా మారింది!



> అలనాటి గ్రామ రాజకీయాలు నేడు రాష్ట్ర స్థాయికి చేరుకున్నాయి. గుళ్లో ప్రమాణాలు, పార్టీ మార్పిడులు, కులం కార్డులు, బెదిరింపులు, క్యాంపు రాజకీయాలు, ప్రజాప్రతినిధుల కొనుగోళ్లు, అమ్ముడుపోవడం, ప్రత్యర్థుల మీద దాడులు, మద్యం ధనం విచ్చలవిడిగా వాడకం, 'దమ్ముందా, వెంట్రుక పీకలేవు' లాంటి పదజాలం విరివిగా ఉపయోగం... ఇలా ఎన్నో అతి జుగుప్సాకరమైన రాజకీయాలు రాష్ట్ర, దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్నాయి.

మొత్తం మీద గ్రామంలోని ఒకరిద్దరు మోతుబరి రైతులు, పటేల్ పెత్తనం చెలాయించడం విషయంలో ఆగ్రహంగా ఉన్న అతడి మాజీ అనుయాయి, సైకిల్ చైన్ దెబ్బలు తిన్న వ్యక్తి, గ్రామానికి చెందిన పలువురు ఉత్సాహవంతులైన యువకులు, చేతులు కలిపారు. 'పసుపు బియ్యాల'తో ప్రమాణం చేశారు. (ఇలాంటి ప్రమాణాలు ఇటీవల కాలంలో రాష్ట్ర స్థాయి రాజకీయాలలో ఆనవాయితీ అయిపోయింది. తడిగుడ్డలతో దేవాలయాలలో, స్వంత పిల్లల మీద, ఇలా రకరకాల విధాలుగా చోటు చేసుకుంటున్నాయి).

పంచాయితీ ఎన్నికలు రావడంతో పల్లెటూరి రాజకీయానికి తెరలేచింది. అప్పట్లో మూడంచెల పంచాయితీ వ్యవస్థ ఉండేది. గ్రామంలో మొదలు ఎన్నికలు జరిగేవి. వార్డు సభ్యులను ఎన్నుకునేవారు. ఓటింగ్ వార్డు వారీగా జరిగేది. అదే రోజు సాయంత్రం గెలిచిన వార్డు సభ్యులంతా సాధారణ మెజారిటీ పద్ధతిలో సర్పంచ్‌ను ఎన్నుకునేవారు. కొద్ది రోజుల తరువాత సర్పంచ్‌లంతా కలిసి సమితి అధ్యక్షుడిని ఎన్నుకునేవారు. ముందుగా సమితికి ఆరుగురు కో–ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకుని, అంతా కలిసి సమితి అధ్యక్షుడిని రహస్య బాలెట్ ద్వారా ఎన్నుకునేవారు. కో–ఆప్ట్ చేసుకున్న సభ్యులకు కూడా సమితికి పోటీ చేసే అర్హత ఉంటుంది.

ఆ తరువాత సమితి అధ్యక్షులంతా కలిసి ఇదే ప్రక్రియలో జిల్లా పరిషత్ అధ్యక్షుడిని ఎన్నుకునేవారు. అక్కడా కో–ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకునే పద్ధతి ఉంటుంది. జిల్లా పరిషత్ చైర్మన్‌ది చాలా పవర్‌ఫుల్ హోదా. కొందరు కాబినెట్ మంత్రులుగా రాజీనామా చేసి, జిల్లా పరిషత్ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భాలున్నాయి. జిల్లా పరిషత్ చైర్మన్లకు ఎంత పలుకుబడి ప్రాబల్యం వుండేదంటే, వాళ్ల అంగీకారం లేకుండా ముఖ్యమంత్రి కావడం కూడా కష్టంగా ఉండేదారోజుల్లో. ఒకే ఒక్క గ్రామ సర్పంచ్ జిల్లా పరిషత్ ఎన్నికల భవితవ్యాన్ని మార్చగలిగే స్థితిలో ఉండేవారు అప్పుడప్పుడూ. సమితిలో ఒక్క ఓటుతో అదృష్టం తారుమారయ్యేది. అదే ఒక్క ఓటు జిల్లా పరిషత్‌లో కీలకమయ్యేది. ఇప్పుడు జెడ్పీ, మండల చైర్మన్లు ఉత్సవ విగ్రహాలే!

'పసుపు బియ్యాల మీద చేసిన ప్రమాణం' చేసినవారిలో కొందరు 'కులం కార్డు' ప్రాతిపదికగా, తిరిగి పటేల్ వర్గం కాంగ్రెస్ పార్టీలో చేరిపోయాడు. పటేల్ చేతిలో పరాభవం పొంది, దెబ్బలు తిని, పాతకాలపు గూండాగిరి మానిన వ్యక్తి కమ్యూనిస్ట్ పక్షాన ఒక వార్డులో పోటీ చేసి గెలిచాడు. తొమ్మిది వార్డులలో ఒక్క వార్డు మినహా, మిగతావన్నీ సీపీఐఎం–శీలం వర్గం కాంగ్రెస్ పార్టీకి దక్కాయి. ఇప్పటి శాసనసభా పక్షం నాయకుడి ఎన్నిక నేపథ్యంలో చోటుచేసుకునే రాజకీయాల తరయాలో, చివరి క్షణం వరకూ గెలిచిన వార్డు మెంబర్లను ప్రలోభపెట్టే ప్రయత్నం జరిగింది. అయినప్పటికీ, పటేల్‌కు అయిష్టమైన ఒకప్పటి ఆయన సహచరుడు, సర్పంచిగా ఎన్నికయ్యాడు.

ఈ నేపథ్యంలో ముగింపు మాత్రం వేరే విధంగా, ఇప్పటి 'రాష్ట్ర రాజకీయం', ఒకప్పటి 'గ్రామ రాజకీయం' శైలిలో జరిగింది. అచిర కాలంలోనే, మద్యానికి మరోసారి బానిసైన (అలా పటేల్ బానిసగా మలచిన) గ్రామ సర్పంచ్ (కులం కార్డు ప్రాతిపదికగా) పాతపగ మర్చిపోయి, మళ్లీ పటేల్ పక్షంలో చేరిపోయాడు. సమితిలో సగం గ్రామాలు కమ్యూనిస్ట్ (సీపీఐఎం), శీలం సిద్దారెడ్డి కాంగ్రెస్ వర్గం మిగిలిన సగం గ్రామాలు కమ్యూనిస్ట్ (సీపీఐ), జలగం వెంగళరావు కాంగ్రెస్ వర్గం గెలుచుకున్నది. ఖమ్మం సమితి గెలిచిన వారి పక్షమే జిల్లాపరిషత్ గెలుచుకునే పరిస్థితి నెలకొంది.

సమితి ఎన్నిక ఐదారు రోజులే ఉందనగా జలగం, శీలం వర్గాలు తమ తమ సర్పంచ్‌లతో 'క్యాంపులు' పెట్టే చర్యలు చేపట్టారు. (విపరీతమైన వ్యయంతో ఇలాంటి క్యాంపు రాజకీయాలు నిర్వహించడం ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో సర్వసాధారణం). శీలం క్యాంపునకు మా గ్రామ సర్పంచ్ కూడా వెళ్లాలి. వెళ్లనని పేచీ పెట్టాడు. అప్పటికే (మనం–మనం ఒకే కులం అన్న ప్రాతిపదికన) పటేల్‌తో అతడికి రహస్య ఒప్పందం కుదిరిన విషయం బయటపడకుండా వుంచారు! చివరికి సర్పంచ్ క్యాంపునకు వెళ్లక తప్పలేదు.

పద్ధతి ప్రకారం నిర్ధారించిన తేదీ నాడు ఖమ్మం సమితి అధ్యక్ష ఎన్నికకు సర్వం సిద్ధమైంది. తొలుత ఆరుగురు కో–ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక జరగాలి. మా గ్రామ సర్పంచ్‌ను, ఇరు (శీలం, జలగం) వర్గాలవారు తమ ఓటు కింద వేసుకున్నారు. (ఇలా ఇరుపక్షాలు ఒకే వ్యక్తిని తమ పార్టీవాడిగా భావించడం రాష్ట్ర రాజకీయాలలో ఇప్పుడు చాలా చిన్న విషయం.) మొదటి కో–ఆప్టెడ్ సభ్యుడిగా శీలం–సీపీఐఎం అభ్యర్థి మా సర్పంచ్ వేసిన ఓటుతో గెలిచాడు.

రెండవ అభ్యర్థిగా శీలం–సీపీఐఎం పక్షాన ఒక ప్రముఖ సీపీఐఎం నాయకుడు, సమితి అధ్యక్ష అభ్యర్థి, పోటీలో ఉన్నాడు. ప్రలోభాలకు అప్పటికే గురైన మా గ్రామ సర్పంచ్ అతడికి ఓటు వేయనందున ఓడిపోయాడు. ఆ సమయంలో సర్పంచ్‌కు తీవ్రమైన హెచ్చరిక పోయింది. ఫలితంగా, ఆ తరువాత మిగిలిన నలుగురు కో–ఆప్టెడ్ సభ్యులుగా శీలం–సీపీఐఎం గ్రూపు వారే ఎన్నికయ్యారు. కమ్యూనిస్ట్ (మార్క్సిస్ట్) పార్టీకి సమితి దక్కకుండా చేద్దామని, జలగం గ్రూపు అభ్యర్థి సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించినా ఫలితం లేకపోయింది.

గెలిచిన వారిలో సీపీఐఎం పార్టీకి చెందిన ఒకరు సమితి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. జిల్లాపరిషత్ చైర్మన్ పదవికి శీలం వర్గానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి, వైస్ చైర్మన్‌గా కమ్యూనిస్ట్ (మార్క్సిస్ట్) పార్టీకి చెందిన వ్యక్తి ఎన్నికయ్యారు. ఇది అప్పట్లో ఒక్క మా గ్రామ, లేదా ఖమ్మం సమితి పరిస్థితి మాత్రమే కాదు. గ్రామ గ్రామాన ఇదే అనుభవం కొంచెం మార్పులు, చేర్పులతో!

అలనాటి గ్రామ రాజకీయాలు క్రమంగా మరింత దిగజారి నేడు రాష్ట్ర స్థాయికి చేరుకున్నాయి. గుళ్లో ప్రమాణాలు, పార్టీ మార్పిడులు, కులం కార్డులు, బెదిరింపులు, క్యాంపు రాజకీయాలు, ప్రజాప్రతినిధుల కొనుగోళ్లు, అమ్ముడుపోవడం, ప్రత్యర్థుల మీద దాడులు, మద్యం ధనం విచ్చలవిడిగా వాడకం, 'దమ్ముందా, వెంట్రుక పీకలేవు' లాంటి పదజాలం విరివిగా ఉపయోగం... ఇలా ఎన్నో అతి జుగుప్సాకరమైన రాజకీయాలు రాష్ట్ర, దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్నాయి. ఈ దిగజారుడు రాజకీయాలకు ఆద్యులెవారు, బాధ్యులెవరు? ఏ రాజకీయనాయకుడిని అడిగినా అవతలి పక్షం వారివైపు వేలు చూపిస్తున్నారు!

■ వనం జ్వాలా నరసింహారావు

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru









హనుమాన్ విగ్రహానికి పూలు చల్లుతున్న రాధామనోహర్ దాస్

8

ప్రపంచానికి శాంతినిచ్చేది హిందూత్వమే..

- హనుమంతుడిని ఆదర్శంగా తీసుకోవాలి
- హిందూ ధర్మప్రచారకుడు శ్రీ రాధామనోహర్ దాస్
- నగరంలో ఘనంగా శోభాయాత్ర



ఓరుగల్లుపై.. కడియం అస్త్రం

వ్యూహాత్మకంగానే కావ్యను బరిలోకి దించిన కాంగ్రెస్

- 36ఏళ్ల తరువాత మహిళ అభ్యర్థికి అవకాశం
- పదేళ్లుగా మూడు ఎన్నికల్లో చేతికి చిక్కని వరంగల్
- బీఆర్ఎస్‌కు కడియంతో చెక్‌పెట్టేలా రేవంత్‌రెడ్డి వ్యూహం
- లోక్‌సభ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు అధికార పార్టీవారే..
- నేటి జన జాతర సభకు శ్రేణుల విస్తృత ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

ఓరుగల్లులో పాగా వేసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఈ స్థానాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. 'కడియం' అస్త్రంగా 36 ఏళ్ల తరువాత తొలిసారి మహిళ అభ్యర్థిని బరిలో దింపారు. గత మూడు ఎన్నికల్లో వరుసగా పరాజయాన్ని మూట కట్టుకున్న కాంగ్రెస్ ఈసారి వరంగల్‌లో గెలిచి తీరాలన్న లక్ష్యంతో వ్యూహరచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని పార్టీలో చేర్చుకోవటమే కాకుండా, ఆయన కుమార్తె కావ్యను కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దింపారు. కడియంకు రాజకీయాల్లో ఉన్న క్లీన్ ఇమేజ్.. కాంగ్రెస్ వంద రోజుల పాలనకు తోడై విజయాన్ని అందిస్తుందనే లెక్కల్లో శ్రేణులు ఉండగా.. గత అ సెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీల్లో ఆ పార్టీకి భారీగా ఓట్లు పోలవటం.. ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వారే కావడం తమకు కలిసి వస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది.

వరంగల్‌లో విజయమే లక్ష్యంగా పావులు..

తొలినుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉన్న వరంగల్‌లో ఓటర్లు మూడు పర్యాయాలు బీఆర్ఎస్‌కు జై కొట్టారు. నియోజకవర్గాల పునర్విభజనలో 2009లో ఏడు నియోజకవర్గాలతో

మిగతా 8వ పేజీలో..

నేడు జనజాతర సభ

హాజరవనున్న సీఎం రేవంత్‌రెడ్డి



కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధవారం వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్ కార్యక్రమానికి హాజరవనున్న సీఎం రేవంత్‌రెడ్డి సాయంత్రం 4గంటలకు మడికొండలో జరిగే జన జాతర బహిరంగసభలో ప్రసంగిస్తారు. వరంగల్ పశ్చిమ, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట నియోజకవర్గాలతో పాటు పొరుగున ఉన్న ఇతర మండలాల నుంచి కార్యకర్తలను ఈ సభకు భారీగా తరలించేందుకు కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ పాంచ్ న్యాయ్ పథకాలతో పాటు ఉమ్మడి వరంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ జిల్లాల విలీనంపై ప్రకటన చేసే అవకాశం ఉందని, అలాగే వరంగల్ నగరానికి నిధులు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, విమానాశ్రయం తదితర అంశాలపై ఓరుగల్లు ప్రజలకు సీఎం హామీలు ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. కాగా, పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ తరువాత తొలిసారి సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌కు వస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు సభ ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు.



బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి సభకు హాజరైన పార్టీ శ్రేణులు

మాట్లాడుతున్న కేటీఆర్

మోసపూరిత హామీలతో గద్దెనెక్కారు

- ఈ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పాలి
- కడియం.. నయవంచకుడు, విశ్వాస ఘాతకుడు
- మోదీ పిరమయ్యాడు.. ఓటుతో బీజేపీ, కాంగ్రెస్‌లను తొక్కెయ్యాలి
- బీఆర్ఎస్10 సీట్లు గెలిస్తే కేసీఆర్ రాజకీయాలను శాసిస్తారు
- వరంగల్ తూర్పు, వర్ధన్నపేట సమావేశాల్లో కేటీఆర్

7

గత అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత హామీలిచ్చి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డికి ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం వరంగల్‌లో జరిగిన తూర్పు నియోజకవర్గ విస్తృత స్థాయి, హనుమకొండ హంటర్‌రోడ్డులో జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఇటు కాంగ్రెస్‌తో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు పట్టం కట్టాలన్నారు.

- మట్టెవాడ/రాంనగర్

ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు బదిలీ

వరంగల్ లీగల్, ఏప్రిల్ 23: హనుమకొండ జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బ్యంగి శ్రీనివాసులు బదిలీ అయ్యారు ఈ మేరకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఆయన గోదావరిఖని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్ జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రటరీగాపనిచేస్తున్న క్షామదేశ్‌పాండేను హైకోర్టు నియమించింది.

నేడు ఇంటర్ ఫలితాలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23: ఇంట ర్మీడియెట్ పరీక్ష ఫలితాలను బోర్డు బుధవారం ఉదయం 11 గంటలకు ప్రకటించనుంది. దీంతో వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసిన ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. హనుమకొండ జిల్లాలో ఫస్టియర్‌లో 19,528, సెకండ్ ఇయర్‌లో 19,309 మంది మొత్తం 38,837 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇక వరంగల్ జిల్లాలో ప్రథమ సంవత్సరం 6,164 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సం 6,456 మంది విద్యార్థులు మొత్తం 12,620 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. రెండు జిల్లాల్లో కలిపి మొత్తం 51,457 మంది విద్యార్థులు ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

బీజేపీ అబద్ధాల పార్టీ

- లక్షమందితో మడికొండ బహిరంగసభ నిర్వహణ
- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

న్యూశాయంపేట, ఏప్రిల్ 23 : బీజేపీ పార్టీ తెలంగాణ ప్రజలను మోసం చేస్తూ అబద్ధాలతో రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కడియం మాట్లాడారు. బుధవారం మడికొండలోని లక్షమందితో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరవుతారన్నారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతుగా సుమారు లక్ష మంది హాజరవుతారన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో కావ్య 2 లక్షల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలవబోతుందన్నారు. బీజేపీ పార్టీ వామపక్ష భావజాలాన్ని, అంబేద్కర్ వాదాన్ని అణచి వేస్తోందని, అందుకే దేశవ్యాప్తంగా అందరు కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి సిద్ధమయ్యారని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే కాంగ్రెస్‌కు సీపీఐ పార్టీ మద్దతు ఇస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇచ్చి అభ్యర్థి కడియం కావ్య గెలుపునకు కృషి చేస్తామన్నారు. దేశంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలను రోడ్డు పాలు చేస్తుందన్నారు. ముఖ్యంగా పేదలు, దళితులు, గిరిజనులు, బీసీలు, మైనార్టీల వ్యతిరేఖ పార్టీగా బీజేపీ మారిందని, అలాంటి బీజేపీని ఓడించి తీరుతామన్నారు.

వరంగల్ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడు తూ.. కడియం కావ్య గెలుపునకు ప్రతీ సీపీఐ కార్యకర్త కష్టపడి పని చేయాలని, ప్రస్తుతం పరిణామాలను గమనించి ఒక్కస్థానం ఇవ్వకున్నా ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన సీపీఐకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.విజయ సారథి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవితోపాటు హనుమకొండ, వరంగల్ జి ల్లాల సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన లీగల్ సెల్ నాయకులు



లీగల్ సెల్ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం కావ్య

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 23: ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు మంగళవారం సాయంత్రం హనుమకొండలోని విశాల్ భవన్‌లో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని సూచించారు. కడియం కావ్య మాట్లాడుతూ తనకు మద్దతుగా పార్టీలో చేరిన లీగల్‌సెల్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీ బార్ కౌన్సిల్ సభ్యులు, జాతీయ మాదిగ న్యాయవాదుల ఫోరం చైర్మన్ జయాకర్‌మాదిగ, బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ విభాగం ఉమ్మడి ఫౌండర్ నీల శ్రీధర్‌రావు, అర్బన్ ప్రెసిడెంట్ సూరం నరసింహస్వామి, సీనియర్ న్యాయవాదులు గంజి గణేష్‌లతో పాటు 100మంది న్యాయవాదులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తొగరు జగన్మోహన్‌రెడ్డి, తోట వెంకటరాజ్‌కుమార్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, పోతరాజు రవి, నల్ల మాహత్మ, ముద్దస్సిర్, రమేష్, రవిందర్, బంక సరళ, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఓటరుకు ఓటరు స్లిప్ చేరేలా చర్యలు తీసుకోవాలి

- రేపటి నుంచి మే 8 వరకు స్లిప్పుల పంపిణీ పూర్తి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 23: ఓటరు సమాచార స్లిప్ ప్రతీ ఓటరుకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని, స్లిప్పులను ఓటర్లకు బీఎల్ఓల ద్వారా అందేవిధంగా చూడాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారు లను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో కేంద్ర ఎన్నికల సం ఘం అనుమతి పొందిన హనుమకొండ రెవెన్యూ జిల్లా పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్ల పోలింగ్ కేంద్రాలలో జరిగిన మార్పుల వివరాల జాబితాను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వాటి ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు సమాచార స్లిప్పులను అందించే ప్రక్రియ పై ఆర్డీవోలు స్థానిక తహసీల్దార్ల ద్వారా శిక్షణ అందించాలన్నారు. వరంగల్ పశ్చిమ, పరకాల ఆర్డీవో కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పశ్చిమ, పరకాల నియోజకవర్గాల పరిధిలోని అన్ని పోలింగ్‌కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లా పరిధిలోని ఓటర్లకు ఓటరు సమాచార స్లిప్‌ల (వీఐఎస్) పంపిణీని ఈనెల 25వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు పంపిణీ చేస్తా మన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.



అరూరికి మద్దతు తెలుపుతున్న నాయీ బ్రాహ్మణులు



ఊకల్ బీఆర్ఎస్ నాయకులకు కండువా కప్పి బీజేపీలోకి చేర్చుకుంటున్న రమేష్

నాయీ బ్రహ్మణులకు మోదీ చేయూత

- విశ్వకర్మ పథకం ద్వారా రూ.3లక్షల ఆర్థిక సహాయం
- వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు మద్దతు
- నాయీబ్రహ్మణ సంఘం నాయకుల వెల్లడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశ్వకర్మ పథకం ద్వారా నాయీ బ్రాహ్మణులకు రూ.3లక్షల రుణం అందించి ఆదకుందని హనుమకొండ జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు భారత దేశం వైపు చూడటానికి ప్రధాని మోదీనే కారణమన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వరంగల్ లోక్‌సభ బీజేపీ కార్యాలయంలో అరూరి రమేష్‌ను నాయీ బ్రాహ్మణులు మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ.. నాయీ బ్రాహ్మణులు కష్టసుఖాల్లో అరూరి రమేష్ ఎల్లప్పుడు అండగా ఉంటున్నారని గుర్తు చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రమేష్‌కు అత్యధిక మెజారిటీ వచ్చేందుకు వరంగల్ లోక్‌సభ పరిధిలోని నాయీ బ్రాహ్మణులందరూ పార్టీలకతీతంగా శ్రమించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా తనకు మద్దతు తెలిపిన నాయీ బ్రాహ్మణులకు అరూరి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్, కుర్మిల్ల రమేష్, కస్తూరి నవీన్, కొత్తపెల్లి కిరణ్, మొగిలిచర్ల జనార్దన్, నవీన్, రమేష్, సాంబయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

బీజేపీలోకి ఊకల్ బీఆర్ఎస్ నాయకులు

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఊకల్‌కు చెందిన బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ రాంబాబు సమక్షంలో పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు మంగళవారం బీజేపీలో చేరారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌లు కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఊకల్ గ్రామ రైతు అధ్యక్షుడు లెక్కల నారాయణ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ అధ్యక్షుడు దీకొండ సంతోష్, గణేష్ ఉన్నారు.



మంగళవారం ఉష్ణోగ్రత
గరిష్ఠం : 40.0°C
కనిష్ఠం : 25.0°C

ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్‌వైర్ దొంగల అరెస్టు

హసన్‌పర్తి, ఏప్రిల్ 23: చాలా రోజుల నుంచి తప్పించుకుని తిరుగుతూ వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్‌వైర్, మోటార్లు, ఇనుప సామగ్రిని దొంగిలించిన ఏడుగురు నిందితులను మంగళవారం హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ జవ్వాజీ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డెపల్లి చర్చి ప్రాంతంలోని పూరిగుట్టకు చెందిన భూక్య రమేశ్, బోడ రాజేందర్, వాంకుడోతు రాజ్‌కుమార్, గోపగాని ప్రశాంత్, అంబి సురేష్, భూక్య నరేష్, బోడ వినోద్‌కుమార్ డబ్బును సంపాదించాలనే ఉద్దేశంతో పోలీసస్టేషన్ల పరిధిలోని వ్యవసాయ బావుల వద్ద మోటార్లను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, వాటిలోని కాపర్ వైర్లను, ఇనుప సామగ్రిలను దొంగతనాలు చేస్తుడేవారు. మంగళవారం హసన్‌పర్తి పోలీసులు బావుపేట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక ఆటోలో నలుగురు దొంగిలించిన సామానుతో, మరో ముగ్గురు స్కూటీపై వెళ్తున్నారు. ఆటో, స్కూటీలను ఆపమని అడుగగా తప్పించుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని తనిఖీ చేశారు. అందులో దొంగిలించిన వస్తువులు ఉన్నాయి. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆ సామన్లను తామే దొంగిలించామని ఒప్పుకున్నారు. ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు, కమలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, ఒక ఇనుపగేటు, హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో మోటార్లు, ఇనుప సామాన్లు దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారు. వస్తువులను స్వాధీనం చేసుకుని, ఏడుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దొంగలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ జవ్వాజీ సురేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు, క్రైం కానిస్టేబుల్ క్రాంతి కుమార్, మధు, ఐటీ కోర్ ఏఏవో సల్మాన్ పాషా, నగేష్‌లను సీపీ అంబర్ కిషోర్ ఝూ, ఏసీపీ అభినందించారు.

ఓపెన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

హనుమకొండ డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో డాక్టర్ అబ్దుల్ హై

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై అన్నారు. ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం డీఈవో కార్యాలయంలో ఓపెన్ స్కూల్ పరీక్షల సీఎస్, డీవోలతో పరీక్షల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో డాక్టర్ అబ్దుల్‌హై మాట్లా డుతూ.. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకుంటు న్నామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకురావద్దని సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ నెల 25 నుంచి మే 2 వరకు పరీక్షలు జరుగనున్నాయి. టెన్త్ పరీక్షలు రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండవ సెషన్‌లో జరుతాయి. అలాగే ఇంటర్ పరీక్షలు రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలా..

టెన్త్ పరీక్షలకు హనుమకొండ జిల్లాలో 2 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 292 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వరంగల్‌లో 3 కేంద్రాల్లో 552 మంది, మహబూబాబాద్‌లో 3 కేంద్రాల్లో 577 మంది, జయశంకర్ భూపా లపల్లిలోని ఒకే కేంద్రంలో 208 మంది, ములుగులో 3 కేంద్రాల్లో 526, జనగామ జిల్లాలో ఏర్పాటు చేసిన 2 కేంద్రాల్లో 274 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే ఇంటర్ పరీక్షలకు హనుమకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన 4 కేంద్రాల్లో 936 మంది విద్యార్థులు హాజరు కానుండగా, వరంగల్‌లో 4 కేంద్రాల్లో 650 మంది, మహబూబాబాద్‌లో 3 కేంద్రాల్లో 727 మంది, జయశంకర్ భూపాలపల్లిలో 2 కేంద్రాల్లో 378 మంది, ములుగులో 3 కేంద్రాల్లో 602, జనగామ జిల్లాలో ఏర్పాటు చేసిన 3 కేంద్రాల్లో 608 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టెన్త్‌కు 14 కేంద్రా లను ఏర్పాటు చేయగా 2,429 మంది, ఇంటర్‌కు 19 కేంద్రాలు ఏర్పాటు చేయగా 3,901 మంది పరీక్షలు రాయనున్నారు.

29 నుంచి శాతవాహన ఎక్స్‌ప్రెస్ రద్దు

కాజీపేట, ఏప్రిల్ 23: సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలో చేపడుతున్న రైల్వే ట్రాక్ నిర్మాణం, మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 29 నుంచి పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అందులో భాగంగా సికింద్రాబాద్ - విజయవాడ మధ్య ప్రయాణించే (12713, 14)శాతవాహన ఎక్స్‌ప్రెస్ అప్ అండ్ డౌన్ రైలును ఏప్రిల్ 29 నుంచి మే 10 వరకు, అలాగే మే 16 నుంచి 22 వరకు రద్దు చేశారు. (07757) వరంగల్ - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - కాజీపేట జంక్షన్ల మధ్య నడిచే పుష్‌పుల్ రైలు మే 3, 4 తేదీలలో రద్దు చేస్తున్నామని, అనంతరం రైళ్లు యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

బీఆర్ఎస్, బీజేపీలు చీకటి దోస్తులు

▸ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



మడికొండ జన జాతర సభా స్థలిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ, ఏప్రిల్ 23: బీఆర్ఎస్, బీజేపీలు చీకటి దోస్తులని, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా బుద్ధిరాలేదని, అలాగే బీఆర్ఎస్ అభ్యర్థి సచ్చిన పాములాంటివాడని, ఆయనకు ఓటు వేసే వారే లేరని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు విమర్శించారు. బుధవారం మడికొండలో నిర్వహించనున్న కాంగ్రెస్ జన జాతర సభాస్థలిని మంగళవారం ఎమ్మెల్యే సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. భూ కబ్జాదారుడైన అరూరి రమేష్‌ను బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం సిగ్గుచేటన్నారు. మోసాలు, భూకబ్జాలు చేసిన అరూరి మాటలు ప్రజలు నమ్మవద్దని తెలిపారు. సబ్బండ వర్గాల ప్రజలకు సమ న్యాయం జరగాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అలాగే స్థానిక ప్రజలకు ఇబ్బందిగా పరిణమించిన డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి, జిల్లా స్టడీ సర్కిల్ ఏర్పాటు కోసం సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తానని హామీ ఇచ్చారు.


ఈ సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాజీపేట మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు కుర్ల మోహన్, వస్కుల శంకర్, బ్లిల రవిందర్, గుర్రం అమర్‌నాథ్, గడుసు రాజు, వస్కుల నాగరాజు, వస్కుల శ్రీను, కడమంచి సాయిలు, కడమంచి మహేందర్, దండిగం సదానందం తదితరులు పాల్గొన్నారు.

కడియం కావ్యకే మాదిగల మద్దతు

వడ్డెపల్లి: లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకే మాదిగ హక్కుల దండోరా సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నదని, మాదిగ సమాజం కడియం కావ్యను గెలిపించాలని మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునిల్ మాదిగ అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాత్ర ఎనలేనిదని అన్నారు. ఎస్సీ ఉప కులాల నుంచి రాజకీయంగా ఎదిగిన కడియం శ్రీహరి మాదిగ ఉద్యమానికి ఎంతగానో సేవ చేశారని స్పష్టం చేశారు. 2014లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి మహాజన సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన మంద కృష్ణ మాదిగను ఓడించి మట్టికరిపించిన అరూరి రమేష్‌కు మంద కృష్ణ మద్దతు ప్రకటించడం చారిత్రక తప్పిదమని రేగుంట సునిల్ మాదిగ అన్నారు. బీజేపీ నాయకులు రాజ్యాంగాన్ని మారుస్తామని బహాటంగానే ప్రకటిస్తుంటే మంద కృష్ణ మాదిగ ఆ పార్టీకి వంత పాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అరూరి రమేష్ మంద కృష్ణ మాదిగకు చెందిన భూమిని కబ్జా చేసిన ఘనుడని ఆరోపించారు. అలాంటి అరూరి రమేష్‌కు మంద కృష్ణ మాదిగ మద్దతు ప్రకటించడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. మాదిగ సమాజానికి లోక్‌సభ టికెట్ కేటాయించలేదని భవిష్యత్‌లో రాజ్యసభ, ఎమ్మెల్సీ, నామినేట్ పదవులు కేటాయించి న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సమావేశంలో జై భీమ్ యూత్ జిల్లా కన్వీనర్ తాళ్లపెల్లి విజయ్, ఎంహెచ్‌డీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుకటి జనార్ధన్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి రవి, రాష్ట్ర, జిల్లా నాయకులు ఎర్రోళ్ల సురేష్, మాట్ల రమేష్, పోశన్న, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సెగ్మెంట్ స్కాన్





విశిష్ట తీర్పుల కోట

హనుమకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం విశిష్టమైన నేపథ్యాన్ని కలిగి ఉన్నది. ఇక్కడి ఓటర్లు ప్రతీసారి విలక్షణమైన తీర్పు ఇస్తూ వచ్చారు. ఒకసారి మరోసారి తిరిగి ఆవిర్భవించిన మహబూబాబాద్ లోకసభ స్థానం మొదట జనరల్ స్థానంగా ఉండి ఆ తర్వాత ఎస్టీకి రిజర్వు అయింది. ఇటికాల మధుసూదన్ రావు, రామసహాయం సురేందర్‌రెడ్డి వంటి ప్రముఖ నేతలను పార్లమెంట్‌కు పంపిన ఘనమైన చరిత్ర కలిగిన నియోజకవర్గం ఇది. మరో దఫా ఎన్నికలకు సిద్ధమైంది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట అయిన మహబూబాబాద్ లోకసభ స్థానంలో 2019, 2024 మధ్య రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ గుప్పిట్లో ఉన్న ఈ నియోజకవర్గంలో ఈ సారి ఎన్నికల్లో జనం బలంతో గెలిచి మానుకోటపై జెండా ఎగురవేసేది ఎవరు? ఈ లోకసభ ఎన్నికల్లో సీన్ ఎలా ఉండబోతోంది.? అన్నది సర్వత్రా చర్చనీయంగా మారింది.

1957లో..

మహబూబాబాద్ లోక్‌సభ స్థానం 1957లో ఏర్పాటైంది. నియోజకవర్గాల పునర్విభజన ఫలితంగా 1967లో రద్దయింది. ఆ తర్వాత 2009లో తిరిగి ఆవిర్భవించింది. ఒకసారి రద్దయి తిరిగి ఏర్పాటైన చరిత్ర కలిగిన నియోజకవర్గం ఇదే. 1957, 1962 ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన ఇటికాల మధుసూదన్‌రావు రెండుసార్లు ఈ నియోజకవర్గం నుంచి వరుసగా గెలుపొందారు. ఆ తర్వాత 1965లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆర్.సురేందర్‌రెడ్డి విజయం సాధించారు. ఆయన ఆ తర్వాత 1967, 1989, 1991 ఎన్నికల్లో మూడుసార్లు వరంగల్ లోకసభ నియోజకవర్గం నుంచి గెలిచి రికార్డు సృష్టించారు. 1967లో మహబూబాబాద్ నియోజకవర్గం రద్దయింది. ఈ నియోజకవర్గంలోని కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లను కలిపి భద్రాచలం (ఎస్టీ) నియోజకవర్గం ఏర్పాటైంది. ఈ స్థానంలో 11 సార్లు ఎన్నికలు జరిగాయి. ఖమ్మం జిల్లాతో పాటు పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లతో కూడి తెలంగాణ, ఆంధ్రప్రాంతాలకు వారధిగా ఉన్న భద్రాచలం నియోజకవర్గం 2009లో రద్దయింది.

- ఒకసారి రద్దయి మళ్లీ ఆవిర్భావం
- నాడు జనరల్.. ఇప్పుడు ఎస్టీ రిజర్వుడు
- విశిష్ట తీర్పునిస్తున్న మహబూబాబాద్ లోక్‌సభ ప్రజలు
- ఇప్పుడు త్రిముఖ పోరులో గెలిచేదెవరో?
- బరిలో అంతా పాతముఖాలే..
- అందరూ ఎంపీలుగా చేసిన వారే..
- ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట
- 2014 తర్వాత మారిన బలాబలాలు
- మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ముఖ చిత్రం

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
డోర్నకల్	1,09,150	1,13,455	07	2,22,612	264
మహబూబాబాద్	1,26,611	1,31,794	46	2,58,451	287
నర్సంపేట	1,15,068	1,20,370	09	2,35,447	283
ములుగు	1,13,592	1,19,172	27	1,32,791	307
పినపాక	99,824	1,03,798	05	2,03,627	250
ఇల్లందు	1,09,812	1,15,094	04	2,24,910	242
భద్రాచలం	72,925	7,83,280	07	1,52,529	180
మొత్తం	7,46,982	7,83,280	105	15,30,367	1,813

పునరావిర్భావం

నియోజకవర్గాల పునర్విభజన ఫలితంగా 2009లో మహబూబాబాద్ నియోజకవర్గం మళ్లీ ఆవిర్భవించింది. అయితే అంతకు ముందు జనరల్‌గా ఉన్న ఈ స్థానం ఎస్టీకి రిజర్వు అయింది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ఎన్నికయి తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. యూపీఏ సర్కార్‌లో కేంద్రమంత్రిగా పని చేశారు. 20014 ఎంపీ ఎన్నికలు వచ్చేసరికి మానుకోట బీఆర్ఎస్‌కు కంచుకోటగా మారింది. తొలిసారి మహబూబాబాద్‌లో గులాబీ జెండా ఎగిరింది. టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన సీతారాంనాయక్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌పై విజయం సాధించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా పనిచేసిన సీతారాం నాయక్.. తెలంగాణ ఉద్యమ సమయంలో చేసిన కృషిని గుర్తించి టీఆర్ఎస్ నుంచి మహబూబాబాద్ ఎంపీగా పోటీ చేసే అవకాశం కేసీఆర్ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో సీనియర్ నేత డీఎస్ రెడ్యానాయక్ కూతురు మాలోతు కవిత టీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచి పార్లమెంట్‌లో మొదటిసారి అడుగుపెట్టారు. మొత్తంగా మానుకోట లోక్‌సభ నుంచి ఇప్పటి వరకు ముగ్గురు గిరిజనులు ఒక్కోసారి గెలవగా, ఒక రెడ్డి నేత, ఇతర సామాజికవర్గానికి చెందిన మరొకరు రెండు సార్లు ఎన్నికయ్యారు.

మారిన సమీకరణలు

2009 వరకు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం.. 2014 ఎన్నికలు వచ్చేసరికి మారిన రాజకీయ సమీకరణాల ఫలితంగా టీఆర్ఎస్ వశమైంది. 2014, 2019 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు ఈ నియోజకవర్గంలో టీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో చోటు చేసుకున్న సరికొత్త పరిణామాల ప్రభావం ఈ నియోజకవర్గంపై కూడా పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో ఇక్కడ బీఆర్ఎస్ పునాదులు కదిలిపోయాయి. ఈ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు- డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, పినపాక, ఇల్లందు, భద్రాచలం ఉన్నాయి. ఆరు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించగా, ఒక్క భద్రాచలంలో బీఆర్ఎస్ గెలిచింది. అయితే ఇక్కడి నుంచి గెలిచిన తెల్లం వెంకట్రావు సైతం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. దీంతో మహబూబాబాద్ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ గుప్పిట్లోకి వచ్చినట్లయింది. ములుగు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన సీతక్క.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో కేబినెట్ మంత్రిగా కొనసాగుతున్నారు.



మాలోతు కవిత (బీఆర్ఎస్) | సీతారాంనాయక్ (బీజేపీ) | పోరిక బలరాంనాయక్ (కాంగ్రెస్)

పాతముఖాలే..

గతంలో మానుకోట లోక్‌సభ స్థానం నుంచి గెలిచి బీఆర్ఎస్ నుంచి టికెట్ రాక భంగపడిన సీతారాంనాయక్ బీజేపీలో చేరి కాషాయం కండువా కప్పుకున్నాడు. ప్రస్తుతం ఆ పార్టీ నుంచి ఇక్కడ బరిలో దిగి మరోసారి అదృష్టం పరీక్షించుకోబోతున్నారు. గతంలో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన పోరిక బలరాంనాయక్ ఇదే పార్టీ నుంచి తిరిగి పోటీ చేస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత బీఆర్ఎస్ నుంచి తిరిగి పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో నెలకొన్న ఈ త్రిముఖ పోటీలో ఈసారి ఏ పార్టీ విజయపతాకం రెపరెపలాడుతోందోనన్న ఉత్కంఠ నెలకొన్నది. మహబూబాబాద్ లోక్‌సభ స్థానం ఈ సారి కూడా తనదేనన్న విశ్వాసాన్ని బీఆర్ఎస్ వ్యక్తం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయంతో మంచి ఊపుమీద ఉన్న కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో మానుకోటలో సత్తాచాటుతామన్న ధీమాతో ఉన్నది. మోదీపై ఉన్న ఆకర్షణ, బీఆర్ఎస్ నుంచి క్రాస్ ఓటింగ్‌పై ఆశలుపెట్టుకున్న బీజేపీ కూడా గెలవగనన్న నమ్మకంతో ఉన్నది.

ఓట్ల వివరాలు

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం 15,30,367 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గంలో పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. 746,982 మంది పురుష ఓటర్లుండగా, 7,83,280 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.



ప్రశాంతంగా లోక్‌సభ నామినేషన్ల పర్వం

ఐదోరోజు వరంగల్‌లో 9, మానుకోటలో 8 నామినేషన్లు

▸ నామినేషన్ వేసిన మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి కవిత ▸ రేపటితో పూర్తి కానున్న దాఖలు గడువు



మహబూబాబాద్‌లో రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కవిత





వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న స్వతంత్ర అభ్యర్థి చిలుముల్ల సుజాత, విడుతలై చిరుతైగల్ కచ్చిపార్టీ అభ్యర్థి మచ్చ దేవేందర్

వరంగల్ కలెక్టరేట్/మహబూబాబాద్‌టౌన్, ఏప్రిల్ 23: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రశాంతంగా జరుగుతోంది. ఐదోరోజైన మంగళవారం వరంగల్ పార్లమెంట్ స్థానానికి 9, మహబూబాబాద్ (మానుకోట) నియోజకవర్గానికి ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. విడుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ నుంచి మచ్చ దేవేందర్ రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులుగా చిలుముల్ల సుజాత, పోగుల అశోక్, పోతరాజు నర్సింహరాజు, కుమ్మరి కన్నయ్య, కొంగర అనిల్ కుమార్, ఇల్లందుల శోభన్ బాబు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత రెండు సెట్లు, ఆధార్ పార్టీ నుంచి జాటోతు రఘు వర్మ, ఆదివాసీ జేపీసీ నుంచి చందా లింగయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి మోకాళ్ల మురళీకృష్ణ, స్వతంత్ర అభ్యర్థులుగా బానోత్ ప్రేమ్‌లాల్, పోరిక శ్యామలనాయక్, పడిగే ఎర్రయ్య నామినేషన్లు దాఖలు చేశారు. వారి నుంచి మహబూబాబాద్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ నామినేషన్ పత్రాలు స్వీకరించారు.

కాగా ఇప్పటి వరకు వరంగల్ పార్లమెంట్ స్థానంలో ఐదు రోజుల్లో మొత్తం 26 అభ్యర్థులు 31సెట్లు, మహబూబాబాద్ లో 13 మంది అభ్యర్థులు 19సెట్లు వేశారు. కాగా నామినేషన్ల ప్రక్రియ గురువారంతో పూర్తి కానుండడంతో నామినేషన్ల దాఖలు ప్రక్రియ మరింత ఊపందుకునే అవకాశం కనిపిస్తోంది.

నామినేషన్ కౌంటర్

ఐదో రోజు (23-4-2024)

దాఖలైన మొత్తం నామినేషన్లు	
వరంగల్	మహ-బాద్
31	19

వరంగల్ (ఎస్సీ) : మచ్చ దేవేందర్-రెండు సెట్లు(వీసీకే పార్టీ), చిలుముల్ల సుజాత, పోగుల అశోక్, పోతరాజు నర్సింహరాజు, కుమ్మరి కన్నయ్య, కొంగర అనిల్‌కుమార్, ఇల్లందుల శోభన్‌బాబు- 2 సెట్లు (స్వతంత్ర)

మహబూబాబాద్(ఎస్టీ) : మాలోతు కవిత-2 సెట్లు(బీఆర్ఎస్), జాటోతు రఘువర్మ (ఆధార్‌పార్టీ), చందా లింగయ్య (ఆదివాసీ జేఏసీ), మోకాళ్ల మురళీకృష్ణ (సీపీఐఎంఎల్ న్యూ), పోరిక శ్యామల నాయక్, పడిగే ఎర్రయ్య బానోత్ ప్రేమ్‌లాల్ (స్వతంత్ర).



మోసపూరిత హామీలతో రేవంత్ గద్దెనెక్కారు

▸ ఈ ఎన్నికల్లో ఆయనకు బుద్ధి చెప్పాలి
▸ వరంగల్ తూర్పు, వర్ధన్నపేట సమావేశాల్లో కేటీఆర్



సభకు హాజరైన ప్రజలు, అభివాదం చేస్తున్న కేటీఆర్



సభలో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన వరంగల్ అభ్యర్థి సుధీర్‌కుమార్

మట్టెవాడ / రాంనగర్, ఏప్రిల్ 23 : మోస పూరితమైన హామీలిచ్చి రేవంత్‌రెడ్డి గద్దెనెక్కాడని, మరోసారి తెలంగాణ ప్రజలు మోసపోకుండా ఆలోచించి ఓటు వేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అధ్యక్షతన వరంగల్ ఉర్సుగుట్ట రోడ్డులోని నాని గార్డెన్‌లో తూర్పు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం, హంటర్‌రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సమావేశాలకు బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీ మసూద్, వరంగల్ జడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి, మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడుతూ నాలుగు నెలల కింద జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 1.85శాతం ఓట్ల తేడాతో బీఆర్ఎస్ ఓడిపోయిందని 14సీట్లలో తక్కువ ఓట్లతో ఓటవిపాలయ్యామన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అభయ హస్తం చూపిన రేవంత్ ఇప్పుడు భస్మాసుర హస్తాన్ని చూపుతున్నారని, రైతు రుణమాఫీ, ఆడపిల్లలకు వివాహ కానుకగా తులం బంగారం, ఆసరా ఫించన్ల పెంపుదల చేయలేదని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత నీటి, కరెంటు కష్టాలు ఎక్కువయ్యాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు మోసం పార్ట్ 1 చేసిన ఆయన ఇప్పుడు మోసం పార్ట్ -2 చేస్తున్నారని, తాను హై టెన్షన్ వైర్‌నని తనను ముట్టుకుంటే మాడి మసైపోతారని అంటున్నాడని, అసలు కాంగ్రెస్‌లో కరెంటే లేదని ఎలా మసై పోతారని ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ అమలు చేయకుండా దేవుళ్లపై ఒట్టేసి ఆగస్టు నాటికి చేస్తానని చెబితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 100 రోజుల్లో అమలు చేస్తానన్న ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలతో ఎవరూ లబ్ధిపొందడం లేదని, రుణమాఫీ చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కడియం శ్రీహరి నయ వంచకుడు, విశ్వాస ఘాతకుడని, అరూరి రమేష్ కూడా అలాంటి వ్యక్తేనని 2013లో పార్టీలో చేరిన కడియం శ్రీహరికి కేసీఆర్ ఎంపీగా అవకాశమిచ్చారని, మళ్లీ ఏడాదిలోపే డిప్యూటీ సీఎంగా కూడా చేశారని, ఎమ్మెల్సీగా, 2023లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని, పదేళ్లలో మూడు చట్ట సభలకు శ్రీహరికి కేసీఆర్ అవకాశం కల్పించారన్నారు. అలాగే ఈ పార్లమెంటు ఎన్నికల్లోనూ వరంగల్ టికెట్‌ను ఆయన కుమార్తె డాక్టర్ కావ్యకు ఇచ్చామని కానీ కొన్ని రోజుల్లోనే పార్టీకి రాజీనామా చేసి అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నామని చెప్పి నవ్వించి గొంతుకోశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అరూరి రమేష్‌కు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చామని, లోక్‌సభ ఎన్నికల్లో కావ్య, అరూరి రమేష్‌కు వరంగల్ ఓటర్లు బుద్ధి చెప్పాలని, ఉద్యమకారుడైన డాక్టర్ సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మోదీ పాలనలో నిత్యావసరాల ధరలు పెరిగాయని, శ్రీరాముడిని అడ్డుపెట్టుకొని బీజేపీ రాజకీయం చేస్తోందని, మామునూరు ఎయిర్‌పోర్టు, మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు, కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం చేయకుండా వరంగల్ ప్రజలను మోసం చేసిందన్నారు. అలాంటి మోదీని రాహుల్ గాంధీ విమర్శిస్తుంటే ఇక్కడ రేవంత్‌రెడ్డి బడే భాయ్ అంటూ మోదీని పొగుడుతున్నాడని, కాంగ్రెస్ పార్టీ విధానమేంటో అర్థం కావడం లేదన్నారు. ప్రజలను మోసగిస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌లను ఓటుతో తొక్కేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ 10కి పైగా పార్లమెంట్‌సీట్లు గెలిస్తే కేసీఆర్ రాజకీయాలను శాసిస్తాడని కేటీఆర్ పేర్కొన్నారు.

శ్రీహరి అవినీతి తిమింగళం.. కావ్య డమ్మీ..

మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య..

నమ్మకద్రోహి, అవినీతి తిమింగళం కడియం శ్రీహరి అని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఘాటు విమర్శలు చేశారు. తాను 1994లో టీడీపీ టికెట్‌ను నిరాకరిస్తే కడియం శ్రీహరి ఆ టికెట్ తీసుకొని గెలిచారన్నారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలి పోతుందని చెప్పిన ఆయన ఇప్పుడు అభివృద్ధి కోసమంటూ కాంగ్రెస్‌లో చేరి రోజుకో మాట మాట్లాడుతున్నారని ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారన్నారు. శ్రీహరి బ్లాక్ మెయిలింగ్ చేస్తూ అన్ని పదవులను అనుభవించారని, దళితులను అణగదొక్కి పదవులు పొందారన్నారు. కడియం కులం పై ఇప్పటి వరకు స్పష్టత లేదని ఆరోపించారు.

బీఆర్ఎస్ హయాంలోనే వరంగల్ తూర్పు అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

బీఆర్ఎస్ హయాంలోనే వరంగల్ తూర్పులో రూ.4వేలకోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. వరంగల్ బస్టాండ్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కలెక్టరేట్ భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుత తూర్పు ఎమ్మెల్యే మంత్రి కొండా సురేఖ గెలిచి ఐదు నెలలు కావస్తున్నా ఈ ప్రాంత ప్రజలను కలవడం లేదని వారి సమస్యలు విన్న దాఖలాలు లేవని విమర్శించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు పల్లం రవి పద్మ, బోగి సురేష్‌సువర్ణ, దిడ్డి కుమారస్వామి, బస్వరాజు శిరీష, మరుపల్లి రవి, గందె కల్పననవీన్, సిద్ధం రాజు, బీఆర్ఎస్ నాయకులు కంచె సంపత్, సయ్యద్ మసూద్, తునికి రమేష్‌బాబు, డాక్టర్ హరి రమాదేవి, దాచెపల్లి సీతారాం, బయ్య స్వామి, బొల్లం సంపత్, కొమ్మిని సురేష్, నీలం రాజ్ కిశోర్, గోరంట్ల మనోహర్, ఎలుగం శ్రీనివాస్, కుందారపు రాజేందర్, పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలోనే ఓబీసీల అభివృద్ధి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ గౌడ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 23: దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడమే లక్ష్యంగా ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఓబీసీ వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచి తోడ్పాటునందిస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వేద బంక్వెట్ హాలులో బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణాచారి ఆధ్వర్యంలో వరంగల్ లోక్‌సభ నియోజకవర్గస్థాయి ఓబీసీ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీల్లో ప్రధాని మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడు లేరని అన్నారు. ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మోదీ పనిచేస్తున్నారని కీర్తించారు. మరోసారి మోదీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. కరోనాకాలంలో దేశ ప్రజల ప్రాణాలను కాపాడిన ప్రధాని మోదీ.. ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదని ప్రారంభించిన ఉచిత బియ్యం పంపిణీని ఇప్పటికీ కొనసాగిస్తున్నారన్నారు. భారత్ ఎన్నో విజయాలు సాధించడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. మోదీ పాలనలో స్వచ్ఛమైన పాలన అందుతోందన్నారు. దేశం మోదీ చేతిలో ఉంటేనే భద్రంగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలను దోచుకోవడంతోనే కేసీఆర్ గడిపారన్నారు. కేసీఆర్ ప్రజాపాలన మరిచి ఫామ్‌హౌస్ పాలనకే పరిమితమయ్యారన్నారు. ఇక కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓటేస్తే వృథా అని, రెండు పార్టీలు ఒకటేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ అధ్యక్షుడు గంట రవికుమార్, వరంగల్ పార్లమెంట్ ప్రభారి డాక్టర్ వి.మురళీధర్ గౌడ్, ఓబీసీ మోర్చా పార్లమెంట్ ఇన్‌చార్జి వినయ్, ఉపాధ్యక్షులు సంజయ్ గనాటే తదితరులు పాల్గొన్నారు.

మే డే ఉత్సవాలను జయప్రదం చేయండి

న్యూశాయంపేట, ఏప్రిల్ 23 : మే1 వ తేదీన జరిగే మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం మే డే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు వేల్పుల సారంగపాణి, జక్కు రాజు గౌడ్, ఎం. సదాలక్ష్మీ, ఎం. శంకర్ నాయక్, జి. రాజేందర్, మాధురి, సుగుణ, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్‌పై అవగాహన కల్పించాలి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 23: సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం నగర శివారు అమ్మవారిపేటలోని ఎఫ్ ఎస్‌టీపీ (ఫిజికల్ స్లామ్డ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడి ప్లాంట్ నిర్వహణ తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. 10, 15 కేఎల్‌డీ ప్లాంట్‌లో మల శుద్ధీకరణ సాగుతున్న పద్ధతులపై కమిషనర్‌కు అక్కడ పనిచేస్తున్నట్లు సిబ్బంది విశ్లేషించారు.

మోదీ పాలనలో కుంటుపడుతున్న విద్యారంగం

మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి



మాట్లాడుతున్న మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 23: ప్రధాని మోదీ పాలనలో దేశంలో విద్యా రంగం కుంటుపడుతోందని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో 'నూతన జాతీయ విద్యావిధానం-2020 - విద్యార్థులపై దాని ప్రభావం, పర్యవసనాలు' అనే అంశంపై సదస్సు జరిగింది. కేయూ రిటైర్డు ప్రొఫెసర్ ఎ.వినాయకరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 10 ఏళ్ల మోదీ పాలనలో ఆదానీ, నీరవ్ మోదీ, విజయ్‌మాల్యా లాంటి పెట్టుబడిదారులకు సేవ చేస్తూ తరింస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రజలకు, విద్యార్థి యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడాన్ని గాలికి వదిలేశారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, జాతి సంపదను ప్రైవేట్ వ్యక్తులకు కారుచౌకగా దోచిపెడుతు న్నారని అన్నారు. ఎలక్ట్రోల్ బాండ్లు, పెట్టుబడిదారుల ఇచ్చే డబ్బులతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను, ఎంపీలను కొనడం, అప్రజాస్వామికంగా ప్రజాప్రభుత్వాలను కూల్చడం చేస్తున్నారని దుయ్యబట్టారు. అచ్ఛేదిన్, భారత్ వికాస్, సబ్ కాసాత్‌లన్నీ మాటల గారడీలని అన్నారు. దేశంలో 11లక్షల బడులుంటే పీఎంశ్రీ పథకంలో 14వేల బడులను అభివృద్ధి చేస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. జాతీయ నూతన విద్యా విధానంపై మేధావులు, విద్యావేత్తలతో చర్చించలేదని వివరించారు. నూతన జాతీయ విద్యావిధానంలో అనేక లోపాలున్నాయని తెలిపారు. ప్రధానంగా లౌకిక, ప్రజాస్వామ్య, సోషలిస్టు భావాలను తీసివేసి అశాస్త్రీయ, మూఢత్వ భావాలతో విద్యార్థుల మెదళ్లను విషతుల్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులం, మతంలేని దేశ నిర్మాణానికి పౌరులంతా ముందుకు రావాలని అన్నారు. ప్రశ్నించేతత్వం, ప్రజాస్వామిక, శాస్త్రీయ దృక్పథం అవసరమని చెప్పారు. హైదరాబాద్ హెచ్‌సీయూ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, ఓయూ రిటైర్డు ప్రొఫెసర్ పద్మజాషా మాట్లాడుతూ.. విద్యకు మోదీ ప్రభుత్వం 10 శాతం నిధులను కేటాయించడంతో బీజేపీ ప్రభుత్వ చిత్తశుద్ధి ఏదో తెలుస్తోందని దుయ్యబట్టారు. విద్యాసంస్థల్లో అనేక టీచింగ్, నాన్‌టీచింగ్ ఖాళీలున్నాయని, వాటిని భర్తీచేసి నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఈ సమావేశంలో కేయూ రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, డాక్టర్ పి.జగదీశ్వర్, తెలంగాణ డెమోక్రటిక్ ఫోరం రాష్ట్ర నాయకులు డాక్టర్ పృథ్వీ, పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.అజాద్, సోషల్ అక్టివిస్టు పర్వీన్, ప్రముఖ రచయిత సైబాబా, వెంకట్‌రెడ్డి, రాజేశ్, పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరసింహారావు, డాక్టర్ మంద వీరాస్వామి, శివ, రంజిత్, మహేశ్, పృథ్వీ, అశోక్, అనూష, సంస్కృతి, లక్ష్మి, శ్వేత, కావేరి తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 23: పెద్దమ్మగడ్డలో కొత్తగా నిర్మిస్తున్న ఇంటి వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం మంగళవారం లభించినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. మహిళ వయసు సుమారు 40 నుంచి 45 యేళ్ల మధ్యలో ఉంటుందని, బ్లూ కలర్ చీర, పింక్ కలర్ జాకెట్ ధరించి ఉందని, ఆచూకీ తెలిసిన వారు హనుమకొండ ఇన్స్‌పెక్టర్ 87126 85113, పోలీస్ స్టేషన్ నెంబర్ 87126 85002లో సంప్రదించాలని తెలిపారు.

● కాజీపేట: కాజీపేట - పెండ్యాల రైల్వే స్టేషన్‌ల మధ్య మంగళవారం కుళ్లిపోయిన మృతదేహం లభ్యమైంది.రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాజీపేట - పెండ్యాల రైల్వే స్టేషన్‌ల మధ్య కుళ్లిపోయిన మృతదేహం ఉందని రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు ఘటనా స్థలివద్దకు వెళ్లి చూడగా మృత దేహం కుళ్లిపోయి గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉంది. ఆనవాళ్ల బట్టి చూస్తే మృతుడు రైలు నుంచి జారిపడినట్లు తెలుస్తోంది. మృతుడి వయస్సు 35 నుంచి 40 మధ్యలో వుంటుందని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

సనాతన హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయం

వడ్డెపల్లి, ఏప్రిల్ 23: సనాతన హిందూ ధర్మ పరిరక్షణే తమ సంస్థ ధ్యేయమని ఇంటర్నేషనల్ హిందూ రావణ సేనా వాహిని(ఐహెచ్ఆర్ఎస్‌వీ) కో ఆర్డినేటర్ డాక్టర్ అరూరి సుధాకర్ అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత జాతీయ గీతంలోని ద్రావిడ భూమి ఆత్మగౌరవం సాంస్కృతిక పునర్జీవనం కోసం ఆవిర్భవించిన తమ సంస్థ లోక కల్యాణార్థం కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. ఈ నెల 27న సాయంత్రం 5.30 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో తమ సంస్థ ఆధ్వర్యంలో రావణ అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు బి. కిరణ్‌కుమార్, గుండె రావణ్ మహరాజ్ పాల్గొన్నారు.

వైభవంగా లలితా త్రిపురసుందరి దేవి ఆలయ ప్రతిష్ఠ

వడ్డెపల్లి, ఏప్రిల్ 23 : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్ కాలనీ రోడ్డులోని సురేంద్రపురి కాలనీలో నూతనంగా నిర్వహించిన శ్రీలలితా త్రిపుర సుందరిదేవి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం రెండో రోజు మంగళవారం వైభవంగా నిర్వహించారు. రుత్వికులు ఉదయం శాంతిమంత్ర పఠనం, హోమం, ఆవాహిత దేవతాపూజలు, ధాన్యాధివాసం తదితర పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వడ్డెపల్లి రమేష్, ప్రధాన కార్యదర్శి కొప్పుల సుధాకర్ రెడ్డి, కోశాధికారి పూర్ణోజు గణేష్, ఉపాధ్యక్షులు గోలి గోపాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శి బొమ్మగాని కార్తీక్‌తో పాటు డైరెక్టర్లు , భక్తులు పాల్గొని అమ్మవారిని కొలిచారు.

ఘనంగా హనుమాన్ జయంతి



దారాభిషేకం చేస్తున్న అర్చకులు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 23: చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో చైత్రశుద్ధ పౌర్ణమి మంగళవారం హనుమాన్ జయంతి, విజయోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేనపూజ, ధ్వజారోహణం అనంతరం రుద్రాంశ సంభూతుడైన పంచముఖ వీరాంజనేయ స్వామికి ఆవుపాలు, తేనేతో పంచామృతాభిషేకం, నవరసాలతో పసుపు, కుంకుమ, గంధం విలేపనంతో శ్రీసూక్త, మన్యసూక్త, మూలమంత్ర పఠనంతో సంతత దారాభిషేకం నిర్వహించి మహార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో మణికంఠశర్మ, సందీప్‌శర్మ ఇతర అర్చకులు నిర్వహించిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: హనుమకొండలోని వివిధ డివిజన్లలో వాయునందనుడు, రామభక్తుడు హన్మంతుడి జన్మదినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. హనుమకొండ పట్టణానికి చెందిన కోరుట్ల రమేష్ - స్రవంతి దంపతులు హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వడ్డెపల్లి ప్రశాంత్ నగర్‌లోని సహృదయ అనాధ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

● కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో మంగళవారం హనుమత్ విజయోత్సవం జరిగింది. చైత్ర శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని ఆంజనేయస్వామికి విశేష అభిషేకాలు, పంచామృత పంచవర్ణ పానకంతో పూజలు నిర్వహించారు. అనంతరం మాలతో అలంకరణ చేశారు. పూజ అనంతరం భక్తులకు అన్నపూర్ణ భవనంలో అన్నవితరణ జరిగింది. ఐనవోలు సాయికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

● మడికొండ: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మడికొండలోని ఛత్రపతి శివాజీ సేన ఆధ్వర్యంలో మంగళవారం భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి మీదుగా కాజీపేటకు అనంతరం వరంగల్‌లో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శోభాయాత్రకు తరలి వెళ్లారు. ఛత్రపతి శివాజీ సేన సభ్యులు దువ్వ వేణు, దార ధనుంజయ్, దుప్పెల్లి అరవింద్, గుడుగుల వినయ్, బండ రాజు, అరుణ్, సాయి, సిద్ధూ, బీజేపీ నాయకులు పొనగోటి వెంకట్రావు, గడ్డం మహేందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సెలవులొచ్చాయొచ్...



మర్కజీ పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థులతో రద్దీగా హనుమకొండ బస్టాండ్

నేటినుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23: పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చారు. సోమవారంతో అన్ని తరగతుల విద్యార్థులకు వార్షిక పరీక్షలు ముగియడంతో మంగళవారం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. దీంతో ఈ విద్యా సంవత్సరం తరగతులు పూర్తి కావడంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వరంగల్, హనుమకొండ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఉన్న వసతి గృహాలు ఖాళీ అయ్యాయి. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలకు తీసుకెళ్లేందుకు ఉదయం నుంచి హాస్టళ్ల ముందు గుమిగూడారు. వారి పెట్టెలను నెత్తిన పెట్టుకొని బస్టాండు, రైల్వే స్టేషన్లకు తరలి వెళ్లారు. దీంతో హనుమకొండ, వరంగల్ బస్టాండ్లతో పాటు కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంగణాలు విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కిటకిటలాడాయి. కాగా ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిందని, సెలవుల్లో పాఠశాలల్లో ఎలాంటి తరగతులు నిర్వహించరాదని వరంగల్, హనుమకొండ జిల్లాల డీఈవోలు డి. వాసంతి, డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై స్పష్టం చేశారు.

పోలీస్ కుటుంబానికి భద్రత చెక్కు అందజేత

వరంగల్ క్రైం, ఏప్రిల్ 23: కానిస్టేబుల్ కుటుంబానికి పోలీసు భద్రత నుంచి మంజూరైన చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మంగళవారం అందజేశారు. ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డి.కుమార్ గత జనవరి 1వ తేదీన అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో తెలంగాణ పోలీస్ భద్రత పథకం ద్వారా మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి మంజూరు చేసిన రూ.7లక్షల 89వేల చెక్కును కానిస్టేబుల్ సతీమణి రమాదేవికి అందజేశారు. శాఖాపరంగా రావాల్సిన బెనిఫిట్స్‌ను అందజేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను సీపీ ఆదేశించారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 23: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద, మనువాద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని రాజ్యాంగ పరిరక్షణ వరంగల్ జేఏసీ కన్వీనర్ డాక్టర్ ఎం. వెంగళ్‌రెడ్డి, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ బి.రమాదేవి మాట్లాడారు. ప్రజాస్వామ్యం, సెక్యులర్, ఫెడరల్ విధానాల పరిరక్షణ కోసం ఈ నెల 25న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో రాజ్యాంగ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులో విద్యార్థులు, యువకులు, మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, ప్రజాస్వామికవాదులు, సామాజిక ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు భారత్ బచావో వరంగల్ జిల్లా చైర్మన్ దొమ్మటి ప్రవీణ్‌కుమార్, నున్న అప్పారావు, డాక్టర్ ఎం. శంకర్‌నారాయణ, డాక్టర్ రాజ్‌మహ్మద్, పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి బార్ అసోసియేషన్ నివాళి

వరంగల్ లీగల్, ఏప్రిల్ 23: చిన్న వయసులోనే అనారోగ్యంతో మృతి చెందిన యువ న్యాయవాది కందుకూరి సృజనాదేవికి (26) వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్లు సంతాపం వ్యక్తం చేశాయి. మంగళవారం పదికోర్టుల భవనంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో సంతాప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్ బాబు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ హాజరయ్యారు. హనుమకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ల్యాదె రమేష్, ఉపాధ్యక్షుడు పోషిని రవీందర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు జయాకర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రపంచానికి శాంతినిచ్చేది హిందూత్వమే..

హిందూ ధర్మప్రచారకుడు శ్రీ రాధమనోహర్ దాస్

కరీమాబాద్, ఏప్రిల్ 23: హిందూత్వం మాత్రమే ప్రపంచానికి శాంతిని ఇస్తుందని, హనుమంతుడిని ఆదర్శంగా తీసుకొని హిందువులు కలిసికట్టుగా హిందూ ధర్మాన్ని, సంస్కృతిని పరరక్షించాలని హిందూ ధర్మప్రచారకుడు రాధమనోహర్ దాస్ పిలుపునిచ్చారు. మంగళవారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రంగశాయిపేట మహంకాళి ఆలయం నుంచి హనుమకొండ పద్మాక్షిగుట్ట వద్ద గల హనుమద్గిరి హనుమాన్ దేవాలయం వరకు నిర్వహించిన వీరహనుమాన్ శోభాయాత్రను ఆయన శోభాయాత్రను ప్రారంభించారు. ఈ వీర హనుమాన్ శోభాయాత్రలో భారీ సంఖ్యలో హిందువులు హాజరయ్యారు. కాషాయ జెండాలతో రంగశాయిపేట ప్రాంతం నిండిపోయింది. ర్యాలీలో ముందుగా శివాజీమహారాజ్ విగ్రహం, లక్ష్మీనరసింహుడి విగ్రహం, దాని వెనకాల వీరహనుమాన్ విగ్రహం, ఆ తరువాత అయోధ్య రామ్‌లల్లా విగ్రహాలను అందంగా అలంకరించి ర్యాలీ నిర్వహించారు. రంగశాయిపేట నుంచి బయలుదేరిన ర్యాలీ రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్, సాకరాశికుంట, రైల్వే అండర్‌బ్రిడ్జి, మేదర్‌బస్తీ, వరంగల్ చౌరస్తా, పోస్టాఫీస్, వెంకట్రామ జంక్షన్, పోచమ్మమైదాన్, ఎంజీఎం సెంటర్, అలంకార్ జంక్షన్, హన్మకొండ చౌరస్తా నుంచి నేరుగా పద్మాక్షి ఆలయం వద్ద గల హనుమద్గిరి హనుమాన్ దేవాలయం వరకు కొనసాగింది. ఈ శోభాయాత్రలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, బీజేపీ ఎంపీ అభ్యర్థి అరురి రమేష్, మాజీ శాసన సభ్యుడు ధర్మారావు, రావు పద్మ, కుసుమ సతీష్, పాల్గొన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ వరంగల్ మహానగర అధ్యక్షుడు కేశిరెడ్డి జయపాల్, కార్యదర్శి, యాత్ర ప్రముఖ్ శ్రీరామ్‌ఉదయ్‌కుమార్, భజరంగ్ దళ్ వరంగల్ విభాగ్ సంయోజక్ అల్లకట్ల సాయికుమార్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాలకొండ భాస్కర్, వరంగల్ విభాగ్ కార్యదర్శి నందాల చందర్‌బాబు, సలహాదారుడు తోట నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి

హసన్‌పర్తి, ఏప్రిల్ 23: ఎల్లాపూర్‌లోని ప్రభుత్వ భూములను రక్షించాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ రెవెన్యూ అధికారులను కోరారు. మంగళవారం ఎల్లాపూర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో హసన్‌పర్తి నాయబ్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎల్లాపూర్‌లోని సర్వే నంబరు 246/1 లోని 12.13 ఎకరాల భూమి, సర్వే నంబరు 316 లోని 20 గుంటల భూమి రియల్టర్లు అక్రమించుకుంటున్నట్లు పేర్కొన్నారు. వీటికి రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించి ప్రభుత్వ భూములను కాపాడాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు వెలిసోజు రమణాచారి, వెలిసోజు బుచ్చిరాములు, కొత్తగట్టు శ్యాంసుందర్, రేణుకుంట్ల చిరంజీవి, గోపరాజు కుమారస్వామి, గాజుల రాజు తదితరులు పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్ విద్యార్థులకు పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 23: ఈనెల 18న కేయూ ఫార్మసీ కళాశాలలో జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షల్లో 9 మంది విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడగా వారికి మళ్లీ హనుమకొండ ప్రైవేట్ కళాశాలలో పరీక్షలు నిర్వహించామని కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రసాద్ తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'ఫార్మసీ ప్రాక్టికల్స్‌పై వివాదం' అనే వార్తపై వివరణ ఇచ్చారు. ఫార్మసీ ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతుండగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి తనిఖీల్లో 9 మంది విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడినట్లు తెలిపారు. కాపీయింగ్ విద్యార్థులకు మళ్లీ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షలను అనుబంధ కళాశాల్లోనూ నిర్వహించవచ్చునని తెలిపారు. కేయూ ఫార్మసీకళాశాలలో రసాయనాలు,ఎక్విప్‌మెంట్‌లన్ని ఉన్నాయని తెలిపారు.

సీఎం సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 23: సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మడికొండలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చి సభను విజయ వంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ సాంబరాజు రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని 9వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ సమావేశంలో 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.డి. జాఫర్, నాయకులు అలువాల కార్తీక్, భీమా, వినేయ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కాజీపేట, ఏప్రిల్ 23: కడిపికొండ, కాజీపేట సర్వే నంబర్ 46లోని స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జాలు చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం మంగళవారం కాజీపేట మునిసిపాలిటీ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతి ప్రతంలో 46 సర్వేనంబర్‌లో పదేళ్ల కిందట నిరుపేదలకు ఇళ్ల పట్టాలిచ్చారని తెలిపారు. ఈ విషయంపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు స్పందించి పేదలకు న్యాయం చేస్తామన్నారు. ఈ లోపే అదే స్థలంలో కొందరు కబ్జాలకు పాల్పడి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వారిపై చర్యలు తీసుకుని పేదలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 23: గ్రేటర్ 55వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి కాంగ్రెస్ కండువాకప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ వైస్ ప్రెసిడెంట్ కుమార్‌రావు, పీసీసీ సెక్రటరీ బొజ్జ సమ్మయ్య యాదవ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీటీసీల ఫోరం ప్రెసిడెంట్ వేం వాసుదేవరెడ్డి, 55వ డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

28న కేయూ సెనెట్ హాల్‌లో సాహిత్య సదస్సు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 23: ఈనెల 28న ఆదివారం కేయూ సెనెట్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి సముహ- సెక్యులర్ రైటర్స్ ఫోరం సదస్సు లౌకిక విలువలు-సాహిత్య అనే అంశంపై నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కేయూలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, రిటైర్డు కేయూ తెలుగు ప్రొఫెసర్ కె.కాత్యాయని విద్మహే, జాహ్నవి, హాతిరాం, శ్రీకాంత్, మెట్టు రవీందర్, అమృతరాజ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. సదస్సుకు ముఖ్యఅతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, నందిని సిధారెడ్డి, గుమ్మడి అనురాధ, గుంటూరు లక్ష్మీనరసయ్య, జిలుకర శ్రీనివాస్, సౌదరుణ,, ఖాధర్ మొహినుద్దీన్‌లు పాల్గొంటారని తెలిపారు.

కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ అందజేసిన కేటీఆర్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 23: మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 10వతేదీ నుంచి 17వ తేదీ వరకు హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కేసీఆర్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో గెలుపొందిన విజేతలకు మంగళవారం సాయంత్రం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ట్రోఫీలు అందజేశారు. కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్ ట్రోఫీని 47వ డివిజన్ జట్టు గెలుచుకోగా, రన్నరప్‌గా 58 డివిజన్ జట్టు నిలిచింది. విన్నర్, రన్నరప్ జట్లకు కేటీఆర్ వేరు వేరుగా ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఉద్యోగ విరమణ పొందనున్న ఉపాధ్యాయులకు సన్మానం

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 23: ఉద్యోగ విరమణ పొందబోతున్న ఆంగ్ల భాష ఉపాధ్యాయులకు మంగళశారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమారంలోని స్కిల్ స్పార్క్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయులను ఎల్టా ఆధ్వర్యంలో శాలువాలు, షీల్డులతో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హనుమకొండ ఎంఈవో రాంకిషన్‌రాజు మాట్లాడుతూ.. ఆంగ్ల భాష ఉపాధ్యాయులు భాష నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంచుటకు కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎల్టా రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓరుగల్లుపై.. కడియం అస్త్రం!

(5వ పేజీ తరువాయి)

కలిపి వరంగల్ లోక్‌సభ స్థానం ఏర్పడింది. తొలిసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సిరిసిల్ల రాజయ్య విజయం సాధించారు. ఆ తరువాత 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి విజయం సాధించారు. 2015లో కడియం శ్రీహరి ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ఎంపీ పదవికి రాజీనామా చేశారు. అదే ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన పసునూరి దయాకర్ విజయం సాధించడంతో పాటు 2019లోనూ రెండోసారి దయాకర్ విజయం సాధించారు. దీంతో వరంగల్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్ వరుసగా మూడుసార్లు గెలిచి కంచుకోటగా మల్చుకుంది. దీంతో ఈసారి పక్కాగా వరంగల్ స్థానంలో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం 42మంది దరఖాస్తు చేసుకున్నప్పటికి.. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు అప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖరారైన ఆయన కూతురు కావ్యని కాంగ్రెస్‌లో చేర్చుకుని మరీ టికెట్ ఇచ్చారు. దీంతో బీఆర్ఎస్ ఓటు బ్యాంకుకు గండి కొట్టడంతో పాటు మహిళ అభ్యర్థికి అవకాశం ఇచ్చినట్లవుతుందని కాంగ్రెస్ అధిష్టానం లెక్కలు వేసింది. అంతేకాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కడియం శ్రీహరి తన 40ఏళ్ల రాజకీయాల్లో విలువలకు కట్టుబడి ఉన్నారని, కబ్జాలు, ఇతర ఆరోపణలకు తావివ్వలేదని.. ఈ కారణంగానే కడియం శ్రీహరిని పార్టీలో చేర్చుకుని రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలపై రాజకీయ అస్త్రంగా వదిలారనే చర్చ జరుగుతోంది. కడియంకు ఉన్న క్లీన్ ఇమేజ్‌కు తోడు కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, రేవంత్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణ, కాంగ్రెస్‌కున్న సంప్రదాయ ఓటుబ్యాంకు కలిసి వస్తుందని ఆ పార్టీ నేతలు లెక్కలు వేస్తున్నారు.

మహిళ అభ్యర్థికి 36ఏళ్లకు కాంగ్రెస్ చాన్స్..

వరంగల్ (ఎస్సీ) లోక్‌సభ స్థానంపై కన్నేసిన కాంగ్రెస్ వ్యూహాత్మకంగానే మహిళ అభ్యర్థిని బరిలోకి దించింది. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె డాక్టర్ కడియం కావ్యను కాంగ్రెస్‌లో చేర్చుకుని, ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి 1984లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ టి. కల్పనాదేవికి 2,32,088ఓట్లు (43.56శాతం) పోలవ్వగా, సమీప కాంగ్రెస్ అభ్యర్థి కమాలుద్దీన్ అహ్మద్‌కు 2,23,632 ఓట్లు (41.98శాతం)పోలయ్యాయి. దీంతో డాక్టర్ కల్పనాదేవి 8,456ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆ తరువాత 1989లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి మరోసారి పోటీ చేసిన కల్పనాదేవి ఓటమిపాలయ్యారు. 1998లో కాంగ్రెస్‌లో చేరిన కల్పనాదేవి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి టీడీపీ అభ్యర్థి చందులాల్ చేతిలో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి కాంగ్రెస్ మహిళకు వరంగల్ లోక్‌సభ టికెట్ కేటాయించలేదు. 36ఏళ్ల తరువాత మళ్లీ డాక్టర్ కావ్యకు కాంగ్రెస్ టికెట్ కేటాయించింది. అప్పుడు.. ఇప్పుడు ఇద్దరు మహిళ అభ్యర్థులు డాక్టర్లు కావటం గమనార్హం. కాగా, వరంగల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 18,16,543 మంది ఓటర్లుండగా, వీరిలో పురుషులు 8,91,940 మంది, మహిళలు 9,24,208మంది ఉన్నారు. పురుషులకంటే 32,268 మంది మహిళ ఓటర్లు అధికంగా ఉన్నారు. ఈ క్రమంలో కావ్యకు మహిళల ఓట్లు కలిసి వస్తాయనే అంచనాలో కాంగ్రెస్ ఉంది.

కాంగ్రెస్‌కు పెరిగిన ఓటు బ్యాంకు..

2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో ఓట్లను పొందలేకపోయింది. అయితే రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కాంగ్రెస్‌లో జోష్ పెరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 10 మంది కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. దీంతో పాటు కాంగ్రెస్ ఓటు బ్యాంకు భారీగా పెరిగింది. 2023 డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో వరంగల్ ఎంపీ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆరుగురు కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఏడు అసెంబ్లీ స్థానాల్లో 6,61,545 ఓట్లు పోలవ్వగా, బీఆర్ఎస్‌కు 5,02,578ఓట్లు, బీజేపీకి 1,56,353ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్‌పై కాంగ్రెస్‌కు 1,58,967ఓట్ల ఆధిక్యత లభించింది. అయితే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరటంతో పాటు ఆయన కుమార్తె ఎంపీ అభ్యర్థిగా ఉండటంతో తమ బలం మరింత పెరిగిందనే లెక్కల్లో కాంగ్రెస్ నేతలున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందటంతో ఆ పార్టీలో కీలక నేతలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్నారు. వరంగల్ సిట్టింగ్ ఎంపీ దయాకర్‌తో పాటు డీసీసీబీ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో 25మంది వరంగల్ కార్పొరేటర్లు, ఐదు మునిసిపాలిటీల నుంచి చైర్మన్లు, కౌన్సిలర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ గూటికి చేరారు. చాలావరకు బీఆర్ఎస్ కేడర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు.



మరో...

స్వాతంత్ర్యోద్యమం అవసరం

కరోనా నియంత్రణకు వ్యాక్సిన్ ఒక్కటే మార్గమని ప్రపంచమంతా నమ్ముతుంటే... 'అవేకెన్ ఇండియా మూవ్‌మెంట్' ఉద్యమకారిణి సరస్వతి కవుల మాత్రం ఆ టీకాలు ప్రాణాంతకమైనవని ప్రచారం చేస్తున్నారు. అలాగే ఎంతో సౌలభ్యమని భావిస్తున్న డిజిటల్ కరెన్సీ... మన జీవితాల మీద మనకు హక్కు లేకుండా చేసే ప్రక్రియగా ఆమె అభివర్ణించారు. 'ఇదంతా ప్రపంచ ప్రఖ్యాత అపర కుబేరుల మార్కెట్ అవసరాల కోసం ప్రపంచ దేశాలన్నిటినీ ఒకే చోటకు తీసుకొచ్చేందుకు మొదలైన కుట్ర. దీనికి వ్యతిరేకంగా మరో స్వాతంత్ర్య పోరాటం అవసరం' అంటున్న సరస్వతి... తమ సంస్థ ఉద్దేశాలు, లక్ష్యాలు గురించి 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

"కరోనా పేరుతో ప్రపంచ వ్యాప్తంగా పౌరుల హక్కులను హరిస్తున్నారు. దీన్ని నిరసిస్తూ మా 'అవేకెన్ ఇండియా ఉద్యమం' 2020, అక్టోబరు2 గాంధీజయంతి రోజున ముంబైలో మొదలైంది. తెలంగాణతో పాటు గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్, కేరళ, ఒడిశా, మేఘాలయ తదితర రాష్ట్రాల్లో చాలా బలంగా సాగుతోంది. ఇందులో ప్రఖ్యాత వైద్యులు, న్యాయవాదులు, పౌర సంఘాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, సామాజికవేత్తలు చాలా మంది భాగమయ్యారు. మొదటగా కొవిడ్‌ను 'ప్యాండమిక్' కాదు 'ప్లాన్‌డమిక్'గా గుర్తించాం. కరోనా కేసులను మ్యాథమెటికల్‌గా ప్రొజెక్టు చేసి మరీ భయాన్ని సృష్టించడాన్ని తీవ్రంగా నిరసించాం. దీనికి వ్యాక్సిన్ మినహా మరో విరుగుడులేదని నమ్మబలికారు. దీనికి వ్యతిరేకంగా ఊరూవాడా తిరిగి ప్రచారం చేశాం. క్లినికల్ ట్రయల్స్ పూర్తి కాకుండా, తర్వాత కాలంలో తలెత్తే దుష్ప్రభావాలను గుర్తించకుండా ప్రతి ఒక్కరికీ కరోనా టీకాలు బలవంతంగా వేయించారు. వ్యాక్సిన్ తీసుకోవడమన్నది స్వచ్ఛందమని వైద్య ఆరోగ్య శాఖ వెబ్‌సైట్‌లోనూ ప్రస్తావించినా, ఆచరణలో అందుకు విరుద్ధంగా నడుచుకున్నారు. దీన్ని సవాల్ చేస్తూ మా 'అవేకెన్ ఇండియా' ప్రతినిధి డాక్టర్ జాకబ్ పులియెల్ సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయపోరాటం చేశారు. ఆ సందర్భంగా... టీకా తీసుకోనివారిపట్ల ప్రభుత్వమే వివక్ష చూపించడాన్ని, వారి ప్రాథమిక హక్కుల మీద దాడిగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అంతేకాదు, బలవంతంగా టీకాలు వేయడం చట్ట వ్యతిరేకం. ముందుగా వ్యాక్సిన్ తయారీలో వాడిన పదార్థాలు, వాటివల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు తెలియజేయడంతోపాటు అది తీసుకోవాలా వద్దా అనేది పూర్తిగా ఆ వ్యక్తి ఇష్టమని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. ఇది 'అవేకెన్ ఇండియా'కు అతి పెద్ద విజయం.

కరోనా అనంతర మరణాలు...

కరోనా టీకాల అనంతర కాలంలోనే కొవిడ్ కేసులు పెరిగాయి. పైగా ఆ తర్వాతే డెల్టా వేవ్ వచ్చింది. ఏటా మన దేశంలో కనీసం పది లక్షలమంది పొగాకు ఉత్పత్తుల వాడకంవల్ల చనిపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం అంగీకరించింది.

మొత్తం మరణాల సంఖ్యలో 9.5 శాతం పొగాకువల్ల జరుగుతుంటే, సిగరెట్ కంపెనీలు మూతపడవు. అదే కరోనా వల్ల 0.02 శాతం మంది చనిపోతే, 130 కోట్లమంది జనాభాకు ప్రాణాంతకమైన టీకాలు వేయడం దారుణం కదా. దీన్నే ప్రజల్లోకి తీసుకెళ్లాం. పైగా 'అది మీ మంచి కోసమే' అంటూ జనాన్ని ఎమోషనల్‌గా బెదిరించారు. వార్తల ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం ఇప్పటివరకు వ్యాక్సిన్ దుష్ప్రభావాల వల్ల భారత్‌లో సుమారు 18 వేలమంది చనిపోయారు. అంతెందుకు... 11-17 ఏళ్ల మధ్య పిల్లలు 130 మంది టీకా తీసుకున్న కొద్ది రోజుల్లోనే మరణించిన ఘటనలు మా దృష్టికొచ్చాయి. అయితే ఈ మరణాలకు... వ్యాక్సిన్‌కు సంబంధం లేదని ఐసీఎమ్మార్ చెబుతోంది. కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత చనిపోయినవారి శరీరానికి పంచనామా చేయాలని మేము కొట్లాడినా లాభం లేకపోయింది. అయినా మా పోరాటాన్ని కొనసాగిస్తున్నాం. ఇదివరకెన్నడూ లేని విధంగా... కరోనా అనంతర కాలంలోనే టీనేజర్లు, యువకులు గుండెపోటుతో చనిపోతున్నారన్న వార్తలు వింటున్నాం. ఇలాంటి విషయాల మీద సమాజంలో అవగాహన కల్పిస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. డబ్ల్యూహెచ్‌వో చెప్పిందనో, ప్రభుత్వం ఆదేశించిందనో మన జీవితాలను పణంగా పెట్టడం సరికాదు. వీటన్నిటిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

పోలీసుల పరోక్ష మద్దతు...

వాస్తవాలను ప్రజలముందు ఉంచుతున్న క్రమంలో మేము కొన్ని సమస్యలు ఎదుర్కొన్నాం. ముఖ్యంగా కరోనా కాలంలోనే టీకాలు తీసుకోవడంవల్ల తలెత్తే అనర్థాలను వివరిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఒక ప్రాంతంలో ప్రచారం చేస్తున్నాం. స్థానిక పోలీసులు మమ్మల్ని అడ్డుకొని, స్టేషన్‌కు తీసుకెళ్లారు. మమ్మల్ని చట్టవ్యతిరేకులని అన్నారు. వ్యాక్సిన్లకు వ్యతిరేకంగా మా పోరాటం చట్టబద్ధమైనదే అని సాక్ష్యాలు చూపిస్తూ... ఈ టీకాల తయారీలో వాడే కొన్ని పదార్థాలవల్ల తలెత్తే ఆరోగ్య సమస్యల గురించి అక్కడి పోలీసులకు వివరిస్తే... వారంతా నిర్ఘాంతపోయారు. 'అవేకెన్ ఇండియా' లేవనెత్తిన అంశాలను సమ్మతించారు. మా పోరాటానికి పరోక్ష మద్దతు తెలిపారు. మాస్కు పెట్టుకోవడంవల్ల



హెచ్‌పీవీతో దుష్ప్రభావాలు...

గర్భాశయ ముఖద్వార కేన్సర్ నియంత్రణలో భాగమంటూ బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇస్తున్నారు. కానీ దీనివల్ల కలిగే దుష్ప్రభావాలను మాత్రం ప్రజల ముందు ఉంచడంలేదు. ఈ టీకా తయారీలో వాడే పదార్థాల వివరాలు తెలియచేయడం లేదు. ఫైజర్ కంపెనీ 'గర్డసిల్' టీకా తీసుకున్న అమెరికన్ బాలికలలో కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. ముఖ్యంగా రోగనిరోధక వ్యవస్థ నరాల మీద దాడిచేయడం, గుండె పోటు, మెదడులో బ్లడ్ క్లాట్స్, అల్సరేటివ్ కొలిటిస్ తదితర జబ్బులకు గురయ్యారని వింటున్నాం. ఇదే హెచ్‌పీవీ టీకా క్లినికల్ ట్రయిల్‌లో తెలంగాణ, గుజరాత్ ప్రాంతాలకు చెందిన ఏడుగురు అమ్మాయిలు 2007లో చనిపోయిన విషయం దాచేస్తే దాగదు కదా. అప్పుడు ఈ టీకాల తయారీని ప్రోత్సహించిన 'బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్'కు అనుబంధమైన 'పాత్' స్వచ్ఛంద సంస్థను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బహిష్కరించింది. ఇప్పుడు అదే వ్యాక్సిన్‌ను మన దేశంలోని అమ్మాయిలందరికీ ఇస్తున్నారు. దీన్ని వ్యతిరేకిస్తున్నాం. హెపటైటిస్ బీ లాంటి లైంగిక సంక్రమిత వ్యాధుల నిరోధక టీకాలను పసిపిల్లలకు ఇవ్వడంవల్ల తలెత్తే పరిణామాలను ఎవ్వరూ పట్టించుకోవడంలేదు. టీకాలంటేనే జీవాలను చంపిచేసేది. హింసాత్మకమైంది. కనుక దీన్ని మహాత్మాగాంధీసైతం వ్యతిరేకించారు. ప్రత్యామ్నాయ వైద్య విధానాలు, చికిత్సా పద్ధతులను ప్రోత్సహించకుండా మనుషులను వినియోగదారులుగా మార్చడంలో భాగమే ఈ వ్యాక్సిన్లు. అందుకే దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి.

మరింత ప్రమాదమని కూడా ప్రచారం చేశాం. మాస్కు పెట్టుకోనందుకు మరొకచోట పోలీసులు చలానా రాస్తే, మాస్కు ధరించడం ఐచ్ఛికమని ప్రభుత్వమే వెబ్‌సైట్‌లో పొందిపరిచిన విషయాన్ని గుర్తుచేశాం. దాంతో పోలీసులు వెనక్కి తగ్గారు. కరోనా వ్యాక్సిన్‌వల్ల తలెత్తిన దుష్ప్రభావాలను రికార్డు చేయడంతోపాటు కేసులను రిపోర్టు చేయాలన్నదీ మా ప్రధాన డిమాండ్లలో ఒకటి.

దుష్ప్రభావాలు లేని చికిత్సలున్నా...

ప్రకృతి వైద్యం, ఆయుర్వేదం, అల్లోపతిలోని ఐవర్ మెక్టిన్ లాంటి దుష్ప్రభావాలు లేని వైద్య చికిత్సలను అంగీకరించకుండా, ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలను నిర్బంధంగా అమలుచేశారు. కరోనా నియంత్రణకు అధిక మోతాదులో విటమిన్ సీ, డీ3, మెలటోనిన్‌లను ఇవ్వడంతో పాటు యాంటీ ఫంగల్ చికిత్సతో రోగాన్ని నయం చేయవచ్చని ప్రవీణ్‌కుమార్ సక్సేనా, దిగంబర నాయక్, సుధా చేప్యాల, లలిత్‌కుమార్ దేవరావు లాంటి ప్రముఖ అల్లోపతి వైద్యులు ఐసీఎమ్మార్‌కు వివరణాత్మకంగా నివేదిక ఇచ్చినా లాభం లేకపోయింది. ప్రపంచ దేశాలన్నీ 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' (డబ్ల్యూహెచ్‌ఓ) కను సన్నల్లో నడుచుకుంటున్నాయి. అదొక ప్రైవేటు సంస్థ. దాని ప్రయోజనాలు వేరు. అసలు వ్యాక్సిన్ తయారీ కంపెనీల వెనుక 'బిల్‌గేట్స్ ఫౌండేషన్' పాత్ర ప్రముఖంగా ఉందని 'అవేకెన్ ఇండియా' గుర్తించింది.

ప్రపంచ కుబేరుల కుట్ర...

కరోనా లాంటి 'ప్లాన్‌డమిక్' వెనుక బిల్‌గేట్స్, క్లాస్ శ్వాబ్, జార్జి సోరెస్సెన్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత అపర కుబేరుల స్వార్థ ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి. ప్రపంచాన్నంతటినీ ఒక గొడుగు కిందకు తీసుకొచ్చి... తద్వారా వనరుల మీద గుత్తాధిపత్యంచేయాలన్నది వారి లక్ష్యం. అందుకోసం వన్ వరల్డ్ గవర్నమెంట్, ఒక కొత్త విశ్వ వ్యవస్థ (న్యూ వరల్డ్ ఆర్డర్) స్థాపించాలన్నది ఈ నయా సామ్రాజ్యవాదుల ఆలోచన. 'వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్' లాంటి సంస్థల ద్వారా దేశదేశాల ఆర్థిక వ్యవస్థలను వారి ఆధీనంలోకి తీసుకోవడం, ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా మిగతా దేశాలను శాసించడం... ఇలాంటివన్నీ ఆ కుట్రలో భాగమే. ఇప్పుడు 'ఇ-రూపీ' కూడా అలాంటిదే. డిజిటల్ కరెన్సీ అన్నది ఒక పథకం ప్రకారం రూపొందించింది. దీనిలో మన డబ్బు మీద పూర్తి అధికారం మనకు ఉండదు. అంతేకాదు... మన సొమ్మును మనం దేనికి వాడుకోవాలో కూడా వారే నిర్ణయిస్తారు. మన డబ్బును... నిర్ణీత గడువులో, నిర్దేశిత మొత్తాన్ని ఖర్చుపెట్టకుంటే దాన్ని వెనక్కితీసుకునే ప్రమాదం లేకపోలేదు. ఫేషియల్ రికగ్నైజ్ సాఫ్ట్‌వేర్ ద్వారా నిరంతరం పౌరుల మీద నిఘా పెడతారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తే, వారి ఖాతాలను నిలిపివేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఎందుకంటే, మనకు సంబంధించిన సమస్త సమాచారం బ్యాంకు ఖాతాకు అనుసంధానమై ఉంటుంది కనుక. మొత్తంగా ఈ-రూపీ (డిజిటల్ కరెన్సీ) వాడకమంటే పరాధీనతలోకి జారుకోవడమే. 'డిజిటల్ కరెన్సీ వద్దు' అంటూ ప్రధానికి పోస్టు కార్డు రాయాలని పిలుపునిచ్చాం.

జాగృతం చేయడమే లక్ష్యం...

వ్యాక్సిన్ల దుష్ప్రభావాల మీద ప్రఖ్యాత వైద్యుడు ప్రవీణ్ సక్సెనా గారి ద్వారా 2006 నుంచి నాకు కొంత అవగాహన ఉంది. ప్రముఖ కార్డియాలజిస్టు ప్రశాంతి అట్లూరి ప్రోత్సాహంతో అమెరికా, భారత్‌లలోని కొంతమంది వైజ్ఞానిక శాస్త్రవేత్తలు, డాక్టర్లు, సామాజికవేత్తలను కలిసి 'డీకోడ్ వ్యాక్సిన్' పేరుతో రెండు భాగాలుగా డాక్యుమెంటరీ తీశాను. దీంతో పాటు వ్యాక్సిన్ల మీద అవగాహన కల్పిస్తూ 'అవేకెన్ ఇండియా' ద్వారా మేం రూపొందించిన వీడియోలను యూట్యూబ్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల్లో ఉంచాం. కానీ వాటిని ఆయా సంస్థలు తొలగించాయి. అందుకే వాటిని 'బిట్‌చ్యూట్' ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాం. కరోనా లాంటి 'ప్లాన్‌డమిక్'ల ద్వారా ప్రపంచ జనాభాను తగ్గించడం, తద్వారా ప్రకృతి వనరుల మీద పూర్తి ఆధిపత్యాన్ని పొందడం, ప్రపంచాన్ని శాసించడం లాంటి ప్రపంచ కుబేరుల దుర్మార్గ ఆలోచనలను, వారి కుట్రలను తిప్పికొట్టడమే మా ప్రధాన లక్ష్యం. అందుకోసం మరొక స్వాతంత్ర్య ఉద్యమం అవసరమని నమ్ముతున్నాం. ఆ దిశగా జనాన్ని జాగృతం చేస్తున్నాం."

• సాంత్వన్

టీచర్ కావాలనుకొని టెకీ అయిన ఆమె... ఆటిజం బాధిత పిల్లలకు ఆశాకిరణంగా మారారు. 1,200మందికి పైగా బాలల్లో మార్పునకు దోహదపడ్డారు. 'వారిలో సమగ్రాభివృద్ధే నా ఆశయం' అంటున్న అమృతా కృష్ణమూర్తి పదకొండేళ్ళ ప్రయాణం ఇది...

ఆ పిల్లలకు 'స్టెప్పింగ్ స్టోన్'

"చాలామందికి జీవితంలో తమదైన లక్ష్యం ఉంటుంది. కానీ మలుపు వారిని వేరే దారిలోకి మళ్లిస్తుంది. నా విషయంలోనూ అదే జరిగింది. ముందుగా నా గురించి పరిచయం చేసుకుంటాను. మాది తమిళనాడులోని మదురై. బీటెక్‌లో గోల్డ్ మెడలిస్టుని. చదువు పూర్తయ్యాక చెన్నైలోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో అప్లికేషన్ డెవలపర్‌గా చేరాను. నాకు చిన్నప్పటినుంచీ టీచింగ్ అంటే ఇష్టం. కానీ కుటుంబం ఒత్తిడి వల్ల నా అభిరుచికి విరుద్ధమైన కెరీర్‌ను ఎంచుకోవాల్సి వచ్చింది. పెద్దగా ఉత్సాహం కానీ, ఉత్తేజం కానీ కలిగించని రొటీన్‌తో విసుగ్గా ఉండేది. కొన్నాళ్ళకు బెంగళూరులో మరో కంపెనీలోకి మారాను. బోధనా వృత్తిలో నా ఆసక్తిని తీర్చుకోవడం ఎలా? అనే ఆలోచనలో ఉండగా... నేను కొందరు మిత్రులతో కలిసి బెంగళూరులోని 'స్పాస్టిక్ సొసైటీ ఆఫ్ కర్ణాటక'ను సందర్శించాను. అదే నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. ఆటిజంతో ఉన్న పిల్లలను మొదటిసారిగా అక్కడ చూశాను. నేను బాగా చదువుకున్నాను. కానీ పిల్లల పెరుగుదలలోని లోపాల గురించి నాకు తెలిసిన విషయాలు చాలా తక్కువ అని అర్థమయింది. 'ఏదో ఒక రోజు నేనూ తల్లిని అవుతాను. కానీ బిడ్డను కనే ముందు... గర్భంలో ఉన్నది మొదలు కాస్త ఎదిగే వరకూ పిల్లలకు ఎదురయ్యే సమస్యల గురించి తెలుసుకోవాలి' అనుకున్నాను. ఆటిజం గురించి అధ్యయనం చేశాను. ప్రతి 68 మంది పిల్లల్లో ఒకరు ఆటిజం బాధితులనీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం వంద మంది పిల్లల్లో ఒకరికి ఈ సమస్య ఉందనీ ఒక అధ్యయనాన్ని చదివాను. అలాంటి పిల్లల కోసం ఏదైనా చెయ్యాలనిపించింది. 2013లో 'స్టెప్పింగ్ స్టోన్స్ సెంటర్' పేరిట ఒక సంస్థను స్థాపించాను. 'ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్' (ఎఎస్‌డి) ఉన్న పిల్లల సమగ్రాభివృద్ధికి దోహదం చెయ్యడం క్రమంగా విద్యావ్యవస్థతో వారిని అనుసంధానించడం దీని ఉద్దేశం.

ముందుగా గుర్తించడమే కీలకం

వివిధ దశల్లో పిల్లల ఎదుగుదల... ముఖ్యంగా ఆరేళ్ళ లోపువారిలో ఎలా ఉండాలో, ఎలా ఉందో గ్రహించడం చాలా అవసరం. తొలి దశలోనే లోపాలను, జాప్యాలను గుర్తిస్తే... వాటిని పరిష్కరించడానికి ముందుగానే చర్యలు తీసుకొనే వీలు కలుగుతుంది. ఇది చాలా కీలకమని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. మాట్లాడే, ఆవశ్యకమైన విషయాలు, అలవాట్లు నేర్చుకొనే నైపుణ్యాలు లేకపోవడం, శరీరం కదలికల్లో లోపాలు, అతి చురుకుతనం, మందకొడిగా ఉండడం, దేని మీదా ధ్యాస లేకపోవడం... ఇలాంటివి ఆటిజంలో ముందుగా గుర్తించగలిగే చిహ్నాలు. పుట్టిన తరువాత పిల్లల మెదడు అభి



వృద్ధికి మొదటి వెయ్యి రోజులను 'గోల్డెన్ పీరియడ్'గా చెప్పవచ్చు. ఈ కీలకమైన దశలో లోపాలేవైనా కనిపించినట్టయితే వెంటనే జాగ్రత్త తీసుకోవాలి. ఈ నేపథ్యంలో మేము ఎర్లీ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ అమలు చేస్తున్నాం. పిల్లల భౌతిక, భాషా, ప్రవర్తనా, సామాజిక, విజ్ఞానపరమైన ఎదుగుదలను పరిశీలిస్తాం. ఆ పిల్లల అవసరాలేమిటనేది నిర్ధారిస్తాం. తరువాత నిపుణుల సాయంతో... ప్రత్యేకమైన కార్యక్రమాలను రూపొందిస్తాం. స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఫిజికల్ డెవలప్‌మెంట్... ఇలా వివిధ విభాగాలకు చెందిన నిష్ణాతులు వీటిని నిర్వహిస్తారు. తల్లితండ్రులను కూడా దీనిలో భాగస్వాములుగా చేస్తాం. ప్రతిరోజూ పిల్లలతో చేయిస్తున్న యాక్టివిటీస్‌ను, వాటికి వారు ప్రతిస్పందించిన తీరును, వారిలో వస్తున్న మార్పులను నమోదు చేస్తాం. వారానికి ఒకసారి వాటిని సమీక్షించి... మార్పులూ, చేర్పులూ చేస్తూ ఉంటాం.

తల్లితండ్రుల పాత్ర కీలకం...

ఇప్పుడు మా సంస్థలో 72 మంది నిపుణుల బృందం ఉంది. ఇప్పటివరకూ ఆటిజం ఉన్న 1,200



మందికి పైగా పిల్లలకు సాయం అందించాం. ప్రస్తుతం మా దగ్గర 48 మంది ఉన్నారు. వీరికి యోగా, నృత్యం, క్రీడలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్‌లాంటివి కూడా నేర్పిస్తున్నాం. మా దగ్గర చికిత్స, శిక్షణ పొందుతున్న పిల్లలను చేర్చుకోవడానికి స్కూళ్ళను వెతకడం పెద్ద సమస్య. చాలా పాఠశాలల్లో ఇలాంటి పిల్లలకు సౌకర్యాలు, వాటికి బోధన చేసే పాఠ్యప్రణాళిక లేవు. బెంగళూరులో నాలుగు పాఠశాలలు మాతో కలిసి పని చేస్తున్నాయి. సెషన్స్ వారీనైనా లేదా ఏడాదికి ఒకేసారైనా ఫీజు చెల్లించి... వివిధ సేవలను ఉపయోగించుకోవచ్చు.

సాధారణ పాఠశాలల్లో చదివే తమ వయసు పిల్లల స్థాయి అవగాహనను ఆటిజం పిల్లల్లో కల్పించాలన్నదే నా ప్రయత్నం. దీనిలో తల్లితండ్రుల పాత్ర కీలకం. ఎందుకంటే పిల్లలతో ఎక్కువసేపు గడిపేది వాళ్ళే. కాబట్టి వారికోసం ఆరు వారాల 'పేరెంట్ ప్రోగ్రామ్' కూడా నిర్వహిస్తున్నాం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కన్నా ఇది నాకు ఎంతో ప్రశాంతంగా ఉంది. ఆటిజం పిల్లలకు బోధిస్తున్నప్పుడు... నావంతుగా సమాజానికి కొంత సేవ చేయగలుగుతున్నానే సంతృప్తి వెలకట్టలేనిది."

'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/5uFuCdPలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

సందీప్‌కిషన్ 30వ చిత్రం ప్రారంభం



'ఊరి పేరు భైరవకోన' చిత్రం తర్వాత హీరో సందీప్‌కిషన్ నటించే కొత్త చిత్రం షూటింగ్ మంగళవారం ఉదయం ప్రారంభమైంది. ఇది ఆయనకు 30వ సినిమా. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. దర్శకుడు విజయ్ కనకమేడల కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సందీప్‌కిషన్ పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దిల్ రాజు క్లాప్ ఇచ్చారు. నిర్మాత అనిల్ సుంకర గౌరవ దర్శకత్వం వహించారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ చిత్రంలో రావు రమేశ్ కీలక పాత్ర పోషించనున్నారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించుకొనే ఈ సినిమాకు ప్రసన్నకుమార్ బెజవాడ కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అందిస్తున్నారు. నిజార్ షఫీ డీవోపీ. బాలాజీ గుత్తా సహ నిర్మాత.


30 మంది నటులు.. 500 మంది డాన్సర్లు

సినిమాలో ఒక పాటలో ఒకరు కాదు. ఇద్దరు కాదు.. ఏకంగా 30 మంది నటులు, వారికి తోడు 500 మంది డాన్సర్లు పాల్గొనడం.. ఆసక్తికరంగా అనిపిస్తోంది కదూ. ఈ హంగామా దేనికోసం అంటారా.. 'వెల్‌కమ్' సిరీస్‌లో మూడో భాగంగా వస్తున్న 'వెల్‌కమ్ టు ది జంగిల్' చిత్రం కోసం. ఈ యాక్షన్ అడ్వెంచర్ కామెడీ డ్రామాను అహ్మద్ ఖాన్ తెరకెక్కిస్తున్నారు. అక్షయ్‌కుమార్, సంజయ్ దత్, సునీల్ శెట్టి, దిశా పటానీ, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, లారా దత్తా తదితరులతో కూడిన భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. వీరందరితో పాటు మరి కొందరు తారలు ఈ పాట చిత్రీకరణలో పాల్గొంటారట.



ఐమాక్స్ 3డీలో జై హనుమాన్

పాన్ ఇండియా సంచలనం 'హను-మాన్' చిత్రానికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' చిత్రం నిర్మించనున్నట్లు దర్శకుడు ప్రశాంత్ వర్మ ఇదివరకే ప్రకటించారు. స్క్రిప్ట్ కూడా లాక్ చేశారు. భారీ తారాగణం, సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేయనున్నారు. అయోధ్యలోని రామ మందిరం ప్రారంభోత్సవం రోజున ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు దర్శకుడు ప్రశాంత్ వర్మ ప్రారంభించారు. హనుమంతుడి జయంతి సందర్భంగా మంగళవారం కొత్త పోస్టర్ విడుదల చేశారు. డ్రాగన్‌లను తొలిసారిగా ఇండియన్ స్క్రీన్ మీదకు తీసుకొస్తున్నారు ప్రశాంత్ వర్మ. అలాగే ఐమాక్స్ 3డీ ఫార్మెట్‌లో 'జై హనుమాన్' విడుదల కానున్నట్లు ఈ పోస్టర్ ద్వారా ఆయన వెల్లడించారు.



హంటర్ ఎంట్రీ



బాలకృష్ణ ప్రస్తుతం బాబీ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'ఎన్‌బీకె 109'. సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. మంగళవారం ఆయన ఈ సినిమా సెట్‌లో అడుగుపెట్టారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్‌మెంట్స్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. "హంటర్ ఎంట్రీ ఇచ్చారు. సెట్స్ లోకి స్వాగతం బాబీ డియోల్. మూవీలో మీ స్క్రీన్ ప్రజన్స్ సినీ లవర్స్‌కి, బాలకృష్ణ అభిమానులకు పండగ వాతావరణాన్ని తీసుకురానుంది" అని పేర్కొంది.

పడమటి కొండల్లో ప్రేమకథ



అనురూప్ కటారి హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'పడమటి కొండల్లో'. నరేశ్ పెంట దర్శకత్వంలో జయకృష్ణ దురుగడ్డ నిర్మించారు. యశస్వి శ్రీనివాస్, శ్రావ్యారెడ్డి కీలకపాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం హీరో సాయి దుర్గ తేజ్ సోషల్ మీడియాలో ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ స్టిల్‌లో రక్తంతో తడిసిన కత్తిని పట్టుకొన్న హీరో గంభీరంగా కనిపించాడు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "పడమటి కొండల్లో' సినిమాతో సరికొత్త అనుభూతిని ప్రేక్షకులకు అందిస్తాం. ఇందులో యాక్షన్‌తో పాటు ప్రేమకథ ఆకట్టుకుంటుంది. అందమైన లొకేషన్లలో చిత్రీకరణ చేస్తాం. ఈ చిత్రానికి సంగీతం కూడా అందిస్తున్నాను' అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కన్నన్ మునిసామి.

ఆరంభం... ఆ రోజే



ఎమోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆరంభం' చిత్రం విడుదల తేదీ ఖరారైంది. మే 10న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు నిర్మాణ సంస్థ ఏవీటీ ఎంటర్టైన్‌మెంట్ మంగళవారం తెలిపింది. అజయ్ నాగ్ వి, దర్శకత్వంలో అభిషేక్ వీటి నిర్మిస్తున్నారు. మోహన్ భగత్, సుప్రీత సత్యనారాయణ, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ ప్రధాన తారాగణం. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వైవిధ్యమైన కథ, కథనాలతో ఈ చిత్రం తెరకెక్కించాం. కొత్త తరహా చిత్రాన్ని చూసిన అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సింజిత్ యెర్రమిల్లి. సినిమాటోగ్రఫీ: దేవ్‌దీప్ గాంధీ.

జులైలో డెడ్‌పూల్ హంగామా



మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో సూపర్ హీరో చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'డెడ్‌పూల్' సిరీస్ నుంచి రాబోతున్న తాజా చిత్రం 'డెడ్‌పూల్ అండ్ వోల్వారిన్'. ర్యాన్ రేనాల్డ్స్, హ్యూగ్ జాక్‌మాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. షాన్ లేవీ దర్శకుడు. మార్వెల్ స్టూడియోస్, 21 ల్యాప్స్ ఎంటర్టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జులై 26న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు నిర్మాణ సంస్థలు మంగళవారం తెలిపాయి. ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తెలుగు భాషల్లోనూ అదే రోజున విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. డెడ్‌పూల్‌గా ర్యాన్‌రేనాల్డ్స్ తన యాక్షన్ హంగామాతో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో ఎమ్మా కొరిన్, మోరెనా బక్కరిన్ ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.

ఫ్యాంటసీ డ్రామా



సి. సుప్రీత్ కృష్ణ ఓ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి నటిస్తున్నారు. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీవరుణ్, శ్రీరాములు రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల వినూత్న రీతిలో ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం ఆవిష్కరించింది. ఈ పోస్టర్‌ను చూస్తుంటే ఓ గ్రామంలో జరిగే ఫ్యాంటసీ డ్రామాలా అనిపిస్తోంది. ఈ చిత్రానికి ఎడిటర్: అశ్వత్ శివకుమార్, సినిమాటోగ్రాఫర్: కార్తిక్ సాయికుమార్, సంగీతం: సంతు ఓంకార్.

చిటపటలు

చింటూ: పెన్షను మూడువేలు తెలుసా?
చిన్నూ: కరెంటు చార్జీలు, బస్సు చార్జీలు, పన్నులు, సర్‌చార్జీలు ఎంతెంత పెరిగాయో తెలుసా?
చింటూ: వాహన మిత్ర ఇస్తాడు తెలుసా?
చిన్నూ: పక్క రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ రేట్లు నీకు తెలుసా?
చింటూ: ఎన్నెన్నో పథకాలు! తెలుసా?
చిన్నూ: పాత పథకాలకే పేర్లుమార్చాడని నీకు తెలుసా?
చింటూ: బటన్ నొక్కుతున్నాడు కదరా?
చిన్నూ: బతుకులూ నొక్కుతున్నాడు లేరా!
చింటూ: వట్టి కోతలేనంటావా?
చిన్నూ: గట్టి వాతలు కూడా!
చింటూ: మరి.. తిప్పలూ?
చిన్నూ: అప్పులు కూడా!





టీడీపీ, బీజేపీ నేతలతో కలిసి పిఠాపురంలో నామినేషన్ వేసేందుకు వెళ్తున్న పవన్ కల్యాణ్

పవన్ ఆస్తులు రూ.164 కోట్లు

- అప్పులు రూ.64.27 కోట్లు, 5 క్రిమినల్ సహా 8 కేసులు
- అఫిడవిట్‌లో పేర్కొన్న జనసేనాని
- పిఠాపురంలో నామినేషన్ దాఖలు

పిఠాపురం, ఏప్రిల్ 23: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆస్తులు, అప్పుల వివరాలతో కూడిన అఫిడవిట్‌ను ఆయన సమర్పించారు. దీనిలో పేర్కొన్న వివరాల మేరకు పవన్ కల్యాణ్‌కు రూ.164.51 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. అదేవిధంగా రూ.65.77 కోట్ల మేరకు అప్పులు ఉన్నాయి. బ్యాంకు డిపాజిట్లు, బంగారం ఇతర చరాస్తుల విలువ రూ.41.65 కోట్లుగా ఉంది. భార్య అన్నాలెజినోవా పేరు మీద రూ.కోటి రూపాయల ఆస్తి ఉంది. పవన్ పేరిట రూ.94.41 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. భార్య పేరుతో రూ.1.95 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. పవన్‌కు రూ.14 కోట్ల విలువైన 9 కార్లు, ఒక ట్రక్కు, హార్లీ డేవిడ్‌సన్ బైక్ ఉన్నాయి. పిల్లల విషయానికి వస్తే.. దేశాయ్ అఖిరా నందన్ పేరుతో రూ.89.38 లక్షల మేరకు ఆస్తులు ఉన్నాయి. దేశాయ్ ఆద్య ఆస్తులు రూ.87.77 లక్షలు, కొణిదెల పొలెనా అంజనా పవనోవా ఆస్తుల విలువ రూ.11.89 కోట్లుగా పేర్కొన్నారు. కొణిదెల మార్క్‌శంకర్ పవనోవిచ్ ఆస్తుల విలువ రూ.11.86 కోట్లుగా ఉంది. పవన్ వద్ద 1.68 కిలోల బంగారం ఉండగా 114 క్యారెట్‌ల వజ్రాభరణాలు, భార్య వద్ద 215 గ్రాముల బంగారం, డైమెండ్, సిల్వర్, ప్లాటినం ఆభరణాలు ఉన్నాయి. ఐదేళ్లలో పవన్‌కల్యాణ్‌కు సినిమాలు, ఇతర మార్గాల ద్వారా రూ.114.76 కోట్లు ఆదాయం లభించింది. దీనికిగాను ఆదాయపు పన్నుగా రూ.47.07 కోట్లు, జీఎస్టీగా రూ.26.85 కోట్లు చెల్లించారు.

వదిన సురేఖ నుంచి అప్పు


పవన్ కల్యాణ్‌కు రూ.64.27 కోట్ల మేరకు అప్పులు ఉన్నాయి. వీటిలో బ్యాంకుల నుంచి తీసుకున్నవి రూ.17.57 కోట్లు. ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకున్నవి రూ.46.70 కోట్లు. వీరిలో వీఆర్ విజయలక్ష్మి నుంచి అత్యధికంగా రూ.8 కోట్లు, వదిన కొణిదెల సురేఖ నుంచి రూ.2 కోట్లు, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నుంచి రూ.6.35 కోట్లు, లీడ్ ఐటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి రూ.6 కోట్లు, ఎంవీఆర్ఎస్ ప్రసాద్ నుంచి రూ.3.5కోట్లు, ఎర్నేని నవీన్ నుంచి రూ.5.5 కోట్లు, ఎం.ప్రవీణ్‌కుమార్, మైత్రీ మూవీమేకర్స్, శ్రీయశ్వంత్ ఫైనాన్షియర్స్ నుంచి రూ.3 కోట్ల చొప్పున అప్పులు ఉన్నాయి. అదేవిధంగా రాహుల్ కుందవరం నుంచి రూ.2.8 కోట్లు, ఎంవీఆర్ఎస్ ప్రసాద్(హెచ్‌యూఎఫ్) నుంచి రూ.2కోట్లు, కోటింరెడ్డి సాహిత్యరెడ్డినుంచి రూ.50 లక్షలు, లింగారెడ్డి లలిత రూ.50 లక్షలు, ఎ. దయాకర్ నుంచి రూ.45 లక్షలు, డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి రూ.10 లక్షలు అప్పుగా తీసుకున్నారు.

డ్వాక్రాలకు 10 లక్షల వడ్డీలేని రుణం

మహిళలకు స్థానిక రిజర్వేషన్ల ఘనత టీడీపీదే.. చట్ట సభల్లోనూ కోటాకు కృషిచేస్తాం : చంద్రబాబు

- ఆస్తిలో సమాన హక్కు మేమే కల్పించాం
- మహిళలతో మరిన్ని స్కీంలు అమలు
- వారిని లక్షాధికారులను చేస్తాం
- ఆర్టీసీ బస్సుల్లో వారికి ఉచిత ప్రయాణం
- ప్రజాగళంలో టీడీపీ అధినేత చంద్రబాబు

శ్రీకాకుళం/విజయనగరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు రూ.10 లక్షల వరకు అందిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. తద్వారా వారిని సంపాదనపరులుగా, లక్షాధికారులగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. దీనికి స్పష్టమైన ఆలోచనలు తన వద్ద ఉన్నాయన్నారు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. మంగళవారం ఆయన శ్రీకాకుళం జిల్లా పాతపట్నం, ఆమదాలవలసల్లో భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గంలో బొండపల్లిలో నిర్వహించిన మహిళాగళంలోనూ మాట్లాడారు. ఆమదాలవలస సభ చివరిలో 'సైకో పోవాలి.. సైకిల్ రావాలి' పాటకు జనంతో కలిసి చంద్రబాబు చేతులు కలిపి స్టెప్పులు వేయడం విశేషం. భవిష్యత్ గ్యారంటీ విధానంలో కూడా మహిళలకు ప్రధాన భూమిక ఉండేలా చూస్తానని.. వారిని శక్తిమంతులను చేసి రాష్ట్రాభివృద్ధిలో వారి పాత్ర పెంచుతానని ఆయన తన ప్రసంగాల్లో హామీ ఇచ్చారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు తీసుకొచ్చింది టీడీపీయేనని గుర్తుచేశారు. మహాశక్తి ద్వారా 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తాం. ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున.. ఐదేళ్లలో రూ.90 వేలు ఇస్తాం. ఆ 90 వేలను రూ.9 లక్షలు చేసే బాధ్యత నాది' అని చెప్పారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామని.. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. పింఛన్‌ను రూ.4 వేలకు పెంచి ఏప్రిల్ నుంచే ఇస్తానని పునరుద్ఘాటించారు. ఇంకా ఏమన్నారంటే



ఆముదాలవలసలో మంగళవారం నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన జనం, చంద్రబాబు అభివాదం

ఆస్తి హక్కులో మగవారితో సమానంగా మహిళలకు హక్కులు కల్పించినది ఎన్టీఆర్. డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేశా. ఇప్పుడు వారు ఆర్థికంగా ఎదిగి బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా వివిధ వ్యాపారాలు చేస్తున్నారు. వారి ద్వారా మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయిస్తాం. సైకో పాలనలో మహిళలకు రక్షణ కరువైంది. చెల్లెలికి ఆస్తి ఇవ్వకుండా అప్పు ఇచ్చిన వ్యక్తి. ప్రశాంతంగా ఉండే ఉత్తరాంధ్రను గంజాయి రాజధానిగా చేశాడు. జాబు రావాలంటే బాబు రావాలి.. అది నా బ్రాండ్. గంజాయి రావాలంటే జగన్ రావాలి.. అది సైకో బ్రాండ్.

జగన్‌కు మరో షాక్!

'వీరభక్త' ఐపీఎస్‌లపై ఈసీ వేటు

ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు, విజయవాడ కమిషనర్ కాంతి రాణా బదిలీ

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జగన్ సర్కారుకు ఎన్నికల కమిషన్ మరో షాక్ ఇచ్చింది. ఎన్నికల వేళ గీత దాటి మరీ వైసీపీ సేవలో తరిస్తున్న మరో ఇద్దరు ఐపీఎస్‌లపై బదిలీ వేటు వేసింది. జగన్‌కు కళ్లు, చెవులుగా పనిచేస్తోన్న ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు, అదే స్థాయిలో స్వామి భక్తి ప్రదర్శిస్తున్న విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా తాతాను ఎన్నికలతో సంబంధంలేని విధులకు బదిలీ చేయాలని మంగళవారం ఆదేశించింది. వీరిద్దరి స్థానంలో కొత్త అధికారుల నియామకం కోసం... ముగ్గురేసి పేర్లతో బుధవారం మధ్యాహ్నం 3 గంటల్లోపు జాబితా పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డిని ఆదేశించింది. వీరిద్దరూ సత్వరం తమ కిందిస్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించి... రిలీవ్ కావాలని ఆదేశించింది. కోడ్ వెలువడిన తర్వాత ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఆరుగురు ఐపీఎస్‌లు, ముగ్గురు ఐఏఎస్‌లను పక్కకు తప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు... మరో ఇద్దరు ఐపీఎస్‌లపై బదిలీ వేటు వేయడం, అందులోనూ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులునే పక్కన పెట్టడం జగన్‌కు పెద్ద షాక్ అని ఐపీఎస్ వర్గాలు చెబుతున్నాయి. .

ఏమని చెప్పను షెల్లెమ్మా!

- వ్యాపారవేత్తగా తన ప్రస్థానంపై జగన్ మౌనం
- యువతి ప్రశ్నకు దిక్కులు చూసిన ఏపీ సీఎం
- సజ్జల భార్గవ కల్పించుకుని సమాధానం

(విశాఖపట్నం/అమరావతి - ఆంధ్రజ్యోతి)

"సర్... మీరు పొలిటీషియన్ అవకముందు ఒక మంచి వ్యాపారవేత్త! ఇవన్నీ ఎలా హ్యాండిల్ చేస్తున్నారు? యువత మీలా ఆంత్రప్రెన్యూర్ కావడానికి ఏవైనా సలహాలు ఇస్తారా?"



...విశాఖలో ఒక యువతి ఏపీ సీఎం జగన్‌ను అడిగిన ప్రశ్న ఇది! దీనికి సమాధానం చెప్పలేక ఆయన సతమతమయ్యారు. తనదైన మార్కు నవ్వులు చిందిస్తూ... వేదికపైన ఉత్తర దక్షిణాలు చూశారు! 'ఏమని చెప్పను చెల్లెమ్మా!' అన్నట్లుగా మౌనం వహించారు! ఔను... నిజంగానే ఆయన ఏమని బదులివ్వగలరు? మంగళవారం విశాఖపట్నంలోని ఆనందపురంలోని ఒక కన్వెన్షన్ హాలులో వైసీపీ సోషల్ మీడియా విభాగంతో జగన్ సమావేశమయ్యారు. ఒక యువతి తెలిసో, తెలియకో... నిజంగానే మంచి సలహాలు ఇస్తారనో 'మీలాగా మంచి ఆంత్రప్రెన్యూర్ అయ్యేందుకు యూత్‌కు సలహాలు ఇవ్వండి' అని అడిగారు. అర్థమైనా కానట్టు మొహం పెట్టిన జగన్ హావభావాలను అర్థం చేసుకోలేని వైసీపీ సోషల్ మీడియా సారథి సజ్జల భార్గవ రెడ్డి... ఆ యువతి తెలుగులో అడిగిన ప్రశ్నను తెలుగులోకే అనువదించి, కొంత ఇంగ్లీషు కలిపి వివరించారు. కానీ... జగన్ దీనికి బదులివ్వకుండా నవ్వుతూ దిక్కులు చూశారు. దీంతో... సజ్జల భార్గవరెడ్డి తన 'సమయస్ఫూర్తి' ప్రదర్శించారు. "సీఎం గారి తరఫున నేనే బదులిస్తాను. ఆయన రాజకీయ ప్రస్థానం ఎంత ఇన్‌స్పైరింగో... ఆంత్రప్రెన్యూర్ జర్నీ కూడా అంతే ఇన్‌స్పైరింగ్. ఇంటర్నెట్‌లో చూడండి! ఆయన జీవితం ఒక పాఠంలాంటిది. యువత దాని నుంచి చాలా నేర్చుకోవాలి' అని గొప్పగా చెప్పారు. వ్యాపారవేత్తగా జగన్ జర్నీ ఎప్పుడు మొదలైనా... ఆయన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎం అయ్యాకే అది 'ట్రాక్‌లో పడింది. ముడుపులే పెట్టుబడులుగా చకచకా ఎదిగారు. 'క్విడ్‌ప్రోకోయే ఆయన సీక్రెట్ ఆఫ్ సక్సెస్' అని సీబీఐ, ఈడీ తేల్చేశాయి. 'జగన్ జీవిత పాఠాల నుంచి యువత చాలా నేర్చుకోవాలి' అని సజ్జల భార్గవ రెడ్డి చెప్పడం, ఇంటర్నెట్‌లో చూసి తెలుసుకోవాలని ఉచిత సలహాలు ఇవ్వడం మొత్తం ఎపిసోడ్‌కే హైలైట్! ఆయన చెప్పినట్లు జగన్ గురించి ఇంటర్నెట్‌లో సీబీఐ చార్జిషీట్లు, క్విడ్‌ప్రోకో కథలే కనిపిస్తాయి! వీటిని చూసి యూత్ ఏం నేర్చుకోవాలబ్బా!

మగాడివైతే రుణమాఫీ చెయ్

రేవంత్‌కు కేటీఆర్ సవాల్... అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చారు

- కాంగ్రెస్, బీజేపీలను ఓట్లతో తొక్కుదాం
- 12 స్థానాల్లో కారును గెలిపించాలి
- ఎన్నికల ప్రచారంలో కేటీఆర్

రంగారెడ్డి అర్బన్/గద్వాల, వరంగల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీలను ఓట్లతోనే తొక్కుదామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పుడు హామీలతో ప్రజలను మోసగించేందుకు కాంగ్రెస్ మరోసారి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా రాజేంద్రనగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అరచేతిలో వైకుంఠం చూపించి, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని.. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలను గ్రహించి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసి గద్దెనెక్కాడు. ఇప్పుడు బాహుబలి లాగా పార్ట్-2లో కూడా అబద్ధాలు చెబుతున్నాడు. మగాడివైతే రైతులకు రుణమాఫీ చేసి చూపించు'



రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్, పాల్గొన్న నాయకులు

అని రేవంత్‌కు సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి పచ్చి మోసగాడని చెప్పారు. పార్ట్-1లో అరచేతిలో వైకుంఠం చూపెట్టాడని, తాను గెలిచిన వెంటనే డిసెంబరు 9న రుణమాఫీ చేస్తానని.. ఇప్పుడే వెళ్లి రుణాలు తెచ్చుకోవాలని చెప్పి, నాలుగు నెలలైనా చేయలేదని గుర్తుచేశారు. పార్ట్-2లో ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని అంటున్నాడని.. రైతుబంధు వేయడానికే ఆపసోపాలు పడినోడు రూ.40 వేల కోట్ల రుణమాఫీ చేస్తాడట అని విమర్శించారు. కేసీఆర్‌ను పట్టుకొని మగాడివైతే ఒక్క సీటు గెలువు అంటున్నాడని.. 'రేవంత్ ఇప్పుడు నీ భాషలోనే చెబుతున్నా.. నువ్వు మగాడివైతే రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపించు. మగాడివైతే 1.65 లక్షల మంది అక్కాచెల్లెళ్లకు రూ.2500, ముసలోళ్లకు రూ.4 వేలు చేసి చూపించు' అని కేటీఆర్ సవాల్ చేశారు. బీజేపీ మతమే అజెండాగా రాష్ట్రంలో రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. బలహీనవర్గాల బలమైన గొంతుక కాసానిని చేవెళ్ల ఎంపీగా గెలిపించాలని కేటీఆర్ కోరారు. తెలంగాణలో కనీసం 12 చోట్ల బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయేకు 220 సీట్లు, యూపీఏకు 150 సీట్లు దాటే పరిస్థితి లేదని.. బీఆర్ఎస్‌కు 12 సీట్లు ఇస్తే ఇరు కూటముల నేతలు కేసీఆర్ దగ్గరకు వచ్చి 'తెలంగాణకు ఏం కావాలంటే అది చేస్తాం. మాకు మద్దతివ్వండి' అనే పరిస్థితి వస్తుందని చెప్పారు. బీఆర్ఎస్‌కు అన్ని సీట్లు వస్తే కేసీఆర్ తెలంగాణ నుంచి మళ్లీ రాజకీయాలను శాసిస్తారని.. వరంగల్‌లో జరిగిన వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో అన్నారు. బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించిన రంజిత్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి. తల్లి లాంటి పార్టీకి మోసం చేశారని కేటీఆర్ ఆరోపించారు.

రూ.300 కోట్ల ఆస్తి ఉన్నా రంజిత్‌రెడ్డికి కారు లేదు



రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి సుమారు రూ.300 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. కానీ ఆయనకు సొంత కారు లేదు. ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన పేర్కొన్న వివరాల ప్రకారం.. రంజిత్‌రెడ్డి పేరిట రూ.158.81కోట్లు, ఆయన భార్య సీతాదేవి పేరున రూ.135.52 కోట్లు, కుమారుడు రాజార్యన్‌రెడ్డి పేరున రూ.14.17లక్షల విలువ చేసే ఆస్తులున్నాయి. రంజిత్‌రెడ్డి పేరిట రూ.37.83లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, సతీమణి పేరున రూ.1.59కోట్ల విలువ చేసే బంగారు/వజ్రాభరణాలున్నాయి. ఇక ఆయన చేతిలో రూ.1.39లక్షలు, సతీమణి చేతిలో రూ.48,182 నగదు ఉంది. వివిధ బ్యాంకుల్లో రంజిత్‌రెడ్డి పేరిట రూ.20.39కోట్లు, ఆయన భార్య పేరున రూ.2.62కోట్లు అప్పులు ఉన్నాయి. తనపై ఓ క్రిమినల్ కేసు ఉన్నట్లు వెల్లడించారు.

'కాసాని' ఆస్తులు రూ.15.12కోట్లు

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కుటుంబానికి రూ.15.12కోట్లు విలువైన ఆస్తులున్నాయి. ఎన్నికల అఫిడవిట్ ప్రకారం.. కాసాని పేరిట రూ.3.16కోట్లు, అతని సతీమణి పేరిట రూ.11.95కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. అలాగే, రూ.30 లక్షల అప్పు ఉన్నట్లు తెలిపారు. జ్ఞానేశ్వర్ దంపతుల వద్ద 120తులాల బంగారు ఆభరణాలున్నాయి. కాసాని పేరిట సొంతంగా వాహనాలు లేవు, కానీ ఆయన సతీమణి పేరిట నాలుగు కార్లు ఉన్నాయి. కాసానికి మొత్తం 50.2 ఎకరాల వ్యవసాయ భూములు, బాచుపల్లిలో 6.28 ఎకరాలు, గాజులరామారంలో 1.05ఎకరాలు, ఖానామెట్‌లో 18 గుంటలు, చందానగర్‌లో 2.1 ఎకరాల వ్యవసాయేతర భూములున్నాయి. గుట్టల బేగంపేట్‌లో రెండు వాణిజ్య భవనాలు, అమీర్‌పేట, బాచుపల్లిలో నివాస గృహాలు ఉన్నాయి.

కంచర్ల కృష్ణారెడ్డికి అప్పులు నిల్

నల్లగొండ, ఏప్రిల్ 23: బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి పేరిట రూ.82.60 కోట్ల విలువైన స్థిర, చరాస్తులున్నాయి. ఆయన భార్య పేరిట సుమారు రూ.1.06 కోట్లు ఆస్తులు ఉన్నాయి. కృష్ణారెడ్డికి ఎలాంటి అప్పులు లేవు. కృష్ణారెడ్డి వద్ద రూ.88 వేలు, ఆయన భార్య వద్ద రూ.18,600 నగదు ఉంది. అలాగే, కృష్ణారెడ్డి పేరిట వివిధ బ్యాంకుల్లో రూ.96 లక్షల డిపాజిట్లు ఉండగా, ఆయన సతీమణి పేరిట రూ.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఉన్నాయి. రూ.34లక్షలకు పైగా విలువైన రెండు వాహనాలు ఉన్నాయి. చిట్యాల మండలంలోని ఉరుమడ్ల, మరికొన్ని చోట్ల వ్యవసాయ భూములు, స్థలాలు ఉన్నాయి.

రఘురాంరెడ్డి ఆస్తి 58కోట్లు, అప్పులు 9.54 కోట్లు

ఖమ్మం, ఏప్రిల్23(ఆంధ్రజ్యోతి): పార్టీ అధిష్ఠానం ప్రకటించకముందే ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన రామసహాయం రఘురాంరెడ్డికి రూ.58.27కోట్ల విలువైన ఆస్తులు, రూ.9.54 కోట్ల అప్పులు ఉన్నాయి. రఘురాంరెడ్డికి ఉన్న రూ.58.27కోట్ల ఆస్తుల్లో రూ.13.78 కోట్లు హిందు అవిభాజ్య కుటుంబ ఆస్తులు ఉన్నాయి. ఆయన పేరు మీద రూ.28.16కోట్ల చరాస్తులు, రూ.16.33కోట్లు స్థిరాస్తులు ఉన్నాయి. రూ.9.54కోట్లు అప్పుల్లో రఘురాంరెడ్డి పేరిట 9.23కోట్లు, అవిభాజ్య కుటుంబ అప్పు 31లక్షలు ఉన్నాయి.

మాలోతు కవిత కుటుంబ ఆస్తి రూ.4.97 కోట్లు

మహబూబాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, సిటింగ్ ఎంపీ మాలోతు కవిత కుటుంబానికి రూ.4.97 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, వాహనాలు, బంగారం, ఇళ్లు అన్నీ కలిపి కవిత పేరిట రూ.4.15కోట్లు ఆస్తులున్నాయి. ఆమెభర్త భద్రునాయక్ పేరిట కారు, బంగారం, నగదు, బ్యాంకులో నగదు మొత్తం రూ.41.75లక్షలు, కుమార్తె మహతి పేరిట రూ.21.65లక్షలు, కుమారుడు నయన్ పేరిట రూ.18.78లక్షల ఆస్తులు ఉన్నాయి. అలాగే వారికి రూ.10.05 లక్షలు అప్పులున్నాయి.

నెహ్రూ విధానాలతోనే చైనా యుద్ధం

- పదేళ్లలో మెరుగైన విదేశాంగ విధానం
- ఈసీ, ఈవీఎంలపై విదేశీ మీడియా అక్కసు
- విదేశాంగ మంత్రి జైశంకర్

హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చైనా విషయంలో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అనుసరించిన విధానం సరైంది కాదని, ఇది చైనా యుద్ధంతో నిరూపితమైందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. 'చైనాతో స్నేహపూర్వక విధానాలపై నెహ్రూకు అప్పటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ లేఖ రాశారు. చైనా ప్రవర్తన అనుమానాస్పదంగా ఉందన్నా నెహ్రూ పట్టించుకోలేదని తప్పుపట్టారు. మంగళవారం హైదరాబాద్‌లో 'ఫోరం ఫర్ నేషనల్ థింకర్స్' ఆధ్వర్యంలో 'భారత విదేశాంగ విధానం.. సంకోచం నుంచి ఆత్మవిశ్వాసం వరకు..' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో జైశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉగ్రవాద సమస్యపై యూపీఏ ప్రభుత్వం రాజీ పడిందని ఆరోపించారు. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా నుంచి చమురు దిగుమతి, 2017 తర్వాత క్వాడ్ దేశాల సమూహాన్ని పునఃప్రారంభించడం, జి-20 దేశాలకు నేతృత్వం వహించడం మోదీ ప్రభుత్వం సాధించిన ఘనతని అన్నారు. గత పదేళ్లలో దౌత్యపరమైన అంశాల్లో భారత్ ఎంతో మెరుగైందన్నారు. భారత్‌లో ఎన్నికలు, ఎన్నికల సంఘం, ఈవీఎంలపై విదేశీ మీడియా వ్యతిరేక కథనాలు ప్రచురిస్తోందన్నారు. కొన్ని విదేశీ పత్రికలు ఉద్దేశపూర్వకంగా బీజేపీ ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని విమర్శిస్తున్నాయన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడుతూ తాను దేవుడిని నమ్మనని, అయితే మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని చెప్పే మతం ఏదైనా ఆచరించేందుకు సిద్ధమన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో దేశం సాధించిన అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరారు.







బంగ్లాదేశ్ నుంచి వచ్చిన హిందువులు, బౌద్ధులకు భారత పౌరసత్వం ఇస్తే పశ్చిమ బెంగాల్ సీఎం మమతకు, కాంగ్రెస్ పార్టీకి వచ్చిన సమస్య ఏంటి? బెంగాల్‌లోకి చొరబాటుదారులు ప్రవేశించకుండా, సందేశ్‌ఖాలీ లాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే మోదీ మళ్లీ ప్రధానిగా రావాలి. గత ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి 18 సీట్లు ఇచ్చారు. మోదీ రామ మందిరం తీసుకువచ్చారు. ఈసారి 35 సీట్లు ఇవ్వండి రాష్ట్రంలోకి చొరబాట్లను ఆపేస్తారు. బీజేపీకి ఓటేస్తే దీదీ గుండాలు తలకిందులుగా వేలాడదీస్తాం. - అమిత్ షా

అమేఠీ నుంచి రాహుల్ గాంధీ పోటీ?


అమేఠీలోని రాహుల్ నివాసంలో మరమ్మతులు

లఖ్‌నవూ, ఏప్రిల్ 23: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అమేఠీ నుంచి పోటీ చేయనున్నారా? అమేఠీలోని ఆయన నివాసాన్ని శుభ్రపరచడంతో పాటు మరమ్మతులు చేస్తుండడంతో సామాజిక మాధ్యమాల్లో ఈ విషయమై ఊహాగానాలు వ్యాపించాయి. ఆయన పోటీ చేస్తారని యూపీ కాంగ్రెస్ శ్రేణులు కూడా బలంగా నమ్ముతున్నాయి. అమేఠీ, రాయ్‌బరేలీ స్థానాలకు అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు. ఘాజియాబాద్‌లో శుక్రవారం ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో కలిసి రాహుల్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అమేఠీలో పోటీ చేసే విషయమై ప్రశ్నించినప్పుడు "మా పార్టీలోని సెంట్రల్ ఎలక్షన్ కమిటీ అలాంటి విషయాలపై నిర్ణయం తీసుకుంటుంది. నేను కట్టుబడి ఉంటా" అని చెప్పారు. ఆయన చెప్పిన సమాధానంలో ఎలాంటి స్పష్టత లేనప్పటికీ పార్టీ వర్గాలు మాత్రం దాన్ని పాజిటివ్‌గానే తీసుకుంటున్నాయి. అమేఠీలోని గౌరీగంజ్ ప్రాంతంలో ఉన్న ఆయన నివాసాన్ని శుభ్రం చేస్తున్న కూలీలతో మాట్లాడినప్పుడు కాంగ్రెస్ వారు తమను పనిలో పెట్టుకున్నారని చెప్పారు. రాహుల్ భయ్యా త్వరలో ఇక్కడికి వస్తారని, అందుకే మరమ్మతులు చేస్తున్నామని అన్నారు.

అదానీ కుంభకోణంపై జేపీసీ: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి అధికారంలోకి రాగానే అదానీ కుంభకోణంపై విచారణకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ జైరాం రమేశ్ అన్నారు. జేపీసీ ఏర్పాటుతోనే ఆ కుంభకోణం పూర్తిస్థాయిలో బట్టబయలవుతుందని మంగళవారం ఓ ప్రకటనలో ఆయన తెలిపారు. పెట్టుబడుల పరిమితులను ఉల్లంఘించి అదానీ గ్రూప్ కంపెనీలలోకి నిధులు వచ్చినట్లు సెబీ గుర్తించిందని రాయిటర్స్ ప్రచురించిన కథనాన్ని ఆయన ప్రస్తావించారు. బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాల్లో అదానీకి కాంట్రాక్టులు దక్కేందుకు దేశ దౌత్య వర్గాల ద్వారా మోదీ ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. ప్రధాని మోదీతో అదానీకి ఉన్న బలమైన స్నేహబంధం ఆయన చేసిన చట్టవిరుద్ధ కార్యాకలపాలను ఇక కప్పిపుచ్చలేదన్నారు.

మణిపూర్ హింసపై అమెరికా నివేదిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: మణిపూర్‌లో జాతుల ఘర్షణలో జరిగిన ఘోరాలను అగ్రరాజ్యం అమెరికా మానవ హక్కుల నివేదిక-2023 తూర్పారబట్టింది. మెజారిటీలైన మైతీలు, గిరిజన కుకీ తెగ మధ్య జాతుల వైరంతో యథేచ్ఛగా జరిగిన మూక దాడులు, సామూహిక అత్యాచారాలను నివేదిక ప్రస్తావించింది. కనీసం 175 మంది చనిపోయారని, 60 వేల మంది వరకు సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారని నివేదిక వెల్లడించింది. భారతదేశంలో విలేకరులపై దాడులు, అక్రమ అరెస్టులు, అసమ్మతివాదుల గొంతు నొక్కేందుకు క్రిమినల్ చట్టాలను ప్రయోగించడంపైనా అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. గుజరాత్ అల్లర్లకు సంబంధించి 'ఇండియా: ది మోదీ క్వశ్చన్' పేరిట డాక్యుమెంటరీని ప్రసారం చేసిన తర్వాత బీబీసీ కార్యాలయాల్లో ఆదాయపన్ను శాఖ సోదాలు నిర్వహించడం, విలేకరుల సామగ్రిని సీజ్ చేయడాన్నీ నివేదిక ప్రస్తావించింది. కెనడాలో సిక్కు ఉద్యమకారుడు హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు గురైన విషయాన్నీ పేర్కొంది. ఆ హత్యలో ప్రభుత్వ ఏజెంటుల పాత్ర ఉందని ఆక్షేపించింది.

రైల్వే ప్రయాణికులకు రూ.50కే మీల్స్

న్యూఢిల్లీ, హైదరాబాద్, ఏప్రిల్ 23: రైళ్లలో జనరల్ బోగీలో ప్రయాణించే వారి కోసం రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ప్రయాణికులకు అందుబాటు ధరల్లో ఆహార పదార్థాలను అందించనుంది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 20, 50 రూపాయలకే జనరల్ బోగీల్లో ప్రయాణించే వారి కోసం నాణ్యమైన భోజనం, స్నాక్స్ అందించాలని, ప్రస్తుతం వంద స్టేషన్లలో 150 కౌంటర్లు ఏర్పాటు చేశామని రైల్వే అధికారులు తెలిపారు. వీటిని భవిష్యత్‌లో మరిన్ని స్టేషన్లకు విస్తరించే అవకాశం ఉందన్నారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 12 స్టేషన్లలో 18 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి 10 స్టేషన్లు ఉన్నాయి. హైదరాబాద్, వికారాబాద్, విజయవాడ, రేణిగుంట, తిరుపతి, పాకాల, రాజమండ్రి, డోన్, నంద్యాల, గుంతకల్ రైల్వే స్టేషన్లలో ఎకానమీ మీల్స్ అందించనున్నారు.

నకిలీ ఆన్‌లైన్ కోర్సులతో జాగ్రత్త: యూజీసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: కొన్ని సంస్థలు ప్రకటిస్తున్న నకిలీ ఆన్‌లైన్ కోర్సులతో జాగ్రత్తగా ఉండాలని యూజీసీ హెచ్చరించింది. గుర్తింపులేని కోర్సులకు ప్రామాణిక డిగ్రీల పేర్లు పెట్టి మోసగిస్తున్నాయని తెలిపింది. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌కు ఎంబీఏ అన్నది అధికారికంగా ఆమోదించిన సంక్షిప్త నామం కాగా, వేరే కోర్సులకు కూడా ఎంబీఏ అన్న సంక్షిప్త నామాలు పెట్టి తప్పుదోవపట్టిస్తున్నాయని తెలిపింది. 'పది రోజుల్లో ఎంబీఏ' అన్న ప్రకటన రావడంతో స్పందించిన యూజీసీ ఈ వివరణ ఇచ్చింది.

కాంగ్రెస్ వాటా.. ముస్లిం కోటా

(మొదటి పేజీ తరువాయి)

కోటాను తగ్గించి, ముస్లింలకు రిజర్వేషన్లను కల్పించాలని నాలుగు సార్లు ప్రయత్నించింది. న్యాయపరమైన చిక్కులు ఎదురవ్వడంతో ఆ ప్రయత్నాలు సఫలమవ్వలేదు" అని మోదీ వివరించారు. 2011లో కాంగ్రెస్ సర్కారు ఏకంగా దేశవ్యాప్తంగా ముస్లిం రిజర్వేషన్లకు ప్రయత్నించిన విషయాన్ని గుర్తుచేశారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని, ఆ దిశలో చర్యలు తీసుకున్న కాంగ్రెస్ పార్టీ.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానపరిచిందంటూ మండిపడ్డారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు. ఇతరుల సంపదను దోచి, ముస్లింలకు పంచడం, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల కోటాను తగ్గించి, మతపరమైన రిజర్వేషన్లను అమలు చేయడమే కాంగ్రెస్ సిద్ధాంతమని ఆరోపించారు. కర్ణాటకలో బీజేపీ అధికారంలోకి రాగానే ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. "నేను దేశ ప్రజలందరికీ హామీ ఇస్తున్నా. ఇది మోదీ గ్యారెంటీ..! ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కొనసాగుతాయి. అంబేడ్కర్ ఆశయాలను కాపాడుతాం" అని మోదీ వివరించారు. తాను మూడ్రోజుల క్రితం రాజస్థాన్‌లో 90 సెకన్లపాటు ఇచ్చిన ఉపన్యాసంతో (కాంగ్రెస్ వస్తే.. మహిళల మెడల్లోని మంగళసూత్రాలను కూడా లాక్కొంటుంది అని మోదీ వ్యాఖ్యానించారు) కాంగ్రెస్ పార్టీలో.. ఇండియా కూటమిలో కల్లోలం మొదలైందన్నారు. "అవును.. నేను చెబుతున్నా.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. ఆస్తులను ఎక్స్‌రే చేసి, వాటిని ఎంపిక చేసుకున్న కొందరికి పంచిపెడుతుంది. కాంగ్రెస్ ఓటు బ్యాంకు కుతంత్రాలను నేను బహిర్గతం చేశాను. నేను నిజం చెబితే.. కాంగ్రెస్‌లో జంకు ఎందుకు? నేను వారి(కాంగ్రెస్) రహస్య ఎజెండాను బయటపెట్టాననేనా?" అని మోదీ ప్రశ్నించారు. "కేంద్రంలో 2014లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే.. ఇప్పటికీ జమ్మూకశ్మీర్‌లో జవాన్లపై ప్రజలు రాళ్లు రువ్వేవారు. శత్రువులు సరిహద్దుల్లో కాల్పులు జరిపేవారు" అని వ్యాఖ్యానించారు.


ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారంలో ఆదివాసీలతో మోదీ

దళితులను అవమానించిన కాంగ్రెస్

తాము ఒక విజన్‌తో ముందుకు వెళ్తున్నామని, గడిచిన పదేళ్లలో దేశాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని, కాంగ్రెస్‌కు గానీ, ఇండియా కూటమికి గానీ ఒక లక్ష్యమంటూ లేదని ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్ నినాదాలిస్తుంది. గరీబీ హఠావో అని పిలుపునిచ్చి.. 60 ఏళ్లుగా ఆ నినాదాన్ని పాతిపెట్టింది. మేము(బీజేపీ) నినాదాలపై ఆధారపడేది లేదు. ఏదైనా చేతల్లో చూపిస్తాం. అయోధ్యలో రామ మందిర కలను సాకారం చేశాం. కానీ, కాంగ్రెస్ మాత్రం రాముడిని అవమానించింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రామభక్తురాలు, గిరిజన మహిళ శబరిని అవమానించింది. బీజేపీ అధికారంలోకి రాగానే.. దళితుడైన రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా చేస్తే.. కాంగ్రెస్ ఆయనను అవమానించింది. ఆ తర్వాత గిరిజన మహిళ అయిన ద్రౌపది ముర్మును రాష్ట్రపతి ఎన్నికల సమయంలోనే అవమానించింది" అని ప్రధాని నిప్పులు చెరిగారు. పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఉండడం కాంగ్రెస్‌కు నచ్చని విషయమని వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని తగ్గిస్తూ వస్తున్నామని గుర్తుచేశారు.

దేశాన్ని విభజించడమే కాంగ్రెస్ సిద్ధాంతమా?

దేశాన్ని విభజించడమే కాంగ్రెస్ సిద్ధాంతమా అని ఛత్తీస్‌గఢ్ ర్యాలీలో మోదీ ప్రశ్నించారు. "దేశాన్ని ఒకసారి మతప్రాతిపదికన విడదీశారు. ఇటీవల కర్ణాటకకు చెందిన ఓ కాంగ్రెస్ నేత దక్షిణాదిని విడదీయాలన్నారు. తాజాగా గోవాలో ఎన్నికల బరిలో ఉన్న మరో కాంగ్రెస్ నేత(విరియాటో ఫెర్నాండెజ్) తమపై రాజ్యాంగాన్ని బలవంతంగా రుద్దామన్నారు. గోవా విడిగా ఉండాలన్నారు. అంటే.. కాంగ్రెస్ తనకు ఓటు బ్యాంకు అధికంగా ఉన్న ప్రాంతాలను విడదీసి, పాలించాలని భావిస్తోందా?" అని నిలదీశారు. కాంగ్రెస్ నేతలు మాటలు అంబేడ్కర్‌ను అవమానించడమేనన్నారు.

కేజ్రీవాల్‌కు ఇన్సులిన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న సీఎం కేజ్రీవాల్‌కు జైలు అధికారులు ఎట్టకేలకు ఇన్సులిన్ ఇచ్చారు. కేజ్రీవాల్‌కు షుగర్ స్థాయిలు పెరగడంతో తక్కువ మోతాదులో ఇన్సులిన్ ఇచ్చినట్టు వారు మంగళవారం వెల్లడించారు. ఎయిమ్స్ వైద్యుల సలహా మేరకు సోమవారం సాయంత్రం లో డోస్ ఇన్సులిన్ రెండు యూనిట్లు ఇచ్చినట్టు తెలిపారు. హనుమాన్ జయంతి రోజున తమకు ఈ వార్త ఎంతో ఆనందం కలిగించిందని ఆమ్ ఆద్మీ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. హనుమంతుడు తన భక్తుడైన కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ అందేలా చేశారని ఆ పార్టీ నాయకులు వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్‌కు వైద్యం అందించడంలో కేంద్రంలోని బీజేపీ సర్కారు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఢిల్లీ మంత్రి సౌరభ్ ఆరోపించారు. కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వడంతో ఆయనలో సుగర్ లెవెల్స్ పెరుగుతున్నాయన్న విషయం నిజమని రుజువైందన్నారు.

అలీగఢ్ వర్సిటీకి మహిళా వీసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం వర్సిటీ వీసీగా నైమా ఖాతూన్ నియమితులయ్యారు. వందేళ్ల చరిత్రలో ఈ వర్సిటీకి మహిళా వీసీని నియమించడం ఇదే తొలిసారి. రాష్ట్రపతి ఆమోదం అనంతరం విద్యాశాఖ ఈ నియామకం చేపట్టినట్లు అధికారులు సోమవారం తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ నియామకానికి ఎన్నికల సంఘం అనుమతి కూడా తీసుకున్నారు. ఇదే యూనివర్సిటీలో మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న నైమా ఖాతూన్ ఐదేళ్ల పాటు వైస్ ఛాన్సలర్‌గా పనిచేస్తారు. 1875లో ఏర్పాటైన మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కళాశాలే 1920లో అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీగా మారింది. అప్పుడు బేగం సుల్తాన్ జహాన్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు.

బిహారీలు జైకొట్టేదెవరికి?

ఎన్డీయేను మళ్లీ ఆదరిస్తారా.. ఇండియా కూటమిని నిలబెడతారా

ప్రాచీన భారతదేశంలోని మొట్టమొదటి సామ్రాజ్యం మగధ..! అతి పెద్ద విశ్వవిద్యాలయం నలందా..! షోడశ జనపదాలు మొదలు.. మౌర్యులు.. ఆ తర్వాతి రాజ వంశాలు ఏలిన ప్రదేశాల్లో మగధతోపాటు.. మిథిల, వైదేహి వంటి రాజ్యాలూ గొప్ప చారిత్రక ఘట్టాలకు నిలువుటద్దాలు..! బిహార్ కీర్తికి ఇవి మచ్చుతునకలు. అంతేనా.. ఆధునిక భారతదేశంలోనూ చంపారన్ వంటి ఉద్యమాలకు పురిటిగడ్డ..! అలాంటి బిహార్‌లో 7దశల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు ఉత్కంఠను రేపుతున్నాయి. - సెంట్రల్ డెస్క్



ఎన్డీయే వ్యూహాలు ఫలిస్తాయా?

బిహార్‌లో 40 లోక్‌సభ స్థానాలున్నాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో జేడీయూ, లోక్ జనశక్తి పార్టీ(ఎల్‌జేపీ) ఎన్నికల బరిలో ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 17, జేడీయూ 16, ఎల్‌జేపీ ఆరు స్థానాల్లో విజయం సాధించాయి. ఒకే ఒక్క సీటు విపక్షానికి దక్కింది. ఈ సారి 400 సీట్లను సాధిస్తామని ఎన్డీయే ధీమా వ్యక్తం చేస్తున్నా.. బిహారీలు ఆ కూటమికి గత ప్రాభవాన్ని తిరిగి ఇస్తారా? లేక ఇండియా కూటమిని ఆదరిస్తారా? అనే ఉత్కంఠ అన్ని పార్టీల్లోనూ సాగుతోంది. ఈ సారి బీజేపీ తన సిటింగ్ స్థానాల్లో(17) పోటీకి సిద్ధమైంది. నితీశ్ పార్టీ జేడీయూ కూడా గతంలో గెలిచిన స్థానాల్లోనే పోటీలో ఉంది. ఎల్‌జేపీ ఒక స్థానాన్ని తగ్గించుకుని, ఐదు చోట్ల బరిలో నిలుస్తోంది. మిగతా రెండు స్థానాల్లో మాజీ సీఎం జీతన్ రామ్ మాంఝీ పార్టీ హిందుస్థాన్ అవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ పోటీ చేయనున్నాయి.

అనుకూలాంశాలు

ఓబీసీల అభ్యున్నతికి ఆద్యుడిగా పేరున్న కర్పూరికి భారతరత్న ఇవ్వడం ఎన్డీయేకు ప్రధానమైన అనుకూలాంశం. ఇక మిత్రపక్షాల మధ్య సీట్ల సర్దుబాటులో పెద్దగా విభేదాలేమీ లేవు. అయితే.. రామ్‌విలాస్ పాసవాన్ తనయుడు చిరాగ్ పాసవాన్‌కు ఆయన మేనమామ పశుపతి పారస్‌కు మధ్య మొదట్లో సీట్ల విషయంలో విభేదాలు కనిపించాయి. కానీ, తర్వాత పారస్ ఈ విభేదానికి తెరదించారు. "ఆర్‌ఎల్‌జేపీ ఎప్పటికీ ఎన్డీయేలో భాగమే. ఈ సారి 400కు పైగా స్థానాలను ఎన్డీయే గెలుస్తుంది" అని తాను మోదీతో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేశారు. బిహార్‌లో 7 దశల్లో పోలింగ్ ఉండడం ఎన్డీయేకు కలిసివచ్చే అంశం. అన్ని దశల్లో మోదీ స్వయంగా ప్రచారానికి వచ్చే అవకాశాలున్నాయి.

ప్రతికూలాంశాలు

మాటిమాటికీ కూటములను మార్చిన నితీశ్‌కుమార్ ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోయారనే ప్రచారం జరుగుతోంది. చిరాగ్ పాసవాన్ కూడా రామ్‌విలాస్ పాసవాన్ మాదిరిగా ప్రభావం చూపుతారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు 2019 మాదిరిగా ఎన్డీయే ఊపు లేదని చెబుతున్నారు. బిహార్‌లో 63% ఉన్న ఓబీసీలు, 17% ఉన్న ముస్లింలు సంఘటితంగా ఓటువేసే అవకాశాలున్నాయని.. అదే నిజమైతే.. బీజేపీకి సవాలేనని భావిస్తున్నారు. 2019 మాదిరిగా బిహార్‌లో నరేంద్రమోదీ ఆకర్షణ ఎంతవరకు పనిచేస్తుంది? అనే చర్చ జరుగుతోంది.

'ఇండియా'లో లుకలుకలే ప్రధాన సమస్య?

ఇండియా కూటమి విషయానికి వస్తే.. ఎన్నికలు అయ్యేదాకా పొత్తు ధర్మం కొనసాగుతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమిలోని పార్టీల మధ్య విభేదాలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. నిజానికి ఇండియా కూటమిని నిలబెట్టాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ కొంత వెనక్కి తగ్గింది. ఆర్జేడీకి 26 స్థానాలను కేటాయించింది. కాంగ్రెస్ కేవలం 9 చోట్ల పోటీ చేస్తోంది. మిగతా ఐదు స్థానాలను వామపక్షాలకు కేటాయించింది. సీపీఐ(ఎంఎల్) మూడు చోట్ల బరిలో దిగుతుండగా.. సీపీఐ, సీపీఎంలు చెరో స్థానం నుంచి పోటీ చేస్తున్నాయి. 2019లో ఆర్జేడీకి ఒక్కసీటు కూడా దక్కలేదు. ఒకేఒక్క స్థానంలో కాంగ్రెస్ విజయం సాధించింది.

అనుకూలాంశాలు

కులగణన జరపడం చరిత్రాత్మక అంశం. ఈ నేపథ్యంలో వర్గసమీకరణాలు, ఓబీసీ, మైనారిటీ ఓటర్లపై ఇండియా కూటమి ఆశలు పెట్టుకుంది. వామపక్షాలకు సిటింగ్ ఎమ్మెల్యే స్థానాలు ఉండడంతో.. వారి ఓట్లు కూడా కూటమికే పడే అవకాశాలున్నాయి. ఆర్జేడీ చీఫ్ లాలూ తనదైన శైలిలో రాజకీయ వ్యూహాలకు పదును పెడితే.. విజయం తమదేనని 'ఇండియా' భావిస్తోంది.

ప్రతికూలాంశాలు

సీట్ల పంపిణీతో కాంగ్రెస్ ఆశావహులు కొందరు రెబెల్స్‌గా మారారు. మరికొందరు రాజీనామా బాట పట్టారు. బిహార్ కాంగ్రెస్ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు అజయ్‌సింగ్ పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్ బలంగా ఉన్న ఔరంగాబాద్, పూర్ణియా స్థానాలను ఆర్జేడీకి ఇవ్వడమే అందుక్కారణం. పూర్ణియాలో పప్పూయాదవ్ రెబెల్‌గా బరిలో ఉన్నారు. 2019తో పోలిస్తే బిహార్‌లో కాంగ్రెస్‌కు అవకాశాలు ఎక్కువే ఉన్నా అసంతృప్తుల బెడద వేధిస్తోంది.

ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలాల నిషేధంపై నివేదిక ఇవ్వండి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: భారత్‌కు చెందిన ఎవరెస్ట్, ఎండీహెచ్ సంస్థల మసాలాలపై హాంకాంగ్, సింగపూర్ దేశాలు నిషేధం విధించడంపై కేంద్రం అప్రమత్తమైంది. ఎవరెస్ట్, ఎండీహెచ్ సంస్థలు ఎగుమతి చేసిన కొన్ని మసాలాల్లో ఇథిలీన్ ఆక్సైడ్ అనే హానికరమైన రసాయనం ఉందంటూ హాంకాంగ్, సింగపూర్‌కు చెందిన ఆహార నియంత్రణ సంస్థలు ఆయా మసాలాలపై నిషేధం విధించాయి. దీంతో, నిషేధం విధించడానికి దారితీసిన కారణాలపై తమకు ఓ నివేదిక ఇవ్వాలని సింగపూర్, హాంకాంగ్ ఆహార నియంత్రణ సంస్థలను కేంద్ర వాణిజ్య శాఖ కోరింది. మసాలాల నిషేధం అంశంపై సమగ్ర నివేదిక అందజేయాలని ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలను కూడా నిర్దేశించింది. మరోపక్క, నిషేధానికి కారణాలపై ఎవరెస్ట్, ఎండీహెచ్ సంస్థల నుంచి కూడా కేంద్రం వివరణ కోరింది. అయితే, ప్రపంచంలోని ఏ దేశంలోనూ తమ ఉత్పత్తులపై నిషేధం విధించలేదని ఎవరెస్ట్ సంస్థ మంగళవారం స్పష్టం చేసింది. తమ 60 రకాల ఉత్పత్తుల్లో ఒకదాన్నే పరీక్షలకు సిఫారసు చేశారని తెలిపింది.

నూడుల్స్‌లో రూ.2 కోట్ల వజ్రాలు

ముంబై, ఏప్రిల్ 23: ముంబై విమానాశ్రయంలో భారీగా బంగారం, వజ్రాలు పట్టుబడ్డాయి. రూ. 6.46 కోట్ల విలువైన బంగారం, వజ్రాలను నూడుల్స్ ప్యాకెట్లలో, శరీర భాగాల్లో దాచి అక్రమంగా తరలిస్తున్న నలుగురుని కస్టమ్స్ అధికారులు అరెస్టు చేశారు. ముంబై నుంచి బ్యాంకాక్ వెళ్తున్న ఓ ప్రయాణికుడు... నూడుల్స్ పొట్లాల్లో ఏకంగా రూ.2 కోట్ల విలువైన వజ్రాలను తరలిస్తూ పట్టుబడ్డాడు. అలాగే రూ. 4.04 కోట్ల విలువైన 6.199 కేజీల బంగారాన్ని శరీర భాగాలు, రెక్టమ్‌లో దాచిన మరో ముగ్గురిని కూడా అరెస్టు చేశారు. మరోవైపు కొలంబో నుంచి ముంబైకి వచ్చిన ఓ మహిళ తన లోదుస్తుల్లో దాచిన 321 గ్రాముల బంగారు బిస్కెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇలా మొత్తం రూ.4.44 కోట్ల విలువైన 6.8 కేజీల బంగారాన్ని, రూ.2 కోట్ల విలువైన వజ్రాల్ని వారాంతంలో స్వాధీనం చేసుకున్నారు.

ఆ నిబంధన ఎందుకు తొలగించారు?

పతంజలి కేసులో కేంద్రాన్ని నిలదీసిన సుప్రీం

- డీఎంఆర్ యాక్ట్‌లోని రూల్ నంబర్ 170 కింద చర్యలు తీసుకోవద్దన్న లేఖపై ఆగ్రహం
- ఆ లేఖపై వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశం


మంగళవారం సుప్రీం కోర్టు ఆవరణలో రాందేవ్ బాబా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పతంజలి వాణిజ్యప్రకటనల కేసు విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు.. కేంద్రంపైన, పతంజలి సంస్థపై పిటిషన్ వేసిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ)పైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. 'డ్రగ్స్ అండ్ మ్యాజికల్ రెమెడీస్ (అబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్‌మెంట్స్) యాక్ట్ (డీఎంఆర్ యాక్ట్)లోని 170వ నిబంధనను ఎందుకు తొలగించారో చెప్పాలంటూ కేంద్రాన్ని నిలదీసిన ధర్మాసనం.. 'ఇతరులను వేలెత్తి చూపే ముందు మీ ఇంటిని చక్కదిద్దుకోండి' అంటూ ఐఎంఏకు తలంటింది. డీఎంఆర్ యాక్ట్‌లోని 170వ నిబంధన ప్రకారం.. తమ ఔషధానికి అద్భుతసామర్థ్యం ఉందంటూ మందుల కంపెనీలు వాణిజ్య ప్రకటనలు ఇవ్వడం నిషిద్ధం. అలాగే, ఆ నిబంధన ప్రకారం ఆయుర్వేద, సిద్ధ, యునాని సంస్థలు తమ ఔషధాలకు సంబంధించిన ప్రకటనలు ఇచ్చేముందు సంబంధిత ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. కానీ.. కీలకమైన ఆ నిబంధనను తొలగిస్తున్నట్టుగా పేర్కొంటూ ఆయుష్ మంత్రిత్వ శాఖ గత ఏడాది ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాయడాన్ని జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఆ నిబంధన కింద ఎలాంటి చర్యలూ తీసుకోవద్దని కోరడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఒక చట్టం అమల్లో ఉన్నప్పుడు దాంట్లో ఒక నిబంధనను అమలు చేయొద్దనడం దాన్ని ఉల్లంఘించడం కాదా అని నిలదీసింది. చూడబోతే.. ప్రభుత్వం దృష్టి అంతా ఆదాయం మీదనే ఉన్నట్టు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. ఎవరెస్ట్, ఎండీహెచ్ మసాలా ఉత్పత్తుల్లో క్యాన్సర్ కారకాలు ఉన్నాయంటూ ఇటీవల వార్తలు వచ్చిన నేపథ్యంలో.. కొన్ని ఎఫ్‌ఎంసీజీ (ఫాస్ట్‌మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్) కంపెనీలు కూడా తప్పుదోవ పట్టించే వాణిజ్య ప్రకటనలు ఇస్తున్న విషయాన్ని కోర్టు ఈ విచారణ సందర్భంగా గుర్తుచేసింది. ప్రజలను అలా మోసపోనివ్వబోమని స్పష్టం చేసింది. అలాంటి ప్రకటనల ద్వారా ఎఫ్ఎంసీజీ కంపెనీలు వినియోగదారుల చట్టాలను దుర్వినియోగం చేయకుండా తీసుకుంటున్న చర్యలేమిటో చెప్పాలని.. కేంద్రాన్ని ఆదేశించింది. రూల్ 170 కింద ఎలాంటి చర్యలూ తీసుకోవద్దన్న లేఖపై వివరణ ఇవ్వాలని ఆయుష్ మంత్రిత్వ శాఖను ఆదేశించింది. ఈ కేసులో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు సహప్రతివాదులుగా ఇంప్లీడ్ కావాలని ఆదేశించింది.

క్షమాపణ ప్రకటనలూ ఆ సైజులోనే ఉన్నాయా?

తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో బేషరతు క్షమాపణలు చెబుతూ తమ క్లయింట్లు సోమవారం నాడు 67 వార్తాపత్రికల్లో ప్రకటనలు ఇచ్చారని, అవసరమైతే మరిన్ని ప్రకటనలు కూడా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని రాందేవ్ బాబా, బాలకృష్ణ తరఫున వాదనలు వినిపించిన ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అయితే.. ఆ ప్రకటన ఇవ్వడానికి వారం రోజుల సమయం ఎందుకు పట్టిందని ధర్మాసనం నిలదీసింది. అలాగే.. ఆ ప్రకటనల పరిమాణం గురించి కూడా కోర్టు ప్రశ్నించింది. "క్షమాపణ ప్రకటనలు కూడా పతంజలి సంస్థ ఎప్పుడూ ఇచ్చే ప్రకటనల పరిమాణంలోనే ఉన్నాయా?" అని అడిగింది. ఆ పేపర్లను రెండురోజుల్లోగా ఫైల్ చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను 30వ తేదీకి వాయిదా వేసింది.

చైల్డ్ కేర్ లీవ్స్ ఇవ్వాల్సిందే

అది రాజ్యాంగ విధి
సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: దివ్యాంగులైన పిల్లల సంరక్షణ కోసం తల్లులకు చైల్డ్ కేర్ లీవ్స్ (సీసీఎల్)ను నిరాకరించడం తీవ్రమైన విషయమని సోమవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ సెలవులు ఇవ్వకపోవడం అంటే శ్రామిక శక్తిలో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించాలన్న రాజ్యాంగ విధిని ప్రభుత్వం ఉల్లంఘించినట్టవుతుందని పేర్కొంది. ఈ సెలవులు ఇవ్వడం ద్వారా మహిళలకు ఏదో ప్రత్యేక సదుపాయాన్ని కల్పిస్తున్నట్టు భావించకూడదని, అది రాజ్యాంగం ప్రకారం చేయాల్సిన కర్తవ్యం అని స్పష్టం చేసింది. ప్రభుత్వం అంటే ఆదర్శ యజమాని అని, ఈ రాజ్యాంగ విధిని మరచిపోకూడదని తెలిపింది. హిమాచల్ ప్రదేశ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఓ మహిళకు జన్మతః జన్యుపర లోపాలు ఉన్న కుమారుడు జన్మించాడు. దాంతో పుట్టినప్పటి నుంచే పలు ఆపరేషన్లు చేయాల్సి వచ్చింది. ఇందుకోసం ఆమె సెలవులు అన్నింటినీ వాడేశారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ ప్రకారం ఆమెకు చైల్డ్ కేర్ లీవ్స్ (సీసీఎల్) ఇవ్వాల్సి ఉండగా సంబంధిత అధికారులు నిరాకరించారు. దాంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి. పార్దీవాలాల ధర్మాసనం విచారణ జరిపింది. ఇలాంటి సందర్భాల్లో సీసీఎల్‌లు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించింది. సెలవులు నిరాకరిస్తే ఆమె ఉద్యోగాన్ని విడిచిపెట్టాల్సిన పరిస్థితి వస్తుందని, అలాంటప్పుడు మరిన్ని సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని అభిప్రాయపడింది. దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకోవడానికి హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. మహిళా-శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శులు సభ్యులుగా ఉండాలని సూచించింది. జులై 31లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఈ కేసులో కేంద్ర ప్రభుతాన్ని పార్టీగా చేర్చాలని సూచించింది. విచారణలో కోర్టుకు సహకరించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యభాటిని కోరింది.

విమానాల్లో పిల్లలకు తల్లిదండ్రుల పక్కనే సీటు!

- విమానయాన సంస్థలకు డీజీసీఏ ఆదేశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: విమానాల్లో పిల్లలకు తల్లిదండ్రుల పక్కనే సీటు కేటాయించాలని విమానయాన సంస్థలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ఆదేశాలిచ్చింది. 12 ఏళ్ల లోపు పిల్లలకు అదే పీఎన్ఆర్ నంబరుపై ప్రయాణించే వారి తల్లిదండ్రులు/సంరక్షకుల్లో కనీసం ఒకరి పక్కనైనా సీటు కేటాయించాలని సూచించింది. ఇందుకు సంబంధించి రికార్డులు కూడా నమోదు చేయాలని ఆదేశించింది. పిల్లలకు తల్లిదండ్రులు/ సంరక్షకుల పక్కన సీటు ఇవ్వకపోవడంపై పలు ఫిర్యాదుల వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీజీసీఏ వెల్లడించింది. అలాగే '2024 ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్క్యులర్-01'ను సవరించినట్లు తెలిపింది. దాని ప్రకారం విమానయాన సంస్థలకు జీరో బ్యాగేజీ, సీట్ల ప్రాధాన్యం, భోజనం/ స్నాక్స్ /పానియాలు వంటి సేవలపై రుసుము వసూలు చేసుకునే అవకాశం కల్పించింది.





స్పీకర్ ప్రచారం చేస్తున్నారు...: ఈసీకి బీజేపీ ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని అసెంబ్లీ స్పీకర్ హోదాలో ఉన్న గడ్డంప్రసాద్ ప్రచారం చేస్తున్నారని, ఇది నిబంధనలకు విరుద్ధమని బీజేపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీజేపీ నేతలు ప్రేమేందర్‌రెడ్డి, కె.మాధవి, ఆర్.వి.పవన్‌లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) వికాస్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ప్రేమేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... స్పీకర్ గడ్డం ప్రసాద్ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని, రంజిత్‌రెడ్డికి ఓటు వేయాలని ప్రచారం చేశారని పేర్కొన్నారు. స్పీకర్ ప్రచారం చేసిన ఆడియో, వీడియో రికార్డులను, ఫోటోను సీఈవోకు అందించినట్లు తెలిపారు.

తెలంగాణలో ప్రచారానికి తమిళి 'సై'

- నిన్న గవర్నర్.. నేడు బీజేపీ స్టార్ క్యాంపెయినర్
- తమిళిసై సహా 40 మంది నేతలతో బీజేపీ జాబితా



హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నిన్నటి దాకా రాష్ట్ర గవర్నర్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన తమిళి సై సౌందర రాజన్.. ఇప్పుడు బీజేపీ స్టార్ క్యాంపెయినర్‌గా రాష్ట్రంలో ప్రచారం చేయబోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరిని పలు సందర్భాల్లో తప్పుబట్టి రాష్ట్ర రాజకీయాల్లో సంచలనాలు సృష్టించిన ఆమె.. ఇప్పుడు కొత్త పాత్రలో తెలంగాణలో అడుగుపెట్టబోతున్నారు. ఇక్కడ గవర్నర్‌గా పనిచేసిన కాలంలో తెలుగు భాష కూడా కొద్దికొద్దిగా నేర్చుకున్న తమిళిసై.. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలపై ఎలాంటి విమర్శలు చేయబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది. తమిళనాట ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు ఉన్న తమిళిసై.. ఇక్కడ గవర్నర్‌గా పనిచేసిన కాలంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి పలు సందర్భాల్లో మింగుడుపడని నిర్ణయాలు తీసుకున్నారు. మార్చి 24న ఆమె గవర్నర్ పదవికి రాజీనామా చేసి తమిళనాడులో ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగిన సంగతి విదితమే. తమిళనాడులో ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో తమిళిసైకి పార్టీ జాతీయ నాయకత్వం తెలంగాణలో ఎన్నికల ప్రచార బాధ్యతలు అప్పగించింది.

బీజేపీ స్టార్ క్యాంపెయినర్లు వీరే..

ప్రధాని మోదీ, జేపీ నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, శివప్రకాశ్, సునీల్ బన్సల్, అభయ్ పాటిల్, కిషన్‌రెడ్డి, చంద్రశేఖర్, నిర్మలా సీతారామన్, అర్జున్ ముండా, ఎల్.మురుగన్, యోగి ఆదిత్యనాథ్, డాక్టర్ మోహన్‌యాదవ్, భజన్‌లాల్ శర్మ, ప్రమోద్ సావంత్, దేవేంద్ర ఫడణవీస్, లక్ష్మణ్, బండి సంజయ్, డీకే అరుణ, పి.మురళీధర్‌రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఈటల రాజేందర్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఏవీఎన్ రెడ్డి, కె. అన్నామలై, తమిళి సై సౌందర రాజన్, తేజస్వి సూర్య, టి. రాజాసింగ్, జి. ప్రేమేందర్‌రెడ్డి, డి. ప్రదీప్‌కుమార్, బంగారు శృతి, కాసం వెంకటేశ్వర్లు, ఖుష్బూ సుందర్, రాధిక శరత్ కుమార్, జీవిత రాజశేఖర్.



కాంగ్రెస్ ఎన్నికల ప్రచార బ్రోచర్లను ప్రదర్శిస్తున్న తుమ్మల తదితరులు

నక్సల్స్ బెదిరించినా ఏజెన్సీ అభివృద్ధిని ఆపలేదు

- ల్యాండ్‌మైన్లు పేల్చినా వెనుకడుగు వేయలేదు: తుమ్మల

దుమ్ముగూడెం ఏప్రిల్ 23: మావోయిస్టులు ఒకట్రెండుసార్లు తనను చంపుతామని బెదిరించినా పలు దఫాలుగా మంత్రిగా పనిచేసిన తాను ఏ ఒక్కసారీ భద్రాచలం ఏజెన్సీ అభివృద్ధిని ఆపలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం గంగోలులో మంగళవారం మహబూబాద్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో వాజేడు నుంచి చింతూరు వరకు అడవుల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని, రసూల్‌లతో కలిసి తిరుగుతూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే క్రమంలో తనను అంతం చేసేందుకు మావోయిస్టులు రెండుమూడు సార్లు ల్యాండ్‌మైన్లు పెట్టినా అవి పేలలేదన్నారు. తనను చంపుతానని బెదిరించినా భయపడలేదన్నారు. ఏజెన్సీ అభివృద్ధి కోసమే వచ్చా తప్ప దోపిడీకోసం రాలేదని తాను ఆనాడే నిర్భయంగా మావోయిస్టులకు తెగేసి చెప్పానని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్‌ను గెలిపించేందుకు అన్ని పార్టీలతో పాటు మావోయిస్టులు కూడా సహకరించాలని కోరారు.



సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కేసీఆర్ ఇలాకాలో బీఆర్ఎస్‌కు మరో షాక్

- కాంగ్రెస్‌లో చేరిన డీసీసీబీ చైర్మన్

కొండపాక, ఏప్రిల్ 23: మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గమైన సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. నియోజకవర్గంలోని పలువురు నాయకులు బీఆర్ఎస్‌ను వీడి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. వారిలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఆయన భార్య సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షురాలు చిట్టి మాధురి, సిద్దిపేట జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు దుద్దెడ మాజీ సర్పంచ్ ఆరేపల్లి మహదేవ్‌గౌడ్‌లతోపాటు పలువురు మాజీ సర్పంచులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కేసీఆర్, హరీశ్‌లకు సన్నిహితంగా ఉన్న దేవేందర్‌రెడ్డి బీఆర్ఎస్ వీడడం నియోజకవర్గంలో పార్టీకి తీరని లోటు అని చెప్పవచ్చు.

కాంగ్రెస్ అభ్యర్థులకు బీ ఫారంల అందజేత

హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ అభ్యర్థులకు బీ ఫారాల అందజేత ప్రారంభమైంది. గాంధీభవన్‌లో మంగళవారం సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్, భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మెదక్ అభ్యర్థి నీలం మధు తమ బీఫారంలు అందుకున్నారు. ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి రోహిత్ చౌదరి తదితరుల చేతుల మీదుగా వారు బీ ఫారాలు అందుకున్నారు. అలాగే మిగిలిన అభ్యర్థుల తరఫున వారి ప్రతినిధులు బీ ఫారాలను అందుకున్నారు.

సికింద్రాబాద్‌లో గెలిచి రేవంత్‌కు గిఫ్ట్‌గా ఇస్తా: దానం

సికింద్రాబాద్ లోక్‌సభ సీటును గెలిచి సీఎం రేవంత్‌రెడ్డికి గిఫ్టుగా ఇస్తానని కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. తన టికెట్ కోసం ఆయన గట్టిగా ప్రయత్నం చేశారన్నారు. బుధవారం నామినేషన్ వేస్తానని తెలిపారు.

30న మెదక్ జిల్లాకు ప్రధాని మోదీ?

అల్లాదుర్గం, ఏప్రిల్ 23: ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ ఈ నెల 30న మెదక్ జిల్లాకు రానున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని అల్లాదుర్గంలో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. మండలంలోని ఐబీ చౌరస్తా వద్ద 30 ఎకరాల స్థలంలో సభను నిర్వహించాలని చూస్తోంది. మంగళవారం రాత్రి జహీరాబాద్ సిటింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, బీజేపీ శ్రేణులతో కలసి స్థలాన్ని పరిశీలించారు.

పోలీసు తనిఖీల్లో రూ.25.54 లక్షలు స్వాధీనం

ఆదిభట్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా చేపడుతున్న వాహనాల తనిఖీల్లో రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీసులు సోమవారం రాత్రి పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆదిభట్ల పరిధి బొంగుళూరులోని ఓఆర్ఆర్ 12వ ఎగ్జిట్ చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో... కారు(టీఎస్11 యూ డీ4478)లో తరలిస్తున్న రూ 25,54,285 నగదును పట్టుకున్నట్లు ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. పెద్ద మొత్తంలో డబ్బును తీసుకువెళ్తున్న నగరంలోని మలక్‌పేట్‌కు చెందిన మహమ్మద్ ఇక్బాల్(43), సంగారెడ్డి జిల్లా ఇటుకపల్లికి చెంది న కిందొడ్డి సునీల్‌కుమార్ (23)లను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. విచారణానంతరం తగిన చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.

బీఆర్ఎస్‌ను రద్దు చేస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేయలేదన్నారు. రెండుసార్లు చేసిన రుణమాఫీ మిత్తికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. పదేళ్ల ఏ హామీ అమలు చేయని కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో కోదండం వేయాల్సిన అవసరం ఉందన్నారు. తాగుబోతు అప్పుల సంసారంలాగా రూ.3,900 కోట్ల లోటు బడ్జెట్‌ను తనకు సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పుడు అప్పగించారని, బాధ్యతగా వ్యవహరిస్తూ నాలుగు నెలల్లో రూ. 26 వేల కోట్ల కిస్తీలు, మిత్తి చెల్లించానని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రతీ నెల మొదటి తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి రూ.1369 కోట్లు ఆర్టీసీకి చెల్లించామని వివరించారు. రూ.500లకు సిలిండర్ పథకం కింద రాష్ట్రంలో 40 లక్షల మంది మహిళలకు లబ్ది చేకూరుస్తున్నామని, 200 యూనిట్లలోపు ఉచిత కరెంటు పథకం కింద 44 లక్షల ఇళ్లలో వెలుగులు నింపుతున్నామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయకపోతే తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ. 22,500 కోట్లు కేటాయించి 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు.

రైతులపై ఒత్తిడి తెస్తే కఠిన చర్యలు!

రైతుల రుణాల వసూళ్ల కోసం డీసీసీబీ తదితర బ్యాంకులు రైతులపై ఒత్తిడి తెస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఏ అధికారి ఒత్తిడి చేసినా ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఆగస్టు 15వ తేదీలోపు రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న అసలు, మిత్తి నయా పైసలతో సహా చెల్లించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రైతుల నుంచి చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రూ.500 బోనస్‌గా ఇచ్చి మరీ ప్రతీ గింజను కొంటామని హామీ ఇచ్చారు. బీజేపీ పదేళ్లలో చేసిందేమీ లేక రోడ్డెక్కి గోడల మీద పోస్టర్లు వేస్తూ, మతాల మధ్య చిచ్చు పెడుతోందని ఆరోపించారు. దేవుడు గుడిలో ఉండాలి, భక్తి గుండెల్లో ఉండాలి కానీ, రెచ్చగొట్టే విధంగా ఉండకూడదన్నారు. హిందూయిజంలోనే పరమత సహనం ఉన్నదని, పీర్ల పండుగ హిందువులే ఎక్కువ చేసుకుంటారని, రంజాన్ దావత్‌లకు పోతరని, హిందువుల పండుగలకు ముస్లింలు వస్తారని, క్రిస్మస్‌కు క్రైస్తవుల ఇండ్లకు హిందూ ముస్లింలు వెళ్లి కేకులు తింటారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. అన్నదమ్ముల్లా కలిసి ఉన్న వారి మధ్య చిచ్చు పెడుతుంటే మోసపోవద్దని హితవు పలికారు. డీకే అరుణ మోదీ చేతిలో కత్తిగా మారి పాలమూరు కడుపులోనే పొడిచేందుకు యత్నిస్తున్నారని.. గద్వాలలో పార్టీ నిలబెట్టిన అభ్యర్థికి డిపాజిట్ తెచ్చుకోలేకపోయిన ఆమె మీద.. ముఖ్యమంత్రినైనా తనకు అసూయ ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలోని బావోజీని సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు.



తిమ్మారెడ్డిపల్లిలో లంబాడాల ఆరాధ్యదైవం శ్రీగురు లోకమాసంత్ (బావోజీ)ని దర్శించుకున్న సీఎం రేవంత్

ఎస్సీ వర్గీకరణకు కేసీఆర్ బద్ధ శత్రువు

దొరల దురహంకారానికి కేసీఆర్ నిలువెత్తు నిదర్శనమని, ఎస్సీ వర్గీకరణకు ఆయన బద్ధశత్రువు అని రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా మంగళవారం నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. తాను, సంపత్‌కుమార్ ఎమ్మెల్యేలుగా ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు.. వర్గీకరణ కోసం అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తానని నాడు కేసీఆర్ చెప్పారని, కానీ పదేళ్లు అధికారంలో ఉన్నా ఎందుకు ఆ పని చేయలేదని పశ్నించారు. నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై విమర్శలు గుప్పిస్తూ.. కేసీఆర్ హయాంలో దళితులకు అన్యాయం జరిగిందని ఉన్నత ఉద్యోగానికి రాజీనామా చేసిన ప్రవీణ్‌కుమార్‌కు అప్పట్లో తాము అందరం బాసటగా నిలిచామన్నారు. బహుజన సమాజం కోసం దొరల గడీలను బద్దలు కొడతానని చెప్పిన ఆయన కేసీఆర్ గూటికి ఎందుకు చేరారని ప్రశ్నించారు. నిజంగా ఆయన లక్ష్యం నెరవేర్చుకోవాలనుకుంటే కాంగ్రెస్ ప్రత్యామ్నాయ వేదికగా ఉన్నప్పటికీ ఎందుకు కేసీఆర్ పంచన చేరారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా ప్రవీణ్‌కుమార్‌ను నియమించి నిరుద్యోగులకు మేలు చేద్దామని నిర్ణయించామని, కానీ, ఆయన అందుకు సిద్ధపడకపోగా బీఆర్ఎస్‌లో చేరడాన్ని తెలంగాణ సమాజం హర్షించడం లేదని సీఎం చెప్పారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ రోజుకు ఒక టీఎంసీకి కుదించారని, కాంగ్రెస్ ప్రభుత్వం 2 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయించి వ్యవసాయ రంగంపై నిబద్ధతను చాటుకుంటుందన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక స్థానాల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే కేసీఆర్ మోదీకి దాసోహమయ్యారని.. ఈసారి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే మళ్లీ ఆ పరిస్థితి పునరావృతమవుతుందని చెప్పారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, మేఘారెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి తదితరులు ఈ సభలో పాల్గొన్నారు.



కేసీఆర్ మోకాళ్ల యాత్ర చేసినా.. బీఆర్ఎస్ అభ్యర్థులకు డిపాజిట్లు దక్కవు

- నేను పిలిస్తే 25మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు: మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్ర కాదు కదా.. మోకాళ్ల యాత్ర చేసినా నల్లగొండ, భువనగిరి ఎంపీ సీట్లలో బీఆర్ఎస్ అభ్యర్థులకు డిపాజిట్లు దక్కవు. రాష్ట్రంలో 15ఎంపీ సీట్లను కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుంది. బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా వస్తుందో, రాదో తెలియదు. రాష్ట్రంలో బీఆర్ఎస్ శకం ముగిసింది' అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాలను ఏపీ రాష్ట్ర సీఎం జగన్మోహన్ రెడ్డికి అప్పగించి నాగార్జునసాగర్ ప్రాజెక్టును ఎండబెట్టిన కేసీఆర్ ఇప్పుడు ఏ మొఖం పెట్టుకొని నల్లగొండ జిల్లాలో బస్సు యాత్ర చేపడుతున్నారని నిలదీశారు. ప్రస్తుత కరువుకు పదేళ్ల కేసీఆర్ పాలనా వైఫల్యమే కారణమని దుయ్యబట్టారు. పదేళ్ల పాలనలో రైతులకు నీరందించే ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టులను పట్టించుకోలేదని ఆరోపించారు. తాను పిలిస్తే 25మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తామంతా ఒక జట్టుగా ఉన్నామని, రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి తనను విమర్శించే స్థాయి లేదని, అధికారంలోకి రాకమునుపు ఆయన స్థాయి ఏంటో, ఇప్పుడు రూ.5వేల కోట్ల ఆస్తి ఎలా సంపాదించారో అందరికీ తెలుసన్నారు. ప్రధాని మోదీ తన స్థాయికి తగ్గించుకుని మాట్లాడారని, మత ఘర్షణలు చెలరేగేలా వ్యాఖ్యానించడం దురదృష్టకరమన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రాబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

పాక్‌ను ఓడించిన ఘనత ఇందిరమ్మది

ఆమె అపరకాళి అని సభలో వాజ్‌పేయీ పొగిడారు.. స్వాతంత్ర్య ఉద్యమంలో ఇందిర ఆరేళ్లు జైల్లో ఉన్నారు

- దేశం కోసం జైలుకెళ్లిన చరిత్ర బీజేపీ నేతలకు ఉందా..?
- నాడు ఇందిరమ్మ పెట్టిన పరిశ్రమలను నేడు అమ్మేస్తున్న నరేంద్ర మోదీ
- బజరంగ్ దళ్ పాటలకు దుంకుడు కాదు.. నేటి యువత ఈ చరిత్రను తెలుసుకోవాలి
- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌తో యుద్ధం చేసి గెలిచిన చరిత్ర.. ఆ దేశం నుంచి బంగ్లాదేశ్‌కు విముక్తి కల్పించిన ఘనత మాజీ ప్రధాని ఇందిరా గాంధీకే దక్కుతుందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. నిబద్ధత కలిగిన రాజకీయ నేత వాజ్‌పేయీ.. నిండు పార్లమెంటులో ఇందిరను అపరకాళితో పోల్చారని గుర్తు చేశారు. ఇప్పటి ప్రధాని మోదీ.. పుల్వామాలో జవాన్లపై దాడి జరిగితే నిద్రలో ఉన్నారని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ ఇందిరమ్మ ఆరేళ్ల పాటు జైలు జీవితం అనుభవించారని చెప్పారు. ఆమెలా దేశం కోసం జైలు జీవితాన్ని గడిపిన చరిత్ర మోదీ, అమిత్‌షా, బీజేపీ నేతలకు ఉందా..? అని నిలదీశారు. అమిత్‌షా జైలుకు ఎందుకు వెళ్లారో అందరికీ తెలుసన్నారు. ఇక కేసీఆర్ జైలులో ఒక్క రోజు కూడా ఉండలేక పోయారని.. కాళ్లు చేతులు కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. "ఈ దేశానికి అన్నీ చేసిన రాహుల్‌గాంధీ కుటుంబాన్ని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు నిందిస్తున్నారు. దేశానికి కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందనీ మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ ఏం చేసిందనే మాట కేసీఆర్ కుటుంబానికి ఊత పదమైపోయింది. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు కాబట్టే కేసీఆర్ సీఎం అయ్యారు. ఆయన కుటుంబం అంతా సెట్ అయ్యింది. రాష్ట్రం సమైక్యంగానే ఉంటే.. ఉమ్మడి రాష్ట్రానికి కేసీఆర్ సీఎం అయ్యుండేవారా..?" అని జగ్గారెడ్డి నిలదీశారు.


అభివృద్ధి ప్రదాత ఇందిరమ్మనే..

దళిత, గిరిజనులకు భూములు పంచిన చరిత్ర ఇందిరమ్మదని గుర్తు చేశారు. ఇప్పటికీ ఇందిరమ్మ ఇచ్చిన భూములపైనే వారు ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. మోదీ, కేసీఆర్ ఒక్క ఇంచు భూమైనా దళిత గిరిజనులకు ఇచ్చారా..? అని ప్రశ్నించారు. ఒకప్పుడు సామాన్యులకు బ్యాంకుల్లో రుణాలు దొరికేవి కావని చెప్పారు. బ్యాంకులను జాతీయం చేసి సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత ఇందిరమ్మదని అన్నారు. ఈనాడు ప్రతి ఊరిలో బ్యాంకులు ఉన్నాయంటే దానికి ఇందిరమ్మనే కారణమని తెలిపారు. రోటీ, కప్డా, మకాన్ నినాదంతో ప్రతి పేద ఇంటికీ ఇందిరమ్మ పేరు వెళ్లిందని తెలిపారు. బీహెచ్ఈఎల్, ఐడీపీఎల్, హెచ్ఏఎల్, హెచ్ఎంటీ, బీడీఎల్, హెచ్‌సీఎల్, సీఎస్ఐఆర్, ఈసీఐఎల్, డీఆర్‌డీఎల్ వంటి సంస్థలను తీసుకువచ్చింది ఇందిరా గాంధీనేనని పేర్కొన్నారు. బజరంగ్ దళ్ పాటలకు దుంకుడు కాదని.. ఇప్పుడున్న యువత ఇందిర చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. ఇలాంటి చరిత్ర బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లకు ఉందా..? అని ప్రశ్నించారు. దేశ ప్రజలు బతకడం కోసం సంజీవని లాంటి పరిశ్రమలను ఆనాడు ఇందిరాగాంధీ పెడితే.. ఈనాటి ప్రధాని మోదీ వాటిని అమ్మకానికి పెట్టారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని, విశాఖ స్టీల్ ప్లాంట్‌నూ అమ్మేశారని మండిపడ్డారు. జనం ఇలాంటి వాటిని ప్రశ్నించకపోవడం కూడా తప్పేనని అన్నారు. కేసీఆర్ కూడా ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకుడేనని జగ్గారెడ్డి గుర్తు చేశారు.

కారు నేత.. బస్సు యాత్ర

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేటి నుంచి మే 10 వరకు కేసీఆర్ పర్యటన

- ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోనూ ఒకటి, రెండు అసెంబ్లీ సెగ్మెంట్లకు వెళ్లేలా ప్లాన్
- మొత్తం 17 రోజుల యాత్రలో 21 రోడ్‌షోలు
- మధ్యాహ్నం మిర్యాలగూడకు.. అక్కడ రోడ్ షో
- రాత్రికి సూర్యాపేటలో రోడ్ షో.. రాత్రికి అక్కడే బస
- మే 10న సిరిసిల్ల, సిద్దిపేటలో రోడ్‌షోలతో ముగింపు



హైదరాబాద్, నల్లగొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి బస్సు యాత్ర చేపట్టనున్నారు. ఈ యాత్ర 17 రోజులపాటు సాగి మే 10న సిద్దిపేటలో ముగియనుంది. ప్రతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో.. ఒకటి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేసుకుంటూ 21 రోడ్ షోలు నిర్వహించే విధంగా ఈ యాత్రకు ప్రణాళిక రచించారు. ఇందులో భాగంగా బుధవారం కేసీఆర్ తెలంగాణ భవన్‌కు చేరుకుని.. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం ఆయన పార్టీ నేతలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత బయలుదేరి మిర్యాలగూడకు చేరుకుని.. సాయంత్రం 5.30 గంటలకు అక్కడ తొలి రోడ్డు షోలో పాల్గొంటారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల గురించి.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే పార్లమెంటులో తెలంగాణ గళం వినిపించగలుగుతామనే అంశాన్ని.. ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం.

ఇదీ షెడ్యూలు..

బీఆర్ఎస్ నేతలు విడుదల చేసిన బస్సు యాత్ర మొదటిరోజు రూట్ మ్యాప్ ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నుంచి బయలుదేరే కేసీఆర్ వాహనశ్రేణి ఉప్పల్, ఎల్బీనగర్, చౌటుప్పల్, నకిరేకల్ క్రాస్ రోడ్డు, నల్లగొండ బైపాస్, మాడ్గులపల్లి మీదుగా సాయంత్రం 4.30 గంటలకు మిర్యాలగూడకు (145 కిలోమీటర్లు) చేరుకుంటుంది. మిర్యాలగూడలోని సాగర్‌రోడ్డు ఫ్లైఓవర్ వద్ద నుంచి రాజీవ్ గాంధీ చౌరస్తా వరకూ నిర్వహించే రోడ్‌షోలో కేసీఆర్ పాల్గొంటారు. 5.30కు అక్కడ బస్సు పైనుంచే ప్రసంగిస్తారు. 6.30గంటలకు అక్కణ్నుంచీ బయలుదేరి వేములపల్లి, మాడ్గులపల్లి, తిప్పర్తి, నకిరేకల్ బైపాస్ రోడ్డు, కేతేపల్లి మీదుగా సూర్యాపేటకు (39 కిలోమీటర్లు) చేరుకుంటారు. సూర్యాపేటలో రోడ్‌షో నిర్వహించి, అనంతరం ప్రసంగిస్తారు. రాత్రికి సూర్యాపేటలో బస చేస్తారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలవరకు సూర్యాపేటలోనే.. పార్టీ శ్రేణులకు, నేతలకు అందుబాటులో ఉంటారు. ఆ తర్వాత అక్కణ్నుంచీ బయలుదేరి భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బస్సుయాత్ర చేపడతారు. గురువారం రాత్రి 7.30 గంటలకు భువనగిరిలో ప్రసంగించి.. అక్కణ్నుంచి ఎర్రవెల్లిలోని తన వ్యవసాయక్షేత్రానికి వెళతారు. సూర్యాపేట నుంచి భువనగిరికి వెళ్లేందుకు పార్టీ నేతలు రెండు మార్గాలు సూచించారు. ఒకటి.. నకిరేకల్, చిట్యాల, రామన్నపేట మీదుగా వెళ్లే రూట్. మరొకటి అర్వపల్లి, తిరుమలగిరి, మోత్కూరు, ఆత్మకూరు, రాయగిరి మీదుగా వెళ్లే మార్గం. వీటిలో ఏ మార్గంలో వెళ్లేదీ కేసీఆర్ ఇంకా ఖరారు చేయలేదు. కాగా.. 26న మహబూబ్‌నగర్‌లో, 27న నాగర్‌కర్నూల్‌లో, 28న వరంగల్‌లో, 29న ఖమ్మంలో, 30న తల్లాడలో ఆ తర్వాత కొత్తగూడెంలో కేసీఆర్ రోడ్ షోలు నిర్వహించనున్నారు. అదే విధంగా మే 1న మహబూబాబాద్‌లో, 2న జమ్మికుంటలో, 3న రామగుండంలో, 4న మంచిర్యాలలో, 5న జగిత్యాలలో, 6న నిజామాబాద్‌లో, 7న కామారెడ్డిలో, మెదక్‌లో, 8న నర్సాపూర్, పటాన్‌చెరులో, 9న కరీంనగర్‌లో, చివరి రోజు.. మే 10న సాయం త్రం 5 గంటలకు సిరిసిల్లలో, 6.30 గంటలకు సిద్దిపేటలో కేసీఆర్ రోడ్ షోలు నిర్వహించనున్నారు.



భువనగిరి కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, పక్కన కేంద్రమంత్రి జైశంకర్, బీజేపీ నాయకులు కే లక్ష్మణ్

బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యం

- లోక్‌సభ ఎన్నికలతో ముడిపడ్డ దేశ భవిష్యత్
- భువనగిరి రోడ్‌షోలో కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్
- ప్రపంచం మెచ్చిన నాయకుడు మోదీ: డాక్టర్ కే. లక్ష్మణ్

యాదాద్రి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని, దేశ భవిష్యత్ ఈ ఎన్నికలతో ముడిపడి ఉందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ అన్నారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో కేంద్ర మంత్రి పాల్గొని, మాట్లాడారు. వెనుకబడ్డ భారత్‌ను మోదీ పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశారని, అభివృద్ధి, సంక్షేమం అన్నివర్గాలకు అందిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీతో పాటు మరెన్నో ప్రజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భూదాన్‌పోచంపల్లి ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిందని, జీ 20 సమావేశాలకు హాజరైన ప్రతినిధులకు పోచంపల్లి పట్టు వస్త్రాలు బహుమానంగా అందజేశామని గుర్తుచేశారు. భువనగిరి ఖిల్లాపై కాషాయజెండా ఎగరవేస్తామని, ప్రపంచం మెచ్చిన నాయకుడు మోదీ అని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్ అన్నారు. మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్ కొమ్ముకాస్తోందని ఆరోపించారు. ప్రజలు ఓటు అనే ఆయుధంతో సీఎం రేవంత్‌రెడ్డికి కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు మోదీ పూర్తి మద్దతు ఇస్తున్నారని చెప్పారు. వైద్యుడిగా ప్రజలకు సేవ చేస్తున్న బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అబ్ కీ బార్?



నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఎవరికీ పూర్తి మెజారిటీ ఇవ్వలేదు! ఇక్కడి ఏడు సెగ్మెంట్లలో మూడింట బీఆర్ఎస్ గెలిస్తే.. కాంగ్రెస్, బీజేపీ రెండేసి చొప్పున పంచుకున్నాయి! పార్లమెంటు ఎన్నికల్లో ఇప్పుడు మూడు పార్టీలూ హోరాహోరీ తలపడుతున్నాయి! ప్రతిసారీ విలక్షణ తీర్పునిచ్చే ఇందూరు ఓటర్లు ఈసారి ఎవరిని ఆదరిస్తారో!?

ఇందూరు ఏ దరికో!?

మూడు పార్టీల మధ్య హోరాహోరీ.. ముగ్గురు ఉద్దండుల మధ్య రసవత్తర పోరు

పురుషులు	మహిళలు	ఇతరులు
8,04,568	8,96,915	90

మొత్తం ఓటర్లు 17,01,573

మళ్లీ గెలిచి సత్తా చూపాలని అరవింద్

పార్లమెంటులో కాలు మోపాలని జీవన్ రెడ్డి, గోవర్ధన్

లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ లభించని మెజారిటీ

ప్రతిసారీ విలక్షణ తీర్పునిచ్చే ఓటర్ల మొగ్గు ఎవరికో!?

రైతులు, మహిళలు, బీడీ, గల్ఫ్ కార్మికులే కీలకం









నిజామాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఈసారి హోరాహోరీ సమరం సాగుతోంది. మూడు ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులూ అనేక ఎన్నికల ఆరితేరిన ఉద్దండులే! వీరిలో ఒకరు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న జీవన్ రెడ్డి. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ఆయన ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. రెండుసార్లు మంత్రిగా పని చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగానూ కొనసాగుతున్నారు. ఇక, పోలీస్ పటేల్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కూడా 40 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారు. సర్పంచ్ నుంచి ఆర్టీసీ చైర్మన్ వరకు పదవులను చేపట్టడమే కాదు.. నాలుగు సార్లు ఎమ్మెల్యేగానూ పని చేశారు. ఇక, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ సిటింగ్ ఎంపీ! సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటు రెండు దఫాలు పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా పని చేసిన డీఎస్ తనయుడు! ముగ్గురూ ఉద్దండులే కావడంతో ఇక్కడ ఈసారి త్రిముఖ పోటీ నెలకొంది. ముగ్గురికీ రాజకీయ పరపతి ఉండడం, ఆయా సామాజిక వర్గాల మద్దతు ఉండడంతో పోటీ రసవత్తరంగా సాగుతోంది.

నియోజకవర్గంలో రైతుల తర్వాత గల్ఫ్, బీడీ కార్మిక కుటుంబాలు ఎక్కువ. పార్లమెంట్ పరిధిలోని అన్ని సెగ్మెంట్లలో వీరు ఉన్నారు. ఉపాధి కోసం భర్తలు గల్ఫ్ దేశాలకు వెళ్లగా.. భార్యలు బీడీలపై ఆధారపడి పని చేస్తున్నారు. బీడీ, గల్ఫ్ కుటుంబాల ఓటర్లు ఐదున్నర లక్షల వరకూ ఉంటారు. వీరు తీసుకునే నిర్ణయం ఎన్నికల్లో కీలకం కానుంది. అందుకే, అన్ని పార్టీలూ వారిని ఆకర్షించేందుకు పావులు కదుపుతున్నాయి. ఇప్పటికే సీఎం రేవంత్

గల్ఫ్, బీడీ కార్మికులు కీలకం

రెడ్డి పది రోజుల క్రితం గల్ఫ్ సంఘాలతో హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. వారికిచ్చిన హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు పునరావాసం కల్పిస్తామని, గల్ఫ్‌లో చనిపోయిన కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని తెలిపారు. ఇక, పదేళ్లలో వారికి తమ సర్కారు చేసిన సంక్షేమ కార్యక్రమాలే తమకు ఓట్లు కురిపిస్తాయని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. గత ఎన్నికల తరహాలోనే ఈసారి కూడా వారి మద్దతు తమకేనని బీజేపీ అంచనా వేసుకుంటోంది. అలాగే, నిజామాబాద్ పార్లమెంటు పరిధిలో మైనారిటీ ఓటర్లూ కీలకమే. ఇక్కడి పట్టణ ప్రాంతాల్లో మూడు లక్షల వరకూ మైనారిటీ ఓటర్లు ఉన్నారు. వీరి ఓట్లు గంపగుత్తగా తమకే పడతాయని కాంగ్రెస్ భావిస్తుండగా.. సగానికి సగం ఓట్లు తమకూ వస్తాయని బీఆర్ఎస్ నేతలు అంచనా వేసుకుంటున్నారు. వారి ఓట్ల చీలిక తమకు లాభిస్తుందనే ఆశల పల్లకిలో బీజేపీ ఉంది. అలాగే, నియోజకవర్గంలో మున్నూరు కాపు, పద్మశాలి సామాజికవర్గ ఓటర్లు కూడా ఎక్కువే. బరిలో ఉన్న సిటింగ్ ఎంపీ అర్వింద్, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ఇద్దరూ మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందినవారే. గత ఎన్నికల్లో వీరి ఓట్లు గంపగుత్తగా అర్వింద్‌కు పడగా.. ఈదఫా ఇద్దరూ చీల్చుకునే అవకాశం ఉంది. పద్మశాలి ఓట్లన్నీ తమకే పడతాయని బీజేపీ అంచనా వేసుకుంటోంది. ఇక, ప్రతి ఎన్నికలో ఇక్కడ నిజాంషుగర్ ఫ్యాక్టరీ ఎజెండాగా మారుతోంది. ఈ ఎన్నికలో కూడా అదే పరిస్థితి. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే సెప్టెంబరు 17 నాటికి ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని సీఎం రేవంత్ రెడ్డితో సహా నేతలు హామీలు ఇస్తున్నారు. చెరుకు రైతుల మద్దతును కూడగట్టే ప్రయత్నాలను చేస్తున్నారు. తనను గెలిపించగానే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఫ్యాక్టరీని తెరిపించేందుకు చర్యలు తీసుకుంటానని బీజేపీ అభ్యర్థి అర్వింద్‌తోపాటు పార్టీ నేతలు హామీలు ఇస్తున్నారు. రైతులను మోసం చేసేందుకే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఈ ప్రకటనలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరగగా.. 11 సార్లు కాంగ్రెస్, మూడు దఫాలు టీడీపీ, ఒక్కోసారి బీఆర్ఎస్, బీజేపీ, స్వతంత్ర్య అభ్యర్థి విజయం సాధించారు. ఈసారి ఇందూరు ఎవరిని ఆదరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.




ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

పార్టీ	సెగ్మెంట్లు
బీఆర్ఎస్	బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల
బీజేపీ	నిజామాబాద్ అర్బన్, ఆర్మూరు
కాంగ్రెస్	నిజామాబాద్ రూరల్, బోధన్


గ్రామీణ ప్రాంతాలే అధికం

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో గ్రామీణ ప్రాంతాలే ఎక్కువ. ఇక్కడ నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలోనే నిజామాబాద్ కార్పొరేషన్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల మున్సిపాలిటీలు ఉన్నాయి. రైతులు, బీడీ కార్మికులు, గల్ఫ్ కార్మికులు ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గం ప్రతిసారీ విలక్షణ తీర్పునే ఇస్తోంది. రైతులే ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో వారు ఎటు మొగ్గితే వారే విజయాన్ని సాధిస్తున్నారు. అర్బన్ నియోజకవర్గం మినహా మిగతా ఆరు నియోజకవర్గాల్లో రైతులే అత్యధికంగా ఉన్నారు. ప్రధానంగా వరి, చెరుకు, పసుపు, మొక్కజొన్న, ఎర్రజొన్నలు పండిస్తారు. ప్రతీ ఎన్నికలో రైతులు తీసుకునే నిర్ణయాలే అభ్యర్థుల గెలుపు, ఓటములను నిర్ణయిస్తున్నాయి. గత ఎన్నికల సరళిని పరిశీలిస్తే.. ఎర్రజొన్న రైతుల ఆందోళన తర్వాత వచ్చిన ప్రత్యేక రాష్ట్రంలోని పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి కవితను గెలిపించారు. అప్పటి వరకు ప్రాతినిధ్యం వహించిన మధుయాష్కీ గౌడ్‌ను ఓడించారు. ఎంపీ హోదాలో కవిత ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, పసుపు బోర్డు తీసుకురాకపోవడంతో రైతులే 2019లో పోటీగా నామినేషన్లు వేశారు. పార్లమెంట్ చరిత్రలోనే ఏకంగా 186 మంది పోటీ పడ్డారు. ఆ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థిగా ఉన్న కవితను ఓడించడంతోపాటు పసుపు బోర్డు తీసుకు వస్తామన్న బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌కు పట్టం కట్టారు. ఐదేళ్ల తర్వాత పసుపు బోర్డు ప్రకటించి జీవో జారీ చేసినా.. దానిని ఎక్కడ పెడతారో ఇంకా స్పష్టం చేయకపోవడంతో ఈసారి వారు తీసుకునే నిర్ణయమే కీలకంగా మారనుంది.


ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?



2019 ఎన్నికల్లో ఇలా..



2014 ఎన్నికల్లో ఇలా..



ఎన్నికల్లో ఓట్లు వేయం



వీరంతా.. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాజారం గ్రామస్థులు! వర్షం వస్తే రాకపోకలు ఉండవు. రోడ్డు లేదు. బస్సు రాదు. అంబులెన్స్ రాలేదు. తలాపునే రెండు నదులున్నా తాగునీరు లేదు. ఎన్నో విజ్ఞప్తులు చేసినా పరిష్కారం కాలేదు. అందుకే, ఈసారి ఎన్నికల్లో ఓటు వేయకూడదని ఇక్కడి ఓటర్లు నిర్ణయించారు. ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు గ్రామస్థులు ప్రకటించారు. - కోటపల్లి

'చిల్లర' నామినేషన్



కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థి పేరాల మానసరెడ్డి మంగళవారం చిల్లర నాణేలతో నామినేషన్ వేశారు. తాను పోగు చేసిన రూ.25 వేల నాణేలను గంపలో తీసుకొచ్చారు. - సుభాష్‌నగర్ (కరీంనగర్)

ప్రచారంలో జైశంకర్



ఈయన ఎవరో గుర్తు పట్టారా!? మన విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్. కాషాయ టోపీ ధరించి భువనగిరి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. చిత్రంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీ అభ్యర్థి నర్సయ్యగౌడ్ - యాదాద్రి, ఆంధ్రజ్యోతి

'మోదీ గ్యారెంటీ' బ్రహ్మాస్త్రం

(మొదటి పేజీ తరువాయి)

రోడ్ షోనా? ఐదూ సభలా? అన్నది రాష్ట్ర పార్టీ నాయకత్వం సమీక్షిస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ వంటి అగ్ర నేతలు 21 సభల్లో పాల్గొననున్నారు. వీటిని ఎక్కడెక్కడ నిర్వహించాలన్నదానిపై కసరత్తు జరుగుతోంది. మరోవైపు దక్షిణాదిన కర్ణాటకలో ఇప్పటికే బలంగా ఉన్నందున, తెలంగాణలోనూ ఆ స్థాయికి చేరుకోవడానికి లోక్‌సభ ఎన్నికలను కీలక మలుపు అని బీజేపీ అంచనా వేస్తోంది. ఈసారి వచ్చే ఫలితాలు అసెంబ్లీ ఎన్నికల నాటికి మరో మెట్టు ఎక్కేందుకు దోహదపడతాయని భావిస్తోంది. మెజారిటీ ఎంపీ స్థానాలు కైవసం చేసుకోవడం ద్వారా కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదుగుదామన్న యోచనలో ఉన్న కమలం పార్టీ.., ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు అనూహ్యంగా మారే అవకాశం ఉందని ఊహిస్తోంది.

బలం పెరగడంతో.. బలమైన అభ్యర్థులతో

తెలంగాణ ఖాయమైన 2014లో జరిగిన ఎన్నికల్లో బీజేపీకి 7.1 శాతం ఓట్లే వచ్చాయి. అయితే, ఇటీవలి ఎన్నికల్లో 8 స్థానాల్లో గెలిచింది. పది పైగా సీట్లలో ద్వితీయ స్థానంలో నిలిచింది. దాదాపు 14 శాతం ఓట్లు వచ్చాయి. 2018తో పోలిస్తే ఇది రెట్టింపు కావడం గమనార్హం. దీంతో ప్రతి లోక్‌సభ స్థానంపైనా ప్రత్యేక దృష్టితో.. అభ్యర్థుల పరంగా చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించింది. వ్యతిరేకత వచ్చినా మల్కాజిగిరిలో మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు టికెట్ ఇచ్చి ఉద్దేశాన్ని చాటింది. మెదక్ వంటిచోట మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావును దింపింది. శానంపూడి సైదిరెడ్డి (నల్లగొండ), పోతుగంటి భరత్ (నాగర్‌కర్నూల్), ఆరూరి రమేశ్ (వరంగల్), సీతారాం నాయక్ (మహబూబాబాద్)లను బీఆర్ఎస్ నుంచి చేర్చుకుని టికెట్లిచ్చింది. వీరిలో భరత్ తండ్రి



రాములు నాగర్‌కర్నూల్ సిటింగ్ ఎంపీ. మిగతావారు ప్రజా ప్రతినిధులుగా అనుభవం ఉన్నవారే కావడం గమనార్హం. అన్నిటికిమించి ఎంఐఎం అధినేత ఒవైసీకి అడ్డుకట్ట వేసేలా హైదరాబాద్‌లో మాధవీలతను నిలపడం.. ఆమె ప్రచార తీరు సోషల్ మీడియాలో చర్చనీయం కావడం బీజేపీకి మేలు చేకూర్చే అంశమని విశ్లేషకులు చెబుతున్నారు.

కార్యాచరణపై ఎప్పటికప్పుడు సమీక్ష

కేంద్రంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసి తీరాలన్న పట్టుదలతో, తెలంగాణ నుంచి అత్యధిక సీట్లు గెలుచుకునేందుకు బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కనుమరుగవుతోందని.. బీఆర్ఎస్ ప్రజల నమ్మకం కోల్పోయిందని పేర్కొంటోంది. 2019 ఎన్నికల్లో అనూహ్యంగా 4 స్థానాలు (కరీంనగర్, సికింద్రాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్) గెలుచుకున్న ఆ పార్టీ, ఈసారి మల్కాజ్‌గిరి, చేవెళ్ల, మహబూబ్‌నగర్, జహీరాబాద్, భువనగిరి, వరంగల్, మెదక్‌లోనూ విజయం సాధిస్తామన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరింత కష్టపడితే ఖమ్మం, నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, హైదరాబాద్, పెద్దపల్లిలోనూ గెలుస్తామన్న ఆశాభావంతో ఉన్నారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర నాయకత్వానికి దిశా నిర్దేశం చేసిన అగ్ర నేతలు.. కార్యాచరణను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఇక కాంగ్రెస్ దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. మరీ మరీ విమర్శిస్తే సానుభూతి పెరిగే ప్రమాదం ఉండడంతో ప్రభుత్వం, రాష్ట్ర నాయకత్వాని కంటే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ వైఫల్యాలను లక్ష్యంగా చేసుకుంది.

మూడు దశల్లో ఇంటింటి ప్రచారం

జాతీయ అగ్ర నేతలు, రాష్ట్ర పార్టీ నాయకులతో భారీ బహిరంగ సభలు, రోడ్ షోలు, మేధావులు, వివిధ రంగాల నిపుణులతో సమావేశాలు, మరోవైపు స్థానిక కేడర్‌తో కలిసి ఇంటింటి ప్రచారం.. ఇలా మూడు దశల్లో బీజేపీ వ్యూహాన్ని రచించింది. నామినేషన్ల దాఖలు పూర్తయ్యే వరకు తొలి విడత ప్రచారం పూర్తిచేయనుంది. ఆ తర్వాత వారం పాటు రెండో దశలో కార్నర్ మీటింగ్‌లు, సభలు, పాదయాత్రలు నిర్వహిస్తారు. మూడో దశలో భారీ బహిరంగ సభలు ఉంటాయి. ఈ సభలను పోలింగ్‌కు ముందు రెండు, మూడు రోజులు ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఎస్సీ, ఎస్టీ, మహిళా, యువ మోర్చా వంటి అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు. 21 రోజుల కార్యాచరణలో మూడు రోజుల చొప్పున రెండుసార్లు ఇంటింటికీ వెళ్లాలి. నాలుగు రోజుల పాటు కార్నర్ మీటింగ్‌లు నిర్వహించాలి. మిగతా రోజుల్లో చిన్న సభల నుంచి భారీ సభలు, రోడ్ షోలు చేపడతారు.

ఖమ్మం బరిలో ప్రియాంక?

(మొదటి పేజీ తరువాయి)

పోటీ చేసినట్లవుతుంది. ప్రియాంకను కూడా ఇదే తరహాలో ఉత్తరాది, దక్షిణాదిల్లోని రెండు స్థానాల నుంచి బరిలో దింపాలని.. యూపీలోని రాయ్‌బరేలీ, ఖమ్మంల నుంచి ఆమెను పోటీ చేయించాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ రాహుల్ వయనాడ్‌కు మాత్రమే పరిమితమైతే.. ప్రియాంక యూపీలోని అమేఠీ, రాయ్‌బరేలీల్లో ఏదో ఒక స్థానం నుంచి పోటీ పడతారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. తద్వారా ఉత్తరాది నుంచి ప్రియాంక ప్రాతినిధ్యం వహిస్తే.. దక్షిణాది నుంచి రాహుల్ ప్రాతినిధ్యం ఉంటుందని పేర్కొన్నాయి.

ఢిల్లీలో తేలుతుందా?

ప్రియాంక పోటీ ప్రతిపాదన అటుంచితే.. ఖమ్మం సీటుపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ సీటు నుంచి పార్టీ టికెట్ కోసం రఘురామిరెడ్డి, రాయల నాగేశ్వర్‌రావు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. కాగా, ఖమ్మంతో పాటు కరీంనగర్, హైదరాబాద్ సీట్లనూ కాంగ్రెస్ పెండింగ్‌లోనే ఉంచింది. అయితే కరీంనగర్‌లో వెలిచాల రాజేశ్వర్‌రావు తరహాలోనే ఖమ్మంలో మంగళవారం రఘురామిరెడ్డి కూడా అధిష్ఠానం పేరు ప్రకటించనప్పటికీ నామినేషన్ దాఖలు చేశారు. మరోవైపు, మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేరళకు వెళ్లారు. ఓ పెళ్లి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వెళ్లారని చెబుతున్నా.. ఖమ్మం సీటు విషయమై ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిసేందుకే వెళ్లారన్న ప్రచారమూ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఇదిలా ఉంటే సమృద్ధ భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో బుధవారం జరగనున్న సామాజిక న్యాయ్ సమ్మేళన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాహుల్‌గాంధీతో పాటు భట్టివిక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ



చైర్మన్ మధుయాష్కీగౌడ్‌లను ఆహ్వానించారు. దీంట్లో పాల్గొనేందుకు భట్టివిక్రమార్క ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందని, అక్కడే ఖమ్మం సీటుపైన అధిష్ఠానం పెద్దలు తేల్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

రేపు మేడిగడ్డకు జస్టిస్ పీసీ ఘోష్

» ఆ తర్వాత అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సందర్శన

హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయవిచారణలో భాగంగా నేడు హైదరాబాద్‌కు రానున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్, గురువారం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సందర్శించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో హైదరాబాద్‌కు చేరుకున్నాక... బీఆర్‌కే భవన్‌లోని 8వ అంతస్థులో జ్యుడీషియల్ కమిషన్ కార్యాలయాన్ని పరిశీలించి, నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశం కానున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ నివేదికతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అందించిన నివేదికను, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) తొలి నివేదికను అధికారులు ఆయనకు ముందుంచి, ప్రాజెక్టు వైఫల్యాలను వివరించనున్నారు. ఆ మరుసటి రోజు 25వ తేదీన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు పరిశీలించి... 26, 27వ తేదీల్లో నీటిపారుదలశాఖ అధికారులతో మళ్లీ సమావేశం కానున్నారు. ఆ తర్వాత మూడు బ్యారేజీలతో సంబంధం ఉన్న దాదాపు 32 మంది అధికారులతో పాటు మూడు నిర్మాణ ఏజెన్సీలకు నోటీసులు లేదా సమన్లు జారీ చేసే అంశాన్ని పరిశీలించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్లానింగ్, డిజైన్, నిర్మాణ లోపాలు, కాంట్రాక్టుల అప్పగింత తదితర అంశాలపై న్యాయ విచారణ చేసి, జూన్ నెలాఖరుకల్లా నివేదికను అందజేయాలని జస్టిస్ పీసీ ఘోష్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.

పోలీసుల సరెండర్ బకాయిలు చెల్లించాలి

రాష్ట్రంలో 26 నెలలుగా పెండింగ్‌లో ఉన్న పోలీసుల సరెండర్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో పోలీసుకు సుమారు రూ.3 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉన్నాయని ఆయన తెలిపారు. టీఏ, డీఏ బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో ఆర్థిక సమస్యలతో పోలీసులు సతమతమవుతున్నారన్నారు. దాంతో జాప్యం లేకుండా వెంటనే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కూనంనేని కోరారు.

సాగర్ కుడి కాల్వ గేట్లు మూసేయండి: కృష్ణాబోర్డు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): త్రిసభ్య కమిటీ నిర్ణయం మేరకు మంగళవారం రాత్రి 8 గంటల కల్లా అనుమతించిన వాటా మేరకు నాగార్జున సాగర్ కుడికాల్వ నుంచి నీటిని తరలించారని, ఇక గేట్లను మూసివేయాలని కృష్ణాబోర్డు ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు బోర్డు సభ్యుడు డాక్టర్ ఆర్.ఎన్.శంఖువ మంగళవారం ఏపీ ఈఎన్‌సీకి లేఖ రాశారు. ఈనెల 12న జరిగిన త్రిసభ్య కమిటీ నిర్ణయం మేరకు కుడికాల్వ నుంచి ఏపీకి 5.50 టీఎంసీలు విడుదలకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. నిర్ణీత వాటా మేరకు నీళ్లు చేరినందున ఇక గేట్లను మూసివేయాలని సూచించారు.

ఆర్టీసీ కార్మికులకు బాండ్ బకాయిలు చెల్లించాలి

» రవాణా మంత్రికి ఆర్టీసీ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో కార్మికులకు 2013 పీఆర్‌సీకి సంబంధించిన బాండ్ బకాయిలు తక్షణం పూర్తిస్థాయిలో చెల్లింపులు జరపడానికి చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మంగళవారం లేఖ రాశారు. ఇప్పటి వరకు ఆర్టీసీలో పనిచేస్తున్న 27 వేల మంది కండక్టర్లు, గ్యారేజీ, క్లరికల్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్లకు బాండ్ బకాయిల చెల్లింపులు జరగలేదని ఆయన లేఖలో తెలిపారు. రవాణా మంత్రిగా చొరవ తీసుకుని బకాయి పడిన బాండ్ డబ్బుల తక్షణ చెల్లింపులకు చొరవ తీసుకోవాలని లేఖలో కోరారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో.. రూ.35 వేల కోట్ల భారీ అవినీతి

» సుప్రీంకోర్టులో ప్రశాంత్ భూషణ్ వాదనలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు తెలంగాణలోనే అతిపెద్ద స్కామ్ అని సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీం కోర్టులో వాదనలు వినిపించారు. ఈ ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం సుమారు రూ.35 వేల కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని, దీనిపై విచారణకు ఆదేశించాలని మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి 2019 మే 3న సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ బేలా త్రివేదిల ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. తొలుత.. నాగం జనార్దన్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర విచారణకు ఆదేశిస్తే, అవినీతికి సంబంధించిన నిజాలన్నీ బయటికి వస్తాయన్నారు. అయితే, తెలంగాణలో ప్రభుత్వం మారినందున తమకు మరికొంత సమయం కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. తదుపరి విచారణ జూలై 16కు వాయిదా పడింది.

25న సివిల్ సర్వీసెస్ విజేతలతో ముఖాముఖి

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ 2023 విజేతలతో ముఖాముఖి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్పైర్ 2024 పేరుతో ఈ కార్యక్రమాన్ని గురువారం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నామని, గౌరవ అతిథిగా రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ హాజరవుతున్నారని, విజేతలను ఆయన చేతుల మీదుగా సన్మానించనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

ఉచితాలు సరికాదు: వెంకయ్య నాయుడు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అధికారం కోసం కొన్ని పార్టీలు ఇష్టారీతిన ఉచిత హామీలు ఇస్తున్నాయని, ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసే హామీలివ్వడం సరికాదని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. ఇటీవల 'పద్మవిభూషణ్' అవార్డును అందుకున్న సందర్భంగా, మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకయ్యనాయుడు మాట్లాడారు. విద్య, వైద్యాన్ని ప్రభుత్వాలు ఉచితంగా అందివ్వాలన్నారు. ఖజానాపై పడే భారాన్ని అంచనా వేయకుండా హామీలివ్వడం.. తీరా అధికారంలోకి వచ్చాక వాటి అమలు కోసం నిధుల లేమితో అప్పులు చేయడం.. ఎంతవరకు సబబని ప్రశ్నించారు. నేతల వలసలపై మాట్లాడుతూ.. ఈ తరం నేతలు పార్టీలు మారడమే పనిగా పెట్టుకున్నారని, తనకు మాత్రం పార్టీ మారాలన్న ఆలోచన ఎప్పుడూ రాలేదని తెలిపారు.

మరో 1500 కోట్ల అప్పు తీసుకున్న తెలంగాణ

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.1500 కోట్ల అప్పు తీసుకుంది. ఆర్బీఐ మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా 7.48% వార్షిక వడ్డీ, 18 ఏళ్ల కాల పరిమితికి ఈ రుణాన్ని తీసుకుంది. ఏపీ ప్రభుత్వం రూ.3000 కోట్ల రుణం తీసుకుంది.

వీఎంఎస్ సిస్టమ్స్ డైరెక్టర్లకు చెందిన రూ.55.73 కోట్ల ఆస్తుల అటాచ్

» బ్యాంకు రుణం ఎగవేతపై ఈడీ చర్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలను ఎగ్గొట్టిన వీఎంసీ సిస్టమ్స్ లిమిటెడ్‌కు చెందిన రూ.55.73 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అటాచ్ చేశారు. ఆ కంపెనీ డైరెక్టర్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఎస్‌బీఐ, మరికొన్ని బ్యాంకుల నుంచి 2009-2012 మధ్యకాలంలో పలు దఫాల్లో రూ.1,673.52 కోట్ల రుణం తీసుకున్నారు. 2013నుంచి రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో.. 2018కల్లా బకాయిల మొత్తం రూ.1,745.45 కోట్లకు చేరుకుంది. దీనిపై సీబీఐ బెంగళూరు విభాగం నమోదు చేసిన కేసు ఆధారంగా.. ఈడీ అధికారులు మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేశారు. బ్యాంకు రుణాలను దారి మళ్లించడంలో.. సతీశ్‌కుమార్, హిమబిందు, మాధవీలత పాత్ర ఉన్నట్లు గుర్తించారు. సతీశ్‌కు చెందిన జూబ్లీహిల్స్‌లోని ఇల్లు, రాజేశ్ అనే బినామీ పేరుతో రంగారెడ్డి జిల్లా అనాజ్‌పూర్‌లో ఉన్న వ్యవసాయ భూమి, అసోంలో ఉన్న ఎమ్మిల్ ఇన్‌ఫ్రా ప్రాపర్టీస్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఉన్న 11.37 కోట్ల విలువైన టీ ఎస్టేట్, వీఎంసీ సిస్టమ్స్ పేరిట ఉన్న రూ.37.03 కోట్ల ఇతర ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో వివరించారు. ఈ ఆస్తుల విలువ రూ.55.73 కోట్లుగా ఉంటుందని వెల్లడించారు.

నేషనల్ హైవేకు భూములు ఇవ్వం

» సర్వేను అడ్డుకున్న రైతులు

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 23: జాతీయ రహదారి నిర్మాణం కోసం తమ వ్యవసాయ భూములను ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వబోమని భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపురం రైతులు అధికారులకు తేల్చిచెప్పారు. నేషనల్ హైవే కోసం గ్రామంలో రెవెన్యూ అధికారులు మంగళవారం సర్వే చేస్తుండగా రైతులు అడ్డుకున్నారు. తమ భూములు లాక్కోని రోడ్డు నిర్మాణం చేపడితే ఆత్మహత్య చేసుకుంటామని పురుగుల మందు డబ్బాలతో నిరసనకు దిగారు. వ్యవసాయమే తమకు జీవనాధారమని, "భూములు కోల్పోతే బతికేదెలా..?" అని అధికారులను నిలదీశారు. రైతులు ఆగ్రహం వ్యక్తంచేయడంతో రెవెన్యూ అధికారులు వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా శాంతించకపోవడంతో సర్వేను నిలిపివేసి వెనుతిరిగారు.

ఏడుగురితో ప్రయాణం... ప్రాణాలతో చెలగాటం!

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదాలభారీన పడకండి అని ట్రాఫిక్ పోలీసులు ఎంత చెప్పినా వాహనదారులు పెడ చెవిన పెడుతూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ద్విచక్రవాహనాలపై ఇద్దరి కంటే ఎక్కువ ప్రయాణించడం నిషేధం అలాంటిది ఓ బైకు పై ఏకంగా ఏడుగురు వెళ్లడం అందులో ఇద్దరు చిన్నారులు, ముగ్గురు మైనర్లు ఉండటం గమనార్హం. ఈ దృశ్యం మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో ఆంధ్రజ్యోతి విలేకరి కంటపడింది.



బైకుపై వెళ్తున్న ఏడుగురు

రేపట్నించి వడగాలులు

(మొదటి పేజీ తరువాయి)

మల్లూరులో 44.5, నల్గొండ జిల్లా తిమ్మాపూర్‌లో 44.4, అదే జిల్లా తిర్మలగిరి, ఇబ్రహీంపేట, ఖమ్మం జిల్లా కల్లూరులో 44.2, వనపర్తి జిల్లా పానగల్‌లో 44.3, సూర్యాపేట జిల్లా నూతనకల్‌లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో, సికింద్రాబాద్ న్యూ మెట్టుగూడలో 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో రెండు రోజుల పాటు ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, సాయంత్రం, రాత్రి వేళల్లో ఉరుములు, మెరుపులతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశముంటుందన్నారు. నగరంలో ఎండల ప్రభావంతో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ఇక, వడదెబ్బ వల్ల మంగళవారం రాష్ట్రంలో ఐదుగురు మరణించారు. వికారాబాద్ జిల్లా మాదిరెడ్డిపల్లికి చెందిన కుమ్మరి కిష్టయ్య(57), సూర్యాపేట జిల్లా కోటి నాయక్ తండాకు చెందిన ధరావత్ గోలియా(70), రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బాలరాజుపల్లికి చెందిన నాగుల బాలయ్య(55), పెద్దపల్లి జిల్లా విలోచవరం గ్రామానికి చెందిన అక్కపాక లక్ష్మి(55), ములుగు జిల్లా మహ్మద్‌గౌస్ పల్లికి చెందిన చింతల రాజు(36) చనిపోయారు.



ఐదు రాష్ట్రాలకు వడగాలుల హెచ్చరిక

వచ్చే ఐదు రోజులు దేశ మంతటా వడగాలుల ప్రభావం ఉంటుందని భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) తెలిపింది. ముఖ్యంగా ఐదు రాష్ట్రాల్లో (పశ్చిమబెంగాల్, కర్ణాటక, ఒడిసా, ఉత్తరప్రదేశ్, బిహార్) వడగాలులు తీవ్రం కానున్నాయని హెచ్చరించింది. తెలంగాణ, ఏపీ సహా దేశంలోని చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 40-45 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పేర్కొంది. రానున్న ఐదు రోజులపాటు వడగాలులు కొనసాగుతాయని, రాత్రి వేళ కూడా వేడి వాతావరణ నెలకొంటుందని హెచ్చరించింది. పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వడగాలులు వీస్తాయని.. కర్ణాటక, ఒడిసా, ఉత్తరప్రదేశ్, బిహార్‌లో నిర్దిష్ట సమయాల్లో వడగాలుల వీస్తాయని పేర్కొంది. రానున్న రెండు రోజుల్లో వాయవ్య భారతంలో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పులు చేసుకుంటాయని, ఆ తర్వాత క్రమంగా 2 నుంచి 4 డిగ్రీలు పెరుగుతాయని తెలిపింది. ఈశాన్య అసోం, ఈశాన్య బంగ్లాదేశ్‌లో తుఫాను వాతావరణం నెలకొందని, ఫలితంగా అరుణాచల్ ప్రదేశ్, అసోం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, సిక్కిం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. కాగా, ఎండల దెబ్బ ఈ నెల 26న జరిగే రెండో ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. వడగాలులపై ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో శుక్రవారం జరిగే పోలింగ్‌లో ఓటింగ్ శాతం తగ్గుతుందని ఎన్నికల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది.

అడుగంటుతున్న జలాశయాలు..

దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాల్లో మార్చి నుంచి తక్కువ వర్షపాతం నమోదవడం వలన పొడి వాతావరణం నెలకొంది. దీంతో ఏప్రిల్‌లోనే భారత్‌లోని చాలా ప్రాంతాలను నీటి సంక్షోభం పట్టిపీడిస్తోంది. దేశవ్యాప్తంగా 150 ప్రధాన జలాశయాల్లో నిల్వ స్థాయిలు మూడింట ఒక వంతు కంటే తక్కువ స్థాయికి పడిపోయాయని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) గణాంకాలు చెబుతున్నాయి. ఈ వారంలో భారత్‌లోని ప్రతి ఏడు రిజర్వాయర్లలో ఒకదానిలో మాత్రమే దాని నిల్వ సామర్థ్యంలో 50 శాతానికి ఎక్కువ నిల్వ స్థాయి ఉన్నట్టు సీడబ్ల్యూసీ డేటా సూచిస్తోంది. ఫిబ్రవరి నుంచే కర్ణాటక నీటి ఎద్దడితో సతమతమవుతోంది. దక్షిణ భారతంలో 40 డిగ్రీల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో సరస్సులు, జలాశయాలు ఎండిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు జలాశయాలు కూడా ఎండిపోయే దశలో ఉన్నాయి. కాగా, ఈ ఏడాది నైరుతి సీజన్ (జూన్ నుంచి సెప్టెంబరు)లో వర్షాలు సమృద్ధిగానే కురుస్తాయని ఈ నెల 15న ఐఎండీ తెలిపింది. అయితే వర్షాలకు ఇంకా నెల రోజులుపైనే సమయం ఉంది. కానీ ఇప్పటికే దక్షిణాదిలో 150 ప్రముఖ రిజార్వాయర్లలో 42 జలాశయాల్లో నీటి పరిమాణం 17 శాతానికి పడిపోయాయి. దక్షిణాది రాష్ట్రాల్లోని ఏడు జలాశయాల్లో నీటి నిల్వ 'డెడ్ జోన్'లోకి చేరిందని కేంద్ర జలశక్తి మంత్రి త్వ శాఖ అధికారి ఒకరు తెలిపారు. పశ్చిమ భారతంలోని 49 రిజర్వాయర్లలో నీటి పరిమాణం 34 శాతానికి పడిపోగా, ఉత్తర ప్రాంతంలోని 10 జలాశయాల్లో వాటి నిల్వ సామర్థ్యంలో 32.5 శాతానికి పడిపోయాయి. చాలా ప్రాంతాల్లో వేసవికి ముందు వేసిన పంటలు ఎండిపోతున్నాయి. రైతులు పంటలను కాపాడుకునేందుకు డీజిల్ మోటార్లు, ఎలక్ట్రిక్ పంపులపై ఆధారపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడుల్లో.. వరి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల వంటి పంటలపై నీటి కొరత ప్రభావం అధికంగా ఉంది. ఏపీలోని ఏలేరు జలాశయం, తెలంగాణకు నీరందించే నాగార్జున సాగర్‌లో చాలా తక్కువ నీరు ఉందని, సోమశిల ఎండిపోయే దశలో ఉందని అధికారులు తెలిపారు. జూరాల, కడెం ప్రాజెక్టులూ ఎండిపోతున్నాయన్నారు. కాగా, నీటి సంరక్షణ భారత్‌లో అన్ని వయసుల వారినీ ఆందోళనకు గురిచేస్తోందని 'ఎకోల్యాబ్' నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. 'ఎకోల్యాబ్ వాటర్ మార్క్ స్టడీ' పేరిట నిర్వహించిన ఈ అధ్యయనంలో దాదాపు 90 శాతం భారతీయ వయోజనులు పర్యావరణ సమస్యల గురించి తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ప్రతి ఐదుగురిలో నలుగురు స్వచ్ఛమైన, సురక్షితమైన నీటి లభ్యతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని గుర్తించారు.



సీఎం జగన్‌కు విశాఖలో వినతిపత్రం ఇస్తున్న స్టీల్‌ప్లాంటు ఉద్యోగ, కార్మిక సంఘ నాయకులు

ఎన్డీయేకే జగన్ జై!

ఉక్కు కార్మికులతో భేటీలో పరోక్షంగా అంగీకారం

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంటు కార్మిక సంఘాల నాయకులకు సీఎం జగన్ పెద్ద ఝలక్ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్ సమస్యలు పరిష్కరించాలని నేతలు కోరగా, ఆయన విచిత్రమైన సమాధానం ఇచ్చారు. "ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి 230-240 కంటే ఎక్కువ సీట్లు రాకూడదని ప్రార్థన చేయండి. అప్పుడు వైసీపీ మద్దతుతో బీజేపీ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేస్తుంది. మీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది" అని జగన్ సెలవిచ్చారు. తద్వారా కేంద్రంలో ఎన్డీయేకే తన మద్దతు ఉంటుందనే విషయాన్ని సూటిగా చెప్పేశారు. గత ఎన్నికల సమయంలో 25 ఎంపీ సీట్లు తనకు ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదాను సాధిస్తానని చెప్పిన జగన్, ఆ తర్వాత మాత్రం... 'దేవుడి దయ మనకు లేదు. కేంద్రంలో బీజేపీకి మన అవసరం లేకుండా పోయింది' అని చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూడా అదే పాట పాడటం గమనార్హం. స్టీల్‌ప్లాంటు ఉద్యోగులు, కార్మికులు ఓట్లు కలిపి 50 వేలకుపైగా ఉండడం, ఇప్పుడు వారి సహకారం అవసరం కావడంతో వైసీపీ నాయకులు.....సీఎంతో భేటీకి ఉక్కు సంఘాల నాయకులకు అపాయింట్‌మెంట్ ఇప్పించారు. అన్ని కార్మిక సంఘాలకు చెందిన 20 మంది నాయకులు మంగళవారం ఉదయం ఎండాడలో బస వద్ద జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం పరిష్కరించదగిన సమస్యలనే నాయకులు ప్రస్తావించారు. విజయనగరం జిల్లా గర్భాంలో మాంగనీస్ గనులను, పక్కనే సారిపల్లిలో ఇసుక గనుల లీజు కాలం ముగిసిపోయినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని రెన్యువల్ చేయడం లేదు. వాటిని త్వరగా రెన్యువల్ చేయాలని నాయకులు కోరగా, వాటిని రెన్యువల్ చేయలేమని పరోక్షంగా స్పష్టంచేశారు. ఆర్థిక ఇబ్బందులు చాలా ఉన్నాయని, ఈ నెల 50 శాతం జీతాలే ఇచ్చారని, సంస్థ నష్టాల్లో ఉందని నాయకులు వివరించగా...జగన్ స్టీల్ ప్లాంటు నష్టాల్లో ఉందా? అంటూ రెండు మూడుసార్లు రెట్టించి అడిగారు. దాంతో నాయకులు అవాక్కయ్యారు.



తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెట్టినోళ్లు నీతులు చెప్పడమా?

» కేసీఆర్‌పై బండి సంజయ్ ఫైర్

» సీఎం రేవంత్‌వి ఉత్తర కుమార ప్రగల్భాలు: రఘునందన్

హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): 'పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కమీషన్లకు కక్కుర్తి పడి కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను అక్రమంగా ఏపీకి దోచిపెట్టారు. అలాంటి నేతలు కూడా ఇప్పుడు నీటి పంపిణీపై మాట్లాడటమంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉంది' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, మాజీ సీఎం కేసీఆర్‌పై ధ్వజమెత్తారు. జనం నవ్వుకుంటారనే సోయి కూడా లేకుండా అపర మేధావి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గోదావరి, కృష్ణా జలాలు, ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి కట్టిన ప్రాజెక్టులన్నీ కూలిపోతున్నాయని, మొన్న కాళేశ్వరం.. తాజాగా పెద్దపల్లి ఓడేడు బ్రిడ్జి ఇందుకు నిదర్శనం అని విమర్శించారు. బీఆర్ఎస్ చేసిన అరాచకాలు, మోసాల పట్ల ప్రజలు విసిగిపోయారని, ఆ పార్టీ నేతలు ఎంత మొసలి కన్నీరు కార్చినా, పొర్లు దండాలు పెట్టినా, బస్ యాత్ర కాదు కదా.. మోకాళ్ల యాత్ర చేసినా జనం నమ్మే పరిస్థితి లేదన్నారు. అందుకే ఈనెల 27న బీఆర్ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని కూడా నిర్వహించడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు తనపైన ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆరు గ్యారెంటీలు, ప్రభుత్వ విధానాలపైన తాను ప్రశ్నిస్తుంటే.. వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని, అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డి మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ సందర్భంగా ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారని బీజేపీ ఎంపీ అభ్యర్థి ఎం. రఘునందన్‌రావు విమర్శించారు. గడిలో నుంచి దొర వచ్చి పోటీ చేస్తున్నారని తనను ఉద్దేశించి వ్యాఖ్యానించిన రేవంత్.. తమ ఊరిలోని ఏ గడిలో పుట్టానో చెబితే దానిని ఆయన పేరిట రిజిస్ట్రేషన్ చేస్తా అని ప్రకటించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ పదేళ్లలో మెదక్‌కు ఏమీ చేశారని రేవంత్ ప్రశ్నించారని, ఆయన నిలుచుండి మాట్లాడిన రోడ్డు కూడా కేంద్రం నిధులతో వేయించిందేనని చెప్పారు.

నామినేషన్లకు గడువు 2 రోజులే

» బీఆర్ఎస్ నుంచి మాలోత్ కవిత, ఆత్రం సక్కు.

» కంచర్ల కృష్ణారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్లు

» చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి నామినేషన్



నల్లగొండలో నామినేషన్ వేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ నెల 18న ప్రారంభమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ (ఆదివారం వినహాయిస్తే) మంగళవారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. గురువారం వరకు నామినేషన్లు స్వీకరించి శుక్రవారం వాటిని పరిశీలించనున్నారు. అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు ఈ నెల 29 వరకు గడువు ఉంది. కాగా, మంగళవారం వరంగల్ పార్లమెంట్ స్థానానికి 9, మహబూబాబాద్ నియోజకవర్గంలో 8 నామినేషన్లు దాఖలయ్యాయి. మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపీ మాలోత్ కవిత నామినేషన్ వేశారు. ఆదిలాబాద్ ఎంపీ స్థానంలో ఆరు నామినేషన్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆత్రం సక్కు రెండు సెట్ల నామినేషన్ వేశారు. నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి 16 నామినేషన్లు దాఖలయ్యాయి. నల్లగొండ పార్లమెంట్ స్థానానికి 8 మంది నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ తరఫున కంచర్ల కృష్ణారెడ్డి రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. భువనగిరి నియోజకవర్గానికి 18 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ రెండో సెట్ నామినేషన్ వేశారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి 13 మంది నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్(రెండో సెట్) నామినేషన్ వేశారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి 12 మంది నామినేషన్ వేశారు. బీఆర్ఎస్ తరఫున రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ వేశారు. మెదక్ లోక్‌సభ స్థానానికి 10 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు రెండో సెట్ నామినేషన్ వేశారు. జహీరాబాద్‌లో ముగ్గురు నామినేషన్ వేశారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 9 మంది నామినేషన్ వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి మూడో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క నామినేషన్ వేశారు. మహబూబ్‌నగర్‌లో ఆరుగురు నామినేషన్ వేశారు. కరీంనగర్ లోక్‌సభ స్థానంలో 12, పెద్దపల్లిలో 11 నామినేషన్లు వచ్చాయి.

గంపెడు నాణేలతో నామినేషన్

కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో ఓ స్వతంత్ర అభ్యర్థి వినూత్నంగా నామినేషన్ వేశారు. రూ.25 వేల విలువైన నాణేలను గంపలో తీసుకువచ్చి ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి అందించారు. ఈ సందర్భంగా అభ్యర్థి పేరాల మానసరెడ్డి మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని నిరుద్యోగులు, యువత, విద్యార్థి లోకం, రైతులు, వ్యాపారస్థులు, ఉద్యోగులు తనకు మద్దతుగా ఇచ్చిన చిల్లర నాణేలతో నామినేషన్ వేశానని చెప్పారు.



రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్‌కు రఘురాంరెడ్డి తరఫున నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న ఆయన మద్దతుదారులు

ఖమ్మంలో రఘురాంరెడ్డి నామినేషన్

» కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించకుండానే నామినేషన్ వేసిన పొంగులేటి వియ్యంకుడు

ఖమ్మం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అధిష్ఠానం అధికారికంగా ప్రకటించకపోయినా ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డి నామినేషన్ దాఖలు చేశా రు. మంగళవారం ఆయన తరఫున మద్దతుదార్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్‌కు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. వాటిలో ఆయనను కాంగ్రెస్ అభ్యర్థిగా పేర్కొన్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకుడు రాయల నాగేశ్వరరావు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు పేర్లు అధిష్ఠానం పరిశీలనలో ఉన్నాయి. అయితే టికెట్ ఆశిస్తున్న వారు తమ పేరుమీద మంచిరోజు ఉందని నామినేషన్లు వేస్తున్నారు. పార్టీ ఆదేశాలను బట్టి తదుపరి నిర్ణయం ఉంటుందని, మంచిరోజు కావడం వల్ల ముందుగానే రఘురాంరెడ్డి నామినేషన్ వేసినట్లు పొంగులేటి వర్గీయులు పేర్కొన్నారు.

పెద్దల సూచనతోనే రాజేందర్‌రావు నామినేషన్

» నేడో, రేపో అభ్యర్థి పేరుపై ప్రకటన వస్తుంది

» అవినీతి వల్లే బండి సంజయ్‌ని తప్పించారు: పొన్నం



కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 23: పార్టీ పెద్దల సూచన మేరకే కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్‌లో పాల్గొన్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నేడో, రేపో కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ కాం గ్రెస్ అభ్యర్థి విషయంలో అధికారిక ప్రకటన వస్తుందని చెప్పారు. మంగళవారం కరీంనగర్‌లో పొన్నం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి నామినేషన్ వేస్తారని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం తప్పని, ఆయనతో తాను మాట్లాడానని చెప్పారు. తనకు ఎవరితోనూ విభేదాలు లేవని, అంతా ఐక్యంగా ఉన్నామని వెల్లడించారు. ఎంపీగా బండి సంజయ్ కరీంనగర్ నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఏం నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. ఆయనకు చదువు, భాష రాదని.. సంస్కారం లేదని విమర్శించారు. జగిత్యాల-వరంగల్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చి మాజీ ఎంపీ వినోద్ మెడికల్ కళాశాల వైపు మార్చుకున్నా.. దానిని ప్రశ్నించకుండా సంజయ్ కుమ్మక్కు రాజకీయాలు చేశారని ఆరోపించారు. అవినీతి ఆరోపణలతోనే ఆయనను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించారని ఆరోపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● బుధవారం 24 ఏప్రిల్ 2024

Sydney Scholars India Scholarship Program 2024

Description: Sydney Scholars India Scholarship Program 2024 is an opportunity offered by the University of Sydney to Indian students who want to pursue their undergraduate or postgraduate studies in Sydney.
Eligibility: Open to Indian citizens who are classified as international students under the definition outlined in the Higher Education Support Act 2003. Applicants must have applied to an undergraduate or postgraduate coursework program at the University of Sydney, but their studies must not have commenced yet.
Prizes & Rewards: Up to $40,000 annually
Last Date to Apply: 02-06-2024
Application mode: Online Applications Only
Short Url: www.b4s.in/aj/SSIS4

Aspire Leaders Program 2024



Description: The global Aspire Leaders Program is a fully funded 14-week online leadership program offered by the Aspire Institute. It has been designed to help students unlock their potential and become well-rounded professionals.
Eligibility: This program is open for students within the age group of 18-29 years. The annual household income of the applicants should be less than ?8,00,000. Only first-generation learners are eligible to apply for the program. Participants who have enrolled in or completed an undergraduate program in the last three years can apply. Applicants must have an intermediate level of proficiency in English.
Prizes & Rewards: Free access to training modules, live sessions by Havard faculty, and much more
Last Date to Apply: 03-07-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ALPS1

The Cadence Scholarship Program 2024-25

Description: Cadence Design Systems Private Limited & Concern India Foundation invites applications from students pursuing undergraduate or postgraduate courses in the Delhi NCR, Bangalore, Pune, or Ahmedabad regions to continue their education.
Eligibility: Open to applicants residing and studying in Delhi NCR, Bangalore, Pune, or Ahmedabad (Indian nationals only) pursuing undergraduate and postgraduate courses.
Prizes & Rewards: Financial support for key educational expenses
Last Date to Apply: 30-05-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/TCSP4

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో
ఎంటెక్



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. గేట్ అర్హత ఉన్న అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మొత్తం 115 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, గేట్ వ్యాలిడ్ స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: బయోఇన్ఫర్మాటిక్స్ 25, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 18, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ 18, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 18, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ టెక్నాలజీ 18, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్ 18 సీట్లు ఉన్నాయి.

అర్హత: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 22
- **కౌన్సెలింగ్ తేదీ:** మే 31
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in, www.uohyd.ac.in

మెడికల్ జెనెటిక్స్‌లో
ట్రెయినింగ్ కోర్సు

ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ రీప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్(ఎన్ఐఆర్ఆర్‌సీహెచ్, ముంబై)కు చెందిన జెనెటిక్ రీసెర్చ్ సెంటర్- 'అప్లికేషన్ ఆఫ్ మెడికల్ జెనెటిక్స్ ఇన్ రీప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్' ట్రెయినింగ్ కోర్సును అందిస్తోంది. దీనిని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేస్తోంది. కోర్సు వ్యవధి నాలుగు వారాలు. ఇందులో జెనెటిక్ టెస్టింగ్, డయాగ్నస్టిక్ అల్గారిథమ్స్ ఫర్ జెనెటిక్ డిజార్డర్స్, చైల్డ్ హెల్త్, ఇంట్రప్రిటేషన్ ఆఫ్ జెనెటిక్ డయాగ్నస్టిక్ రిపోర్ట్, జెనెటిక్ కౌన్సెలింగ్, రీసెర్చ్ మెథడాలజీ, క్లినికల్ అండ్ ల్యాబొరేటరీ జెనెటిక్స్ అంశాలకు సంబంధించి లెక్చర్స్, సెషన్స్ నిర్వహిస్తారు. కోర్సు ఫీజు లేదు.

అర్హత: ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్/డీఎం/ఎంసీహెచ్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మెడికల్ కాలేజీలు/ఆసుపత్రులు/ఇన్‌స్టిట్యూట్‌లు/మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్స్/మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ యూనిట్స్‌కు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000 (రిఫండబుల్ డిపాజిట్)
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 25
- **ఎంపికైన అభ్యర్థులకు ఈమెయిల్ సమాచారం:** ఏప్రిల్ 30న
- **కోర్సు తేదీలు:** జూన్ 3 నుంచి 28 వరకు
- **ఈ మెయిల్:** grc@nirrch.res.in
- **వెబ్‌సైట్:** www.nirrch.res.in

కర్నూలు ఐఐఐటీడీఎంలో పీహెచ్‌డీ



కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్(ఐఐఐటీడీఎం)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు అందుబాటులో ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ, సంబంధిత జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు నిర్వహించి సెలెక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అర్హులను ఎంపిక చేస్తారు. రిటెన్ టెస్ట్‌ను గేట్ 2024 సిలబస్ ప్రకారం నిర్వహిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి గరిష్ఠంగా అయిదేళ్లు.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, ఫిజిక్స్.

సీట్లు: ఫుల్ టైమ్ పీహెచ్‌డీ(ఇన్‌స్టిట్యూట్ ఫెలోషిప్) ప్రోగ్రామ్‌లో 28 సీట్లు, ఫుల్ టైమ్ పీహెచ్‌డీ(స్పాన్సర్డ్ ప్రాజెక్ట్) ప్రోగ్రామ్‌లో 6 సీట్లు, పార్ట్ టైమ్ పీహెచ్‌డీలో 9 సీట్లు; విశ్వేశ్వరాయ స్కీమ్ కింద ఫుల్ టైమ్ పీహెచ్‌డీలో 4 సీట్లు, పార్ట్ టైమ్ పీహెచ్‌డీలో 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు నిర్దేశించిన బ్రాంచ్‌లలో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ ఉత్తీర్ణులై ఉండాలి. ఐఐటీ/సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తిచేసిన వారు కూడా అర్హులే. గుర్తింపు పొందిన ఇతర ఇంజనీరింగ్ కళాశాలల నుంచి కనీసం 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారికి గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. మేథమెటిక్స్‌కు ఎమ్మెస్సీ(మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) ఉత్తీర్ణతతోపాటు గేట్/సీఎస్ఐఆర్ నెట్/ఎన్‌బీహెచ్ఎం/ఇన్‌స్పయిర్ ఫెలోషిప్ అర్హత ఉండాలి. ఫిజిక్స్ విభాగానికి ఎమ్మెస్సీ(ఫిజిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/మెటీరియల్ సైన్స్) ఉత్తీర్ణతతోపాటు గేట్/సీఎస్ఐఆర్ నెట్/ఇన్‌స్పయిర్ ఫెలోషిప్ అర్హత ఉండాలి. పార్ట్ టైం ప్రోగ్రామ్‌నకు అప్లయ్ చేసుకోవాలంటే పీజీ అభ్యర్థులకు కనీసం మూడేళ్ల అనుభవం, డిగ్రీ అభ్యర్థులకు కనీసం ఆరేళ్ల రీసెర్చ్ అనుభవం ఉండాలి. ప్రభుత్వ ఆర్ అండ్ డీ సంస్థలు/ప్రముఖ ఎడ్యుకేషనల్ సంస్థలు(ప్రభుత్వ/ప్రైవేట్)/పీఎస్‌యూలు/ప్రభుత్వ పరిశ్రమల్లో సీ గ్రేడ్ సైంటిస్టులు/అసిస్టెంట్ ప్రొఫెసర్లు/ లెక్చరర్లు/ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లుగా పనిచేస్తూ ఉండాలి.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: ఫుల్ టైం అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000ల జేఆర్ఎఫ్; చివరి మూడేళ్లు నెలకు రూ.42,000ల ఎస్ఆర్ఎఫ్ చెల్లిస్తారు. అభ్యర్థులు వారానికి ఎనిమిది గంటలసేపు హాఫ్ టైమ్ టీచింగ్/రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ వర్క్ చేయాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** మే 22
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** జూన్ 5, 6
- **ఫలితాలు విడుదల:** జూన్ 11
- **ఫస్ట్ సెమిస్టర్ ఫీజు చెల్లింపులు:** జూన్ 18
- **తరగతులు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** iiitk.ac.in

లిటిల్స్



అఖండ విజయం వైర్యాగ చింతన!

అనగనగా ఓ రాజ్యం. ఆ రాజ్యంలో ఓ పేద వ్యక్తి ఉండేవాడు. అతనికి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. పేరుకు పేదవాడే కానీ గట్టివాడు. దైవభక్తి కలవాడు. అనుకున్నది చేయాలనుకునే కసి ఉన్నోడు. అతనికి ఉండే యావత్ ఆస్తి పార. ఆ పారతో మడులు తవ్వి, కూరగాయల పంటలు పండించేవాడు. ఆ కూరగాయలను అమ్మగా వచ్చిన డబ్బుతో పొట్ట పోసుకునేవాడు.

ఒకసారి కూరగాయలు అమ్మాడు. ఇంటికి వస్తోంటే వైరాగ్యం కలిగింది. దీంతో ఆ పారను పొలంలో పాతి పెట్టి వైరాగ్యంతో అడవులకు వెళ్లిపోయాడు. తపస్సు చేసుకున్నాడు. కొన్నాళ్లకు మళ్లీ వచ్చాడు. కూరగాయలు పండించి మళ్లీ బతకటం ఆరంభించాడు. అలా ప్రతి సారి ఆ పేదవాడికి వైరాగ్యం కలిగేది. అడవులకు వెళ్లి తపస్సు చేసుకునేవాడు. వెళ్లిన ప్రతి సారి పారను పూడ్చి పెట్టేవాడు. అది అతి రహస్యమైన మనుషులు తిరగని ప్రాంతంలో పూడ్చిపెట్టేవాడు.


అలా ఆరుసార్లు పారను పూడ్చిపెట్టాడు. ఆరుసార్లు తపస్సు చేసుకున్నాడు. ఈ పార వల్లనే తన ఆధ్యాత్మిక చింతన తగ్గుతోందని లేకుంటే బాగా ఉండేవానినని.. ఈ పాటికి తపస్సులో కూడా మోక్షం పొందేవాడినని.. ఇలా ఏదేదో అనుకున్నాడు. రహస్యంగా పూడ్చిన పారను తీసుకున్నాడు. ఒక గుట్ట ఎక్కాడు. ఆ పారను పైనుంచి విసిరివేసాడు. అది ఎక్కడ పడుతుందో తెలీకూడదని కళ్లు కూడా మూసుకున్నాడు. ఎంతో ఆనందంతో చిందులేశాడు. అఖండ విజయం సాధించానని గట్టిగా నవ్వుతున్నాడు. పేదవాడి ముఖం వెలిగిపోతోంది. అదే సమయంలోనే రాజుగారు శత్రువులను చండాడి ఇంటికి వస్తున్నాడు. ఆ సమయంలో పేదవాడి నవ్వులు వినపడ్డాయి. ఇది అఖండ విజయం అనే మాట వినపడింది. సైనికులను పంపి వాడిని పట్టుకురండి అన్నాడు. పారపోయిన ఆనందంతో అసలే పారవశ్య ఆనందంలో ఉన్న పేదవాడిని చూసి రాజు అసూయపడ్డాడు. ఇంత ఆనందంగా ఎలా ఉండగలుగుతున్నావు? నేను విజయం సాధించినా ఆనందం లేదే? అన్నాడు రాజుగారు. పేదవాడు విషయం అంతా చెప్పాడు. పేదవాడి కథ బాగా అనిపించింది. పేదవాడికి బంగారు నాణేలు ఇవ్వండి అన్నాడు. అతను తీసుకోవటానికి ఒప్పుకోలేదు.

పేదవాడు ఇంటి దారి పడ్డాడు. ఎక్కడికి? అని అడిగాడు. 'హిమాలయాలకు తపస్సు చేసుకోవటానికి' అన్నాడు. 'నేనూ నీతో వస్తా పదా' అంటూ ఆ పేదవాడి వెంటనే రాజుగారు వెళ్లిపోయాడు. ఈ చోద్యం చూసి అక్కడి రాజు పరివారం ఆశ్చర్యపోయారు. వైరాగ్య చింతనతో పేదవాడు-రాజుగారు ఆనందంగా హిమాలయాలకు వెళ్లిపోయారు.

జత ఉన్న బొమ్మ ఏది?



దారి కనుక్కోండి



10 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 289

				9	5		4	
		1	2					6
					8			3
		9					1	
	7	3	9		2	8	5	
	6					9		
5			7					
8					6	2		
	3		5	8				

సుడోకు - 288 సమాధానం

8	6	5	2	3	9	7	4	1
2	7	1	4	8	6	5	9	3
4	3	9	7	1	5	8	6	2
7	4	8	6	5	2	3	1	9
9	1	3	8	7	4	6	2	5
5	2	6	3	9	1	4	7	8
3	9	7	1	4	8	2	5	6
1	8	2	5	6	7	9	3	4
6	5	4	9	2	3	1	8	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారత్ సొంత సూచీలను ఏర్పాటు చేసుకునే తరుణం ఆసన్నమయ్యిందా?

(నిన్నటి తరువాయి)



● మానసిక ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు వంటివి ఒక వ్యక్తి ఆనందంగా ఉండటానికి ప్రధాన హేతువులుగా ఉంటాయి. భారతదేశంలో పటిష్ఠ వివాహవ్యవస్థ, దృఢ కుటుంబ సంబంధాలు - వయో వృద్ధుల సంరక్షణలో కీలకపాత్ర వహిస్తున్నాయి. కానీ పాశ్చాత్యదేశాల్లో వయోవృద్ధులు తమ జీవనాన్ని తామే ఒంటరిగా కొనసాగించాల్సిన పరిస్థితులు ఉంటాయి. పైగా ప్రస్తుతం ఆనందసూచీలో అగ్రస్థానంలో ఉన్న నార్డిక్ దేశాల్లో కుంగుబాటు సమస్య ప్రపంచంలోనే అత్యధికంగా కనిపిస్తూ ఉంటుంది. ఆ దేశాల్లో కుంగుబాటు, ఎడిక్షన్, యాంగ్జైటీ వంటి మానసిక రుగ్మతలను ఎదుర్కోవడానికి యాంటీ డిప్రెసెంట్ల వినియోగం ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో ఉందని ఐఈసీడీ(ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) సంస్థ నివేదికలు తెలుపుతున్నాయి. అదేవిధంగా గత దశాబ్దకాలంలో యురోపియన్ దేశాల్లో మానసిక రుగ్మతల కోసం ప్రిస్క్రిప్షన్ డ్రగ్స్ వినియోగం రెండున్నర రెట్లు పెరిగిందని సర్వేలు చెబుతున్నాయి. ఇలాంటి దేశాల ఆనంద సూచీల్లో అగ్రస్థానంలో ఉండటం సూచీ నిర్మాణ ప్రాతిపదికల్లో డొల్లతనాన్ని నిరూపిస్తున్నాయి.

● ఇక 'వి-డెమ్(వెరైటీస్ ఆఫ్ డెమోక్రసీ)' అనే స్వీడన్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఏటా 'లిబరల్ డెమోక్రసీ ఇండెక్స్' పేరిట ప్రపంచ ప్రజాస్వామ్య సూచీని ప్రకటిస్తుంది. ఈ సూచీ నిర్మాణం కోసం 71 ఇండికేటర్స్‌ను తీసుకొని వాటిని

(1) లిబరల్ కాంపోనెంట్ ఇండెక్స్(ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణ, కార్యనిర్వాహక శాఖలపై శాసనపరమైన అడ్డంకులు)

(2) ఎలక్టోరల్ డెమోక్రసీ ఇండెక్స్(స్వేచ్ఛాయుత, న్యాయబద్ధమైన ఎన్నికలు, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, సంఘాలు ఏర్పాటుచేసుకునే స్వేచ్ఛ)

(3) ఇగాలిటేరియన్ కాంపోనెంట్ ఇండెక్స్(వివిధ సామాజిక సమూహాల మధ్య గల సమానత్వ స్థాయిలు)

(4) పార్టిసిపేటరీ కాంపోనెంట్ ఇండెక్స్(పౌర సంఘాలు, ప్రజా సంఘాల బలం).

(5) డెలిబ్రేటివ్ కాంపోనెంట్ ఇండెక్స్(రాజకీయ నిర్ణయాలు, ప్రజా సంక్షేమం, శ్రేయస్సు కోసం తీసుకుంటున్నాయా లేదా భావోద్వేగాలు, నిర్బంధాల వల్ల తీసుకుంటున్నాయా)

● ఈవిధంగా అయిదు కేటగిరీల కిందకు వివిధ ఉపఅంశాలను చేర్చి దత్తాంశాలను సేకరించడానికి ప్రశ్నావళిని తయారుచేస్తున్నారు. అయితే ఈ ప్రశ్నావళి సామాన్య ప్రజల నుంచి సమాచారాన్ని రాబట్టడానికి కాదు. ఆ రంగాల్లో, ఆ దేశాల్లో నిష్ణాతులైన ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రొఫెసర్ల వంటి మేధావుల నుంచి(రమారమి 3700 మంది) విస్తృతంగా అభిప్రాయాలు సేకరించడానికి వినియోగిస్తున్నారు. ఈ భారీ సమాచారాన్ని అల్గరిథమ్స్‌ను వినియోగించి విశ్లేషించి దేశాలకు ర్యాంకింగ్‌లు ఇస్తారు.

● అయితే అసలు ప్రజాస్వామ్య మనుగడలో లేని, నియంతృత్వం రాజ్యమేలుతున్న దేశాలు భారత దేశం కన్నా మంచి స్థానాన్ని ప్రజాస్వామ్య సూచీలో పొందడం ఈ దత్తాంశ సేకరణ, విశ్లేషణ విధానాల్లో లోపాలను తేటతెల్లం చేస్తున్నాయి. ప్రజల అభిప్రాయాలు, స్థానిక పరిస్థితుల అంచనాల స్థానంలో మేధావుల అసంతృప్తి, వారి ఆలోచనా వైవిధ్యతలను కొలమానంగా తీసుకోవడం వల్ల, ఎక్కువ ప్రజాస్వామిక పరిస్థితులు ఉన్న స్వేచ్ఛాపూరిత వాతావరణం, అసంతృప్తి వెలువరించడానికి అవకాశం ఉన్న దేశాలకు అధమ ర్యాంకులు దక్కుతుంటాయి.

● ఇక పత్రికాస్వేచ్ఛ సూచీ విషయానికి వస్తే 'రిపోర్టర్స్ విత్‌అవుట్ బోర్డర్స్' అనే ప్యారిస్‌కు చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ ఏటా ప్రపంచ పత్రికాస్వేచ్ఛ సూచీని విడుదల చేస్తుంది. ఈ సూచీ నిర్మాణానికి రిపోర్టర్స్ విత్‌అవుట్ బోర్డర్స్ సంస్థకు చెందిన నెట్‌వర్క్‌లోని 150 మంది కరస్పాండెంట్స్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉన్న రీసెర్చర్స్, మానవ హక్కుల కార్యకర్తలు, ప్రముఖ న్యాయకోవిదులు వంటివారిని ఎన్నుకుని వారికి ప్రశ్నావళిని ఆన్‌లైన్‌లో పంపిస్తారు. అంతేకాక ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్(భావవ్యక్తీకరణ స్వేచ్ఛ) కోసం కృషిచేస్తున్న 18 స్వచ్ఛంద సంస్థలకు కూడా ఈ ప్రశ్నావళిని పంపుతారు. ఈ ప్రశ్నావళిలో 83 ప్రశ్నలు ఆరు కేటగిరీల్లో

1) బహుళత్వం(ప్లూరలిజం)
2) మీడియా స్వతంత్రత
3) పాత్రికేయ వాతావరణం, సెల్ఫ్ సెన్సార్‌షిప్
4) పారదర్శకత
5) చట్టబద్ధ కార్యాచరణ
6) వార్తలు, సమాచార వ్యాప్తికి ఉన్న మౌలిక సదుపాయాల నాణ్యత వర్గీకరించి ఉంటాయి.

● ఈవిధంగా రాబట్టిన సమాధానాలకు సదరు దేశాల్లో పాత్రికేయులపై జరిగిన దాడులు వంటి దత్తాంశ సమాచారాన్ని జతచేసి క్రోడీకరించి దేశాల వారీగా ర్యాంకులు విడుదల చేస్తారు. అయితే ఈ సర్వేలో పాల్గొనే 18 స్వచ్ఛంద సంస్థలకూ రిపోర్టర్స్ విత్‌అవుట్ బార్డర్స్ సంస్థ ప్రధాన నిధుల వితరణదారుగా ఉంది. అంతేకాక ఈ సర్వేలో వినియోగిస్తున్న ప్రశ్నావళిలోని అంశాలకు వాటి కేటగిరీ వారీగా, ప్రశ్నల వారీగా ఎంత స్కోర్‌ను కేటాయిస్తున్నారు. ఎవరెవరిని ప్రశ్నావళికి జవాబిచ్చే వారిగా ఎన్నుకుంటున్నారనే విషయాల్లో పారదర్శకత లేదు. అదేవిధంగా 150 మంది నిష్ణాతుల్ని, 18 స్వచ్ఛంద సంస్థలనూ, ప్రతి దేశానికి సంబంధించి 83 ప్రశ్నలకు సమాధానం ఇవ్వమని అడిగినప్పుడు వారు ఏ దేశాల పట్ల పక్షపాతం చూపకుండా వ్యవహరిస్తారని చెప్పలేం. పైగా కొద్దిపాటిమంది కలిసి దేశాల పరిస్థితులను బేరీజు వేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రామాణిక విధానం కాదు. అందువల్లనే ఆఫ్ఘనిస్థాన్, ఉగాండా, యూఏఈల కంటే భారత్ అథమస్థానంలో ఉందని విశ్లేషకుల భావన.

భారత్ సొంత సూచీలను ఏర్పర్చుకోవాల్సిన అవసరం

1. ప్రస్తుతం ఉన్న సూచీలు పాశ్చాత్య దేశాల కనుసన్నల్లో మెలిగే స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రూపొందుతున్నాయి. ఆ సంస్థలకు భారీగా నిధులు సమకూర్చే దేశాలకు వాటి భౌగోళిక రాజకీయాలు, వ్యూహాలకు అనుగుణంగా ఇవి ప్రవర్తించే అవకాశం ఉంది.
2. ఈ సంస్థలు ఇచ్చే సూచీ రేటింగ్స్ ఆధారంగా ప్రపంచ దేశాలకు ఒక దేశంపై అభిప్రాయం స్థిరపడుతుంది. విదేశీ పెట్టుబడులు రావడానికి, పర్యాటకులు రావడానికి మంచి ర్యాంకింగ్స్ సహకరిస్తాయి. అదేవిధంగా వారు దూరం జరగడానికి కూడా అధమ ర్యాంకింగ్స్ కారణమవుతాయి.
3. ఒక దేశ అంతర్జాతీయ స్థాయీ ఈ ర్యాంకింగ్‌ల వల్ల/సూచీల వల్ల ప్రభావితమవుతుంది.
4. ఇప్పటికే భారతదేశం గడచిన కొంతకాలంలోనే తన చుట్టుపక్కల ఉన్న అస్థిరదేశాలు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కొన్ని నియంతృత్వ దేశాలు, యుద్ధ పరిస్థితులు నెలకొన్న దేశాల కంటే అధమస్థాయిని నిష్కారణంగా పొందింది. దేశంలోని సుస్థిర ప్రజాస్వామ్య పరిస్థితులు, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, సంతోషకర పరిస్థితులు కల్పించగల ప్రజాసంక్షేమ కార్యక్రమాల గురించి ప్రపంచానికి తెలియజేయాలి. తద్వారా ఇంతకాలం మోస్తున్న అపవాదు తొలగించుకోవాల్సి ఉంది.
5. వివిధ అంతర్జాతీయ సూచీలపరంగా ఉన్న లోపాలను సరిచేసి ప్రత్యామ్నాయ సూచీలను, దత్తాంశ సేకరణ విధానాలను రూపొందించాల్సిన ఆవసరం ఉంది.

● ఈ పరిస్థితుల్లో భారతదేశం తన సొంత సూచీల రూపకల్పన దిశగా, భారత ప్రభుత్వానికి సుదీర్ఘ కాలం వివిధ అంశాలపరంగా మేధామధన సహకారం అందిస్తున్న థింక్‌ట్యాంక్ సంస్థ ఓఆర్ఎఫ్(అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్) ఢిల్లీ కేంద్రంగా పనిచేసే స్వచ్ఛంద సంస్థకు సూచీల రూపకల్పన బాధ్యతలను అందించింది.

● అయితే ప్రపంచ సూచీల్లో అగ్రస్థానంలో ఉన్న నార్డిక్ వంటి దేశాల జీవన ప్రమాణాల స్థాయులు మిగిలిన ప్రపంచ దేశాలతో పోలిస్తే ఏవో కొన్ని అంశాల్లో తప్ప చాలా హెచ్చుగానే ఉంటాయి. ఇది కాదనలేని సత్యం. భారతదేశానికి ఇతర దిగువ స్థాయి దేశాలతో పోల్చితే తక్కువస్థాయి ర్యాంక్ లభించడం గర్హనీయమే. అత్యున్నత ర్యాంకులు పొందిన దేశాల్లో ఉన్న పరిస్థితులతో పోలిస్తే చాలా దిగువస్థాయి పరిస్థితులే దేశంలో ఉన్నాయి. సొంత సూచీల ఏర్పాటుతో అంతర్జాతీయ అపఖ్యాతిని తొలగించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలకు తోడు, ప్రజల జీవన ప్రమాణాల పెంపుపై కూడా అత్యంత శ్రద్ధ వహించడం ద్వారా అంతర్జాతీయ ఖ్యాతిని పొందగలం.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్